www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 2-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 33

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం, తిథి: నవమి రా. 1.53 తదుపరి దశమి; నక్షత్రం: ధనిష్ఠ రా. 1.49 తదుపరి శతభిషం, వర్జ్యం: ఉ.6.57-8.27; దుర్ముహూర్తం: ఉ.10.05-10.56, మ.3.09-4.00; అమృతఘడియలు: సా.4.00-5.31; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.32

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జూలైలో వలంటీర్ల వ్యవస్థ తీసుకొస్తాం


వారికి నెలకు రూ.10వేల చొప్పున వేతనం.. ప్రజలకు పథకాలు అందించేలా కార్యాచరణ

రాజీనామా పేరిట హరీశ్‌రావు డ్రామాలు: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ, మే 1: గ్రామాలు, పట్టణాల్లో వలంటీర్ల వ్యవస్థను తీసుకువస్తామని, వారి ద్వారానే ప్రజలందరికీ పథకాలు అందేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. వలంటీర్లకు ప్రతి నెలా రూ.10వేల చొప్పున వేతనం ఇస్తామని, జూలై నుంచే అమల్లోకి తీసుకొస్తామని చెప్పారు. నల్లగొండలో బుధవారం

మిగతా 12వ పేజీలో...



కూకట్‌పల్లిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి; హాజరైన జనం

బల్ల గుద్ది చెబుతున్నా.. బీజేపీకి వేసే ప్రతి ఓటూ

రిజర్వేషన్ల రద్దుకే

రాజ్యాంగం మార్చాలా? వద్దా? అన్నదే ఇప్పుడు చర్చ

మార్చాలంటే ఎన్డీయే.. వద్దనుకుంటే 'ఇండియా'..

ఎటువైపుంటారో ఎస్సీ, ఎస్టీ, బీసీలే తేల్చుకోవాలి

ఆర్‌ఎస్‌ఎస్ మూల సిద్ధాంతమే.. రిజర్వేషన్ల రద్దు

దాన్ని అమలు చేసే రాజకీయ కార్యాచరణ పేరే బీజేపీ

నన్ను బెదిరించడం మోదీ, అమిత్ షా వల్ల కాదు

నాపై దాడి అంటే.. తెలంగాణపై చేసినట్టే: రేవంత్

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): "ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో సంక్షేమం, అభివృద్ధి అంశాలు సందర్భోచితం కాదు. రాజ్యాంగాన్ని మార్చాలా? మార్చకూడదా? అన్నదే ఇప్పుడు చర్చనీయాంశం. రాజ్యాంగాన్ని మార్చొద్దంటే ఇండియా కూటమి.. మార్చాలంటే ఎన్డీయే కూటమి... ఎటువైపు ఉండాలో దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలే నిర్ణయించుకోవాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాను బల్ల గుద్ది చెబుతున్నానని, బీజేపీకి వేసే ప్రతి ఓటూ దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాంగం

మిగతా 12వ పేజీలో...

కాంగ్రెస్ గూటికి ఇంద్రకరణ్‌రెడ్డి 12

కండువా కప్పి ఆహ్వానించిన దీపాదాస్ మున్షీ

అమిత్ షా ఫేక్ వీడియోతో

నాకేం సంబంధం?

టీ కాంగ్రెస్ 'ఎక్స్' అకౌంట్‌కు నేను బాధ్యుడిని కాను

సీఎంవో తెలంగాణ, వ్యక్తిగత ఎక్స్ ఖాతాలే వినియోగిస్తున్నా

న్యాయవాది ద్వారా ఢిల్లీ పోలీసులకు రేవంత్ వివరణ

ఝార్ఖండ్ పీసీసీ చీఫ్ రాజేశ్‌ఠాకూర్‌కూ ఢిల్లీ పోలీసుల సమన్లు 12

బీజేపీ చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడుతోంది

ఢిల్లీ పోలీసుల నోటీసుపై 15 రోజుల గడువు కోరాం

సీఆర్‌పీసీ 41 నోటీసులిచ్చి భయపెడుతున్నారు

టీపీసీసీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ రాంచంద్రారెడ్డి 12

తెలంగాణలో 12 పక్కా

కష్టపడితే మరో మూడు స్థానాలు గెలిచే చాన్స్.. రాష్ట్రంలో భవిష్యత్తు బీజేపీదే

పార్టీ ముఖ్యనేతలతో అమిత్ షా .. ప్రచారం మరింత ఉధృతం చేయాలని ఆదేశం

ఈ నెల 8, 10 తేదీల్లో రాష్ట్రంలో మోదీ ప్రచారం

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ 12 సీట్లు ఖాయంగా గెలుచుకోబోతోందని ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మరో మూడు స్థానాల్లో గట్టి పోటీ ఉందని, స్థానిక నాయకత్వం కష్టపడితే వాటిలో కూడా అద్భుతం జరుగుతుందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీకి ఆదరణ అనూహ్య స్థాయిలో పెరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో భవిష్యత్తు బీజేపీదేనని ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త, తన కుటుంబంతోపాటు మరో మూడు కుటుంబాలను ప్రభావితం చేసేలా కష్టపడి పనిచేయాలని సూచించారు. బుధవారం బీజేపీ

మిగతా 10వ పేజీలో...

మతపరమైన రిజర్వేషన్లు ఇవ్వబోమని కాంగ్రెస్

రాతపూర్వకంగా హామీ ఇవ్వగలదా?


బీజేపీ ఉన్నంత వరకూ రిజర్వేషన్లు ఉంటాయి

ప్రధాని నరేంద్ర మోదీ

అబద్ధాలను పదే పదే చెప్పడం కాంగ్రెస్ నైజం: షా

ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పని ఖతం 11

గాంధీజీ ఆకాంక్ష నెరవేరుతుంది: రాజ్‌నాథ్



శాలిబండ రోడ్‌షోలో షా, మాధవీలత, రాజాసింగ్, కిషన్‌రెడ్డి

రజాకార్ల ప్రతినిధిని ఓడించాలి

ఆయన పాలన నుంచి హైదరాబాద్‌కు విముక్తి

400 సీట్లలో హైదరాబాద్ కమలం ఉండాలి

హిందువులు, ముస్లింలు బీజేపీని గెలిపించాలి

పాతబస్తీ రోడ్‌షోలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

రోడ్‌షోలో దర్శనమిచ్చిన ఎమ్మెల్యే రాజాసింగ్ 10

ఫేక్ వీడియోపై పూర్తి బాధ్యత రేవంత్‌దే

ఆయనే తొలి ముద్దాయి

ఎంతటివారున్నా వదలం

జైలు ఊచలు లెక్కపెట్టక తప్పదు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



పెళ్లంటే పాటలు, డ్యాన్స్‌లు కాదు

సంప్రదాయం ప్రకారం నిర్వహిస్తేనే హిందూ వివాహం చెల్లుబాటు

రిజిస్ట్రేషన్ రుజువు మాత్రమే చట్టబద్ధం కాదు: సుప్రీం కోర్టు 11



ఏప్రిల్‌లో 2.10 లక్షల కోట్లు 14

జీఎస్టీ వసూళ్లలో సరికొత్త రికార్డు

తొలిసారిగా రూ.2 లక్షల కోట్ల మైలురాయి

ఆంధ్రప్రదేశ్‌లో రూ.4,850 కోట్లు..

తెలంగాణలో రూ.6,236 కోట్ల వసూళ్లు

సిర్పుర్కర్ కమిషన్ రిపోర్టు సస్పెన్షన్

తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు అమల్లో..

దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై చర్యలొద్దన్న హైకోర్టు 3



ఆఫ్‌లైన్‌లోనే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

ఓఎంఆర్ విధానంలో నిర్వహణ: టీఎస్‌పీఎస్సీ

కేసీఆర్ ప్రచారంపై 48 గంటల నిషేధం

ఎన్నికల సంఘం ఉత్తర్వులు

కాంగ్రెస్ ఫిర్యాదు నేపథ్యంలో చర్యలు

గత నెల సిరిసిల్లలో ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేసిన కేసీఆర్

ఆ వ్యాఖ్యలు అవమానకరమన్న ఈసీ

మోదీ మతవిద్వేష వ్యాఖ్యలు, రేవంత్ బూతులు ఈసీకి వినపడవా?

తీవ్రంగా ఖండించిన కేటీఆర్, హరీశ్



న్యూఢిల్లీ, హైదరాబాద్, సిరిసిల్ల, మహబూబాబాద్, చిన్నకోడూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంటూ బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ఎన్నికల సంఘం (ఈసీ) చర్యలు చేపట్టింది. ఆయన ఎన్నికల ప్రచారంపై 48 గంటల పాటు నిషేధం విధించింది. బుధవారం రాత్రి 8 గంటల నుంచి శుక్రవారం రాత్రి 8 గంటల వరకు ఈ నిషేధం అమలులో ఉండనుంది. ఈ మేరకు ఉత్తర్వులను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు.. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు శివారు పెద్దతండా క్రాస్‌రోడ్డు వద్ద కేసీఆర్‌కు అందజేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి బయలుదేరిన

మిగతా 12వ పేజీలో...

నా కనుగుడ్లు పీకేస్తా.. పేగులు మెడలో వేసుకుంటానన్న రేవంత్‌పై

ఎందుకు నిషేధం పెట్టలే?

ఉచిత బస్సు పథకం మంచిదే.. కానీ ఆటోవాలాల పొట్ట కొట్టింది

ఈ దుష్టపాలనలో రైతులు చస్తున్నరు: కేసీఆర్

మానుకోటలో బస్సుయాత్ర, కార్నర్ మీటింగ్

రాత్రి 7:20 నుంచి 14 నిమిషాల ప్రసంగం

మహబూబాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): 'నేను ప్రచారం చేయకుండా 48 గంటల నిషేధం విధించిన భారత ఎన్నికల సంఘం, నా పేగులు మెడలో వేసుకుంటా.. కనుగుడ్లు పీకుతానన్న రేవంత్ రెడ్డిపై ఎందుకు నిషేధం విధించలేదు?' అని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. తన ప్రచారంపై 48 గంటల నిషేధం విధించినా పార్టీ కార్యకర్తలు 96 గంటలు అవిశ్రాంతంగా పనిచేస్తారని చెప్పారు. కాంగ్రెస్‌ది దుష్టపరిపాలన అని, ఈ పాలనలో రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని ఓ కొనుగోలు

మిగతా 12వ పేజీలో...

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్

క్రిశాంక్ అరెస్ట్ 12



పంతంగి టోల్‌గేట్ వద్ద అదుపులోకి

ఓయూ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

క్రిశాంక్ వైరల్ చేసిన నోటీసు నకిలీదే

ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ వెల్లడి

అంగడి సరుకుగా ఆంధ్రా ప్రజల డేటా

వ్యక్తిగత సమాచారాన్ని ప్రభుత్వ వెబ్‌సైట్లలో అందరికీ అందుబాటులో ఉంచుతున్న జగన్ ప్రభుత్వం 10

ఒక్క క్లిక్‌తో ఎవరికైనా కీలక సమాచారమంతా లభ్యం

ఇంటి అడ్రస్ నుంచి బ్యాంకు ఖాతా నంబర్ వరకు..

పెళ్లి ఫొటోల నుంచి పాస్‌పోర్టు, పాన్ కార్డు వరకు..


ఆధార్, రేషన్ కార్డులు, ఫోన్ నంబర్లు.. అన్నీ ఓపెన్

సైబర్ నేరగాళ్లకు ఏపీ సర్కారు 'సమాచార విందు'

ఐదేళ్లుగా ఇదే తంతు.. పట్టించుకున్న వాళ్లుంటే ఒట్టు

'క్రిటికల్ రివర్' కంపెనీ వద్ద సమస్త సమాచారం!

రాష్ట్రంలో ఎండల మంటలు



బుధవారం మధ్యాహ్నం వెలవెలబోతున్న తెలుగుతల్లి ఫ్లైఓవర్

మునుగోడులో 46.6 డిగ్రీలు

రాష్ట్రంలో మరో 13 చోట్ల 46 డిగ్రీల ఉష్ణోగ్రత.. వడదెబ్బకు ఏడుగురి మృతి

రాష్ట్రంలో పోలింగ్ సమయం పెంపు

ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఓటు వేసేందుకు అవకాశం

ఎండల తీవ్రత దృష్ట్యా ఎన్నికల కమిషన్ నిర్ణయం 3

500 కోట్ల భూమి రాసిచ్చేశారు!

గత సర్కారు హయాంలో భూదందా.. స్వాధీనం చేసుకున్న ప్రస్తుత ప్రభుత్వం

రంగారెడ్డి జిల్లా పొక్కల్ వాడలో ఐదెకరాల సర్కారీ భూమి.. రూ.36 లక్షలతో ప్రహరీగోడ సైతం నిర్మించిన అధికారులు

అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఓ బడా రియల్ ఎస్టేట్ సంస్థ కన్ను.. ఆ సంస్థకు నాటి ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల సాయం

పాస్ బుక్స్ కోసం ధరణిలో దరఖాస్తు.. వెంటనే ఆమోదం.. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన స్థానికులు

స్థానిక తహసీల్దార్ నివేదిక మేరకు పాస్‌బుక్‌లు రద్దు చేసి, ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న కలెక్టర్ శశాంక



ఇద్దరిపై రాయదుర్గం పీఎస్‌లో క్రిమినల్ కేసు నమోదు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

అందరూ అసెంబ్లీ ఎన్నికల హడావుడిలో ఉన్నప్పుడు.. రూ.500 కోట్ల విలువ చేసే సర్కారీ భూమి చేతులు మారింది! అన్ని పత్రాలూ ఉన్నా పాస్‌పుస్తకాల కోసం ధరణిలో దరఖాస్తు చేసుకుంటే ఇవ్వడానికి నానా తంటాలూ పెట్టే అధికారులు.. ఎలాంటి పత్రాలూ సమర్పించకున్నా.. ప్రభుత్వ పోరంబోకు భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ పాస్ బుక్స్ జారీ చేసేశారు!! గత ప్రభుత్వ పెద్దలు, అధికారుల సాయంతో ఓ బడా రియల్ ఎస్టేట్ సంస్థ.. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పొక్కల్‌వాడలో సాగించిన భూదందా ఇది. రాజధాని నగరంలో

మిగతా 3వ పేజీలో...

డిఫెన్స్, ఏరోస్పేస్ స్టార్టప్‌లకు ప్రోత్సాహం

టీ-హబ్‌తో ఏడు ప్రముఖ సంస్థల ఒప్పందాలు

హైదరాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల్లో వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ముందుకు వచ్చాయి. ఈ రంగాల్లో స్టార్టప్‌లకు సహకారం అందించేందుకు ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్పేస్ స్టడీస్ అండ్ రీసర్చ్(ఐఐఎస్ఎస్ఆర్), భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్), స్మాల్ ఇండస్ట్రీస్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ), కవచ్, ఇజ్రాయెల్‌కు చెందిన డిఫెన్స్ రిసర్చ్ డెవలప్‌మెంట్ డైరెక్టరేట్, కోలిన్స్ ఏరోస్పేస్, ది కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్మెంట్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లు ముందుకు వచ్చాయి. ఈ మేరకు బుధవారం టీ-హబ్‌లో జరిగిన నేషనల్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ ఇన్నోవేషన్ సమిట్‌లో ఈ సంస్థలు టీ-హబ్‌తో పరస్పర అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో రక్షణశాఖ కార్యదర్శి గిరిధర్ అరామనే, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, డీఆర్డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి సైంట్ ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, టీ-హబ్ సీఈవో మహంకాళి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవోయులు కుదుర్చుకున్న సంస్థలను జయేష్ రంజన్ అభినందించారు. ఈ ఒప్పందాలతో డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల్లో ఆవిష్కరణలు మరింతగా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

500 కోట్ల భూమి రాసిచ్చేశారు!

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఒకటైన మణికొండను అనుకుని ఉన్న ఈ భూమి చుట్టూ.. సర్కారు నిర్మించిన ప్రహరీ గోడ అలా ఉండగానే అక్రమార్కులు దాన్ని చెరబట్టడం గమనార్హం. కానీ.. స్థానికులు ఈ వ్యవహారం గురించి కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో చెర వీడింది. అక్రమార్కులపై కేసు నమోదైంది. వారి పేరిట జారీ అయిన పాస్‌బుక్స్‌ను జిల్లా కలెక్టర్ శశాంక రద్దు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గండిపేట మండలం పొప్పల్‌వాడ గ్రామంలోని సర్వేనంబరు 4లో 62-06 ఎకరాల ప్రభుత్వ భూమి (1954-55 నుంచి ఖాస్రా పహణీ ప్రకారం) ఉంది. ఇందులో 51-06 ఎకరాల భూమిని ప్రభుత్వం 1986లో హుడాకు కేటాయించింది. మరో ఆరెకరాల భూమిని హౌసింగ్ బోర్డుకు ఇచ్చింది. హౌసింగ్‌బోర్డు తాను తీసుకున్న భూమిలో ఒక ఎకరంలో బలహీనవర్గాలకు ఇళ్లు నిర్మించింది. మిగతా అయిదెకరాల భూమి ఖాళీగానే ఉంది. అది సర్కారీ పోరంబోకు భూమిగా రికార్డుల్లో నమోదవుతూ వస్తోంది. కొన్నాళ్లకు ఈ భూమిపై కొందరు కన్ను వేయడంతో.. ఆక్రమణకు గురికాకుండా దానిచుట్టూ ప్రహరీ గోడ నిర్మించడానికి 2012లో అధికారులు నాటి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఎట్టకేలకు సర్కారు అనుమతి రావడంతో 2015లో రూ.36 లక్షలు ఖర్చుపెట్టి రక్షణ గోడ నిర్మించారు. అదే సమయంలో.. పూస లక్ష్మయ్య అనే వ్యక్తి ఆ భూమికి హక్కుదారుగా చెప్పుకొంటూ.. ఓఆర్సీ (ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్) కోసం రాజేంద్రనగర్ ఆర్డీవో వద్ద పిటిషన్ వేశారు. దానిపై విచారణ జరిపిన ఆర్డీవో.. అది పూర్తిగా ప్రభుత్వ భూమి అని తేల్చిచెప్పి ఆ పిటిషన్‌ను తిరస్కరించారు. దీంతో ఆయన జిల్లా కోర్టులో వేరువేరుగా రెండు పిటిషన్లు వేశారు. ఆ భూమికి హక్కుదారులమని తమకు ఓఆర్సీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కానీ రెండు కేసుల్లోనూ ప్రభుత్వానికే అనుకూలంగా ఉత్తర్వులు రావడంతో.. 2016లో ఆయన మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా ప్రభుత్వానికే అనుకూలంగా తీర్పు వచ్చింది.



ప్రహరీగోడపై.. ఇది ప్రభుత్వ భూమి అని రాస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఎన్నికల సమయంలో..

ఖరీదైన ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఈ భూమిపై కన్నేసిన ఓ బడా రియల్ ఎస్టేట్ సంస్థ.. అందరూ 2023 అసెంబ్లీ ఎన్నికల హడావుడిలో ఉన్న సమయంలో రంగంలోకి దిగింది. ఈ భూమిపై గతంలో కేసులు వేసి ఓడిపోయిన పూస లక్ష్మయ్య కుమారులు పూస రవీందర్, పూస ప్రహ్లాద్‌తో కలిసి నాటకానికి తెరలేపింది. అప్పటి ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల సహకారంతో ఈ అయిదెకరాల పాస్‌బుక్ కోసం పావులు కదిపింది. ఆ ప్లాన్‌లో భాగంగా పూస రవీందర్, పూస ప్రహ్లాద్ గత నవంబర్‌లో పాస్‌బుక్‌ల కోసం ధరణిలో దరఖాస్తు చేశారు. ఎలాంటి పత్రాలూ, రెవెన్యూ అధికారుల సిఫారసులు లేకున్నా.. వారి దరఖాస్తులను ఆమోదించిన అధికారులు.. ఇద్దరి పేర్లపై చకచకా పాస్‌బుక్‌లు జారీచేసేశారు. పూస రవీందర్ పేరు మీద సర్వే నంబరు 4/2లోని 2-20 ఎకరాలకు (టీ05070110003) ఒక పాస్‌బుక్.. పూస ప్లహాద్ పేరు మీద సర్వేనంబరు 4/12లోని మరో 2-20 ఎకరాల భూమికి (టీ05070110004) ఒక పాస్‌బుక్ జారీ చేశారు. వెంటనే వారు భూమిని ఆధీనంలోకి తీసుకుని అందులో షెడ్లు వేసి కొందరిని కాపాలాపెట్టారు.

స్పందించిన రెవెన్యూ...

ఈ దందాను గమనించిన స్థానికులు.. ప్రభుత్వం మారిన వెంటనే కలెక్టర్ శశాంకకు సమాచారం అందించారు. దీంతో ఆయన ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని గండిపేట తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. విచారణలో భాగంగా ఆయన.. "ఈ భూమి మీదే అనడానికి ఏవైనా ఆధారాలున్నాయా?' అని ప్రశ్నిస్తూ పూస రవీందర్, ప్రహ్లాద్‌కు నోటీసులు ఇచ్చారు.

వాళ్లు ఒక్క ఆధారం కూడా చూపించకపోవడంతో.. పాస్‌బుక్‌ల జారీలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారమంతా మోసపూరితంగా జరిగిందని నివేదిక ఇచ్చారు. గతంలో కోర్టుల్లో కూడా ప్రభుత్వానికి అనుకూలంగానే తీర్పులు వచ్చాయని తెలిపారు. దీంతో కలెక్టర్ ఈ భూమిని ఈ ఏడాది జనవరి 21న తిరిగి 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. జీవో 1122 కింద.. ఆ భూములను వెనక్కి తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రైట్స్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్‌యాక్ట్ 2020లోని సెక్షన్ 8 కింద పాస్‌బుక్‌లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గండిపేట తహసీల్దార్ బుధవారం తన సిబ్బందితో వెళ్లి.. అక్కడ పాగా వేసిన ప్రైవేటు వ్యక్తులను బయటకు పంపించి, షెడ్లు కూల్చివేసి భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అది ప్రభుత్వ భూమి అని.. ఆక్రమించినవారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ ప్రహరీగోడపై హెచ్చరిక రాయించారు. అలాగే.. టైటిల్ లేకుండా ప్రభుత్వ భూమికి అక్రమంగా పాస్‌బుక్‌లు పొందినందుకు ఏప్రిల్ 6న రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు పెట్టారు.

ఆఫ్‌లైన్‌లోనే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

» ఓఎంఆర్ విధానంలో నిర్వహణ: టీఎస్‌పీఎస్సీ వెల్లడి

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను ఆఫ్‌లైన్ ద్వారానే నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) అధికారులు బుధవారం స్పష్టం చేశారు. జూన్ 9న మధ్యాహ్నం ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించే ఈ పరీక్షలో ఓఎంఆర్ షీట్‌ను ఉపయోగించనున్నారు. గత ప్రభుత్వం నిర్వహించిన ఈ పరీక్షలను రెండు సార్లు రద్దు చేసిన విషయం తెలిసిందే. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి, అదనపు పోస్టులను జత చేసి నోటిఫికేషన్‌ను ఇచ్చారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం జూన్ 9న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నారు.

మాజీ మంత్రి మల్లారెడ్డికి నోటీసులు

» మల్లారెడ్డి ఎన్నిక చెల్లదని హైకోర్టులో వజ్రేశ్‌యాదవ్ ఈపీ

» మరో కేసులో పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నోటీసులు

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మాజీమంత్రి చామకూర మల్లారెడ్డి ఎన్నిక చెల్లదంటూ దాఖలైన ఎలక్షన్ పిటిషన్(ఈపీ)లో వివరణ ఇవ్వాలని మల్లారెడ్డికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. మేడ్చల్ నుంచి మల్లారెడ్డిపై పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ జగ్గన్నగారి శ్రీనివాసరావు ధర్మాసనం బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది పోగుల సిద్ధార్థ వాదనలను వినిపిస్తూ.. మల్లారెడ్డి తప్పుడు వివరాలతో రిటర్నింగ్ అధికారి ఎదుట నామినేషన్ దాఖలు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూములు, నాలా అని ఉన్న భూములను తనకు చెందినవిగా అఫిడవిట్‌లో పేర్కొన్నారని ఆరోపించారు. మల్లారెడ్డి తన వయస్సు, తన హిందూ అవిభాజ్య కుటుంబం బ్యాంకు డిపాజిట్ల గురించి తప్పుడు సమాచారం ఇచ్చారని వివరించారు. తదుపరి విచారణ జూన్ 14కు వాయిదా పడింది. మరోవైపు.. జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎన్నిక చెల్లదని పేర్కొంటూ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నోటీసులు జారీఅయ్యాయి.

భద్రాచలం ఎమ్మెల్యేకు హైకోర్టు నోటీసులు



భద్రాచలం, మే 1: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. దీనిపై నోటీసులు జారీ అయ్యాయి. హైకోర్టు సూచన మేరకు ఈ పిటిషన్‌ను స్పీకర్ కార్యాలయానికి అందజేసినట్లు అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి హైకోర్టుకు తెలిపారు. కేసు తదుపరి విచారణ జూన్ 5కు వాయిదా పడింది.

భూ అభివృద్ధి ఒప్పందం.. వాణిజ్య లావాదేవే

» లెజెండ్ ఎస్టేట్ పిటిషన్లు కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్ సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): భూ యజమాని, బిల్డర్‌కు మధ్య జరిగే భూ అభివృద్ధి ఒప్పందం (డెవలప్‌మెంట్ అగ్రిమెంట్) వాణిజ్య లావాదేవీ కిందికే వస్తుందని.. ఈ ఒప్పం దంలో తలెత్తే వివాదాలు వాణిజ్య వివాదాల కిందికే వస్తాయని హైకోర్టు స్పష్టం చేసింది. వాణిజ్య వివాదాలను విచారించే అధికారం కమర్షియల్ కోర్టుకు ఉంటుందని పేర్కొంది. భూ యజమానులకు, తమకు (బిల్డర్)కు మధ్య అభివృద్ధి ఒప్పందంకు సంబంధించి తలెత్తిన వివాదం వాణిజ్య వివాదం కాదని పేర్కొంటూ రియల్ ఎస్టేట్ సంస్థ లెజెండ్ ఎస్టేట్ గతంలో హైకోర్టులో సివిల్ రివిజన్ పిటిషన్లు దాఖలు చేసింది. భూ అభివృద్ధి ఒప్పందం వాణిజ్య లావాదేవీ కిందికే వస్తుందని పేర్కొంటూ కమర్షియల్ కోర్టు తీర్పును సమర్థిస్తూ పిటిషన్లను ధర్మాసనం బుధవారం కొట్టేసింది.

పుస్తకాల ముద్రణకు తెలుగు వర్సిటీ ఆర్థిక సాయం

తెలంగాణ తెలుగు రచయితలకు తమ రచనలను ముద్రించుకోవడానికి తెలుగు యూనివర్సిటీ ఆర్థిక సహాయం అందజేస్తుందని రిజిస్ట్రార్ భట్టు రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తక ముద్రణ కోసం కవులు, రచయితలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. తెలుగు భాష, సాహిత్యం, కళలు, చరిత్ర, సంస్కృతికి సంబంధించిన సృజనాత్మక, పరిశోధనాత్మక, విమర్శనాత్మక రచనలను ఆర్థిక సహాయం కోసం పంపవచ్చని, దరఖాస్తులను వర్సిటీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఏదైనా ముద్రణ సంస్థ నుంచి పొందిన ఒక కొటేషన్‌ను దరఖాస్తుకు జతపర్చాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ లోగా... ఇన్‌చార్జి విస్తరణ సేవా విభాగం, తెలుగు యూనివర్సిటీ, పరిపాలన భవనం, సాయినగర్, బాచుపల్లి ప్రాంగణం, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా- 500118 చిరునామాకు పంపాలని పేర్కొన్నారు.

జేఎన్‌టీయూ డైరెక్టర్ వర్సెస్ మహిళా ఐఏఎస్

» అనుమతి లేకుండా డైరెక్టర్ చాంబర్‌లోని వాష్‌రూమ్‌ను వాడుకున్న జోనల్ కమిషనర్

» ఇదేమని ప్రశ్నించిన డైరెక్టర్ శ్రీనివాస్

» మహిళను అవమానించారన్న అభిలాష

» వర్సిటీలోని భవనాలకు అనుమతులున్నాయా?

» మునిసిపల్ సిబ్బంది బెదిరింపులు

హైదరాబాద్ సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): ముందస్తు సమాచారం లేకుండా జేఎన్‌టీయూ డైరెక్టర్ చాంబర్‌లోకి వెళ్లిన ఓ ఐఏఎస్ అధికారిణి, అనుమతి లేకుండానే వాష్‌రూమ్‌ను వినియోగించుకోవడం వివాదాస్పదమైంది. ఈ ఉదంతంతో జీహెచ్ఎంసీ సిబ్బంది.. జేఎన్‌టీయూ బిల్డింగ్ పర్మిషన్ల అనుమతుల గురించి ఆరా తీస్తుండడంతో పరిస్థితి చినికిచినికి గాలివానగా మారుతోంది. వివరాల్లోకి వెళ్తే.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం జీహెచ్ఎంసీ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఏఎస్ అధికారిణి, జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష హాజరయ్యారు. అయితే.. ఆమె ఆడిటోరియం సమీపంలోని డైరెక్టర్ శ్రీనివాస్ చాంబర్‌లోకి వెళ్లారు. ఆయన ఫైళ్లను పరిశీలిస్తూ బిజీగా ఉండగా.. తానెవరో చెప్పకుండా.. నేరుగా ఆయన వాష్‌రూమ్‌ను వినియోగించుకున్నారు. ఆడిటోరియంలో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా వాష్‌రూమ్‌లు ఉన్నా.. ఆమె డైరెక్టర్ చాంబర్‌లోని టాయ్‌లెట్‌ను వినియోగించుకున్నారు. ఆమె తిరిగి వెళ్లిపోతుండగా.. డైరెక్టర్ శ్రీనివాస్ తనను సంప్రదించకుండా చాంబర్‌లోకి రావడమేంటని, టాయ్‌లెట్‌లోకి వెళ్లడమేంటని ప్రశ్నించారు. దాంతో ఆమె శ్రీనివాస్‌వైపు సీరియస్‌గా చూస్తూ వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆమె ఐఏఎస్ అని తెలుసుకుని, డైరెక్టర్ విషయాన్ని అక్కడితో వదిలేసినా.. అభిలాష మాత్రం వదిలిపెట్టలేదు. ఓ ఐఏఎస్ అధికారిని అని కూడా చూడకుండా, తనను అవమానించారని ఆరోపిస్తూ.. రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. మరికొందరు పోలీసు ఉన్నతాధికారులకు కూడా ఆమె ఫిర్యాదు చేయడంతో.. వారు జేఎన్‌టీయూ డైరెక్టర్, రిజిస్ట్రార్‌కు ఫోన్ చేసి, విషయంపై ఆరా తీశారు. మరోవైపు జీహెచ్ఎంసీ అధికారులు కొందరు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వద్దకు వచ్చి, డైరెక్టర్‌తో తమ కమిషనర్‌కు క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారని తెలిసింది. ఈ విషయంపై రిజిస్ట్రార్ సదరు డైరెక్టర్‌ను వివరణ కోరగా.. "నేనేమీ అమర్యాదగా విమర్శించలేదు. చాంబర్‌లోకి వచ్చిన వ్యక్తి కనీసం తానెవరో చెప్పలేదు" అని వివరించినట్లు తెలిసింది. మరోవైపు కొందరు జీహెచ్ఎంసీ అధికారులు వర్సిటీలోని భవనాలన్నింటికీ అనుమతులున్నాయా? వెంటనే భవనాల వివరాలను పంపాలంటూ జేఎన్‌టీయూ ఉన్నతాధికారులను డిమాండ్ చేసినట్లు తెలిసింది. అయితే.. డైరెక్టర్ ఈ విషయాన్ని వదిలేసినా.. జీహెచ్ఎంసీ అధికారులు ఇప్పుడు బెదిరింపులకు దిగడమేంటని జేఎన్‌టీయూ సిబ్బంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

జస్టిస్ సిర్పుర్కర్ కమిషన్ రిపోర్ట్ సస్పెన్షన్

» దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై చర్యలొద్దన్న హైకోర్టు

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): దిశ హత్యాచార కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌పై విచారణకు సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ సిర్పుర్కర్ కమిషన్ రిపోర్ట్‌ను సస్పెండ్ చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ సస్పెన్షన్ ఉత్తర్వులు కొనసాగుతాయని పేర్కొంది. దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పోలీసులు దాఖలు చేసిన బ్యాచ్ పిటిషన్‌లలో మరో మధ్యంతర ఉత్తర్వు జారీచేసింది. దిశపై లైంగికదాడి, హత్యకు పాల్పడిన నిందితులు ఎండీ ఆరిఫ్, జొల్లు నవీన్, శివ, చింతకుంట చెన్నకేశవులు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని చటాన్‌పల్లి వద్ద 2019 డిసెంబరు 6న ఎన్‌కౌంటర్‌కు గురయ్యారు. ఈ ఎన్‌కౌంటర్ వ్యవహారంలో పోలీసులకు, అప్పటి తహసీల్దార్ జరావత్ పాండు, అప్పటి షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎ.శ్రీధర్‌కు వ్యతిరేకంగా జస్టిస్ సిర్పుర్కర్ కమిషన్ 2022లో రిపోర్ట్ అందజేసింది. ఈ రిపోర్ట్‌లో తమను తప్పుబట్టడాన్ని సవాల్ చేస్తూ వీరిద్దరితో పాటు.. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఆ ఘటనలో తమకు వ్యతిరేకంగా కమిషన్ నివేదికలోని ఫైండింగ్స్‌ను కొట్టివేయాలని పిటిషనర్లు కోర్టును కోరారు. వారి తరఫున సీనియర్ న్యాయవాదులు హెచ్.వేణుగోపాల్, రచనారెడ్డి, హేమేంద్రనాథ్ రెడ్డి కోర్టుకు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కమిషన్ తమకు వ్యతిరేకంగా ఓ ముగింపునకు రావడాన్ని పిటిషనర్లు తప్పుబట్టారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. కమిషన్ రిపోర్ట్‌ను సస్పెండ్ చేయడంతోపాటు ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. కాగా.. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని.. పోలీసులే చట్టాన్ని చేతిలోకి తీసుకుని సదరు నిందితులను ఏకపక్షంగా కాల్చి చంపారంటూ పలువురు వ్యక్తులు, మానవ హక్కుల సంఘాలు దాఖలు చేసిన పిటిషన్‌లు ఇప్పటికే చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్‌లో విచారణలో ఉన్నాయి. ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులపై హత్యానేరం కింద విచారణ చేపట్టాలని వారుకోరుతున్నారు. వీటిపై చీఫ్ జస్టిస్ బెంచ్ తుది విచారణ చేపట్టాల్సి ఉంది.

మునుగోడులో 46.6 డిగ్రీలు

రాష్ట్రంలో మరో 13 చోట్ల 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

» వడదెబ్బకు ఏడుగురి మృతి

» మరో 3 రోజులు వడగాలుల తీవ్రత

హైదరాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో రాష్ట్రం అగ్నిగుండంలా మారుతోంది. వారం రోజులుగా పెరుగుతూ వస్తున్న ఉష్ణోగ్రత బుధవారం రెండో రోజూ 46 డిగ్రీలు దాటిపోయింది. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలో అత్యధికంగా 46.6 డిగ్రీలు నమోదయింది. రాష్ట్రంలో బుధవారం వడదెబ్బ తగిలి ఓ ఉపాధ్యాయురాలు, బాలుడు సహా ఏడుగురు మరణించారు. గురు, శుక్ర, శని వారాల్లో వడగాలులు వీస్తాయని, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో గురువారం వడగాలుల తీవ్రత ఎక్కువ ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మే నెలలో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని పేర్కొంది. మండుతున్న ఎండలతో గ్రేటర్ హైదరాబాద్‌లో మంగళవారం 88.75 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదు అయింది. గత సంవత్సరం ఏప్రిల్ కంటే ఈ ఏడాది అదే నెలలో 20 శాతం విద్యుత్ డిమాండ్ పెరిగింది. గత పదేళ్లలో ఈ స్థాయిలో ఎండలు కాయడం ఇదే తొలిసారి అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం, జిల్లాల్లో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సూర్యాపేట జిల్లా మునగాల, ములుగు జిల్లా మంగపేట మండలం, భద్రాచలంలో 46.5, ఖమ్మం జిల్లా వైరా, ఖమ్మం ఖానాపురంలో 46.4, జగిత్యాల జిల్లా నేరెళ్ల, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4, మంచిర్యాల జిల్లా జన్నారం, కరీంనగర్ జిల్లా వీణవంకలో 46.2, మంథనిలో 46.1, రామగుండం, సుల్తానాబాద్, ఆలుబాకలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చాలా జిల్లాల్లో 45 డిగ్రీలు దాటింది. ఆ మార్కు దాటిన ప్రాంతాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్‌లో 43-44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. బుధవారం కుత్బుల్లాపూర్‌లో అత్యధికంగా 43.4 డిగ్రీలు నమోదైంది. ఎండల తీవ్రత, వడగాలులతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

ఎన్నికల శిక్షణకు హాజరై వెళ్తూ..


వికారాబాద్ జిల్లా తాండూరులో ఎన్నికల శిక్షణకు హాజరై తిరిగి వెళుతున్న రాజీ(45) అనే ఉపాధ్యాయురాలు వడదెబ్బ తగిలి బస్టాండ్ వద్ద కుప్పకూలిపోయారు. ఆస్పత్రికి తరలించినా అప్పటికే ఆమె మృతిచెందారు. కరీంనగర్ జిల్ల రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన యశ్వంత్(5) అనే బాలుడు, జగిత్యాల జిల్లా కోరుట్లలో పత్తిపాక రమేష్ వడదెబ్బతో మృతిచెందారు. జనగామ, ఆదిలాబాద్ జిల్లాలో వడదెబ్బ తగిలి ఇద్దరు ఉపాధి కూలీలు ప్రాణాలు కోల్పోయారు.

మేలోనూ మంటలే!:

విశాఖపట్నం: ఎల్‌నినో బలహీనపడినా దాని ప్రభావంతో దేశంలో అనేక ప్రాంతాలు ప్రస్తుతం అగ్నిగుండంలా మారాయి. ఎండ తీవ్రత, వడగాడ్పులు కొనసాగనున్నాయి. మే నెలకు సంబంధించి బుధవారం భారత వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది. దీని ప్రకారం.. తెలంగాణ, ఏపీలో సగటున రెండు నుంచి నాలుగు రోజులు వడగాడ్పులు వీయనున్నాయి.

నా చావుకు సీఐ, ఎస్సైలే కారణం..

» సూసైడ్‌నోట్ రాసి వ్యక్తి అదృశ్యం



ప్రశాంత్

వరంగల్ క్రైం, మే1: తన చావుకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ సీఐ జె.సురేశ్, ఎస్సై ఎం.సురేశ్‌తోపాటు మరో ఐదుగురు కానిస్టేబుళ్లు కారణమని ఆరోపిస్తూ వంగపహాడ్ గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే వ్యక్తి సూసైడ్ నోట్ రాసి అదృశ్యమవడం కలకలం రేపింది. గ్రామంలో తనకు వీరేశం అనే వ్యక్తి డబ్బులివ్వాల్సి ఉండగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని సూసైడ్ నోట్‌లో ప్రశాంత్ పేర్కొన్నారు. పోలీసుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని లేఖ రాసి ప్రశాంత్ మంగళవారం అదృశ్యమయ్యాడు. అయితే తన భర్తను కాపాడి పోలీసులపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ బాధితుడి భార్య మాధవి వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సాయం కోసం వెళితే హసన్‌పర్తి పోలీసులు కొట్టి అవమానించారని.. అది భరించలేకే తన భర్త సూసైడ్ నోట్ రాసి ఎటో వెళ్లిపోయాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తకు ఏదైనా జరిగితే దానికి సీఐ, ఎస్సైలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

బ్యాంకులకు నగదు తీసుకెళ్లే వాహనాల తనిఖీల్లో కోటి స్వాధీనం

» సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసిన సైబరాబాద్ ఎస్ఓటీ

హైదరాబాద్ సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ దృష్ట్యా సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 1.06 కోట్ల నగదును సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో బ్యాంకులకు నగదు తీసుకెళ్లే వాహనాల తనిఖీలును నిర్వహించారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్యాష్ అండ్ లాజిస్టిక్ వాహనంలో తరలిస్తున్న రూ. 60 లక్షలను మేడ్చల్ ఎస్ఓటీ అధికారులు సీజ్ చేశారు. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఎంఎస్ క్యాష్ లాజిస్టిక్స్ వాహనంలో తరలిస్తున్న రూ. 22 లక్షల నగదు పట్టుబడింది. శామీర్‌పేటలో రూ. 9 లక్షలు, చందానగర్‌లో రూ. 7.40 లక్షలు, రాజేంద్రనగర్‌లో రూ. 5 లక్షల నగదును సీఎంఎస్ వాహనాల్లో తరలిస్తుండగా పోలీసులు సీజ్ చేశారు. కూకట్‌పల్లిలో ఎస్ఐఎస్ సెక్యూరిటీస్ వాహనంలో తరలిస్తున్న రూ. 2.6 లక్షల నగదును బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈసీ జారీ చేసిన క్యూఆర్ కోడ్‌లు, సంబంధించిన పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామని సైబరాబాద్ ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ నేత హత్య


గత నెల 18న ఏపీలోని జగ్గయ్యపేటకు ఎల్లయ్య.. అప్పటి నుంచి వీడని ఎల్లయ్య అదృశ్యం మిస్టరీ

» జగ్గయ్యపేటలో హత్య.. విశాఖ సముద్రంలో మృతదేహం

» ఎల్లయ్య రియల్‌ఎస్టేట్ ప్రత్యర్థి శ్రీకాంతచారి ఘాతుకం

» భార్యాభర్తల వివాదం సెటిల్మెంట్ పేరుతో ట్రాప్

» శ్రీకాంతాచారి మాజీ నక్సలైట్.. అరెస్టు, రిమాండ్



వడ్డే ఎల్లయ్య(ఫైల్)

జగ్గయ్యపేట, మే 1: తెలంగాణలోని సూర్యాపేట జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డే ఎల్లయ్య అదృశ్యం కేసు విషాదాంతంగా మారింది. ఎల్లయ్యను ఆయన రియల్‌ఎస్టేట్ ప్రత్యర్థి, మాజీ నక్సలైట్ శ్రీకాంతాచారి దారుణంగా హతమార్చిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ హత్యలో ఐదారుగురు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. జగ్గయ్యపేటలో హత్య జరగ్గా.. మృతదేహాన్ని విశాఖ వద్ద సముద్రంలో పారేసినట్లు నిర్ధారించారు. విశ్వసనీయవర్గాల కథనం ప్రకారం.. ఎల్లయ్యకు, శ్రీకాంతాచారికి మధ్య రియల్‌ఎస్టేట్ భూవివాదాలున్నాయి. ఈ క్రమంలో ఎల్లయ్యను హతమార్చేందుకు శ్రీకాంతాచారి స్కెచ్ వేశాడు. భార్యాభర్తల వివాదాల పరిష్కారంలో ముందుండే ఎల్లయ్యను.. ఆ కోణంలోనే ట్రాప్ చేయాలని నిర్ణయించాడు. దీంతో.. గత నెల అపర్ణ అనే మహిళను రంగంలోకి దింపాడు. తన భర్త శ్రీనివాస్ అలియాస్ ఉపేంద్రతో వివాదాలున్నాయని, అతని నుంచి రూ.20 లక్షలు రావాలని, వాటిని ఇప్పించాలని అపర్ణ కోరడంతో.. పంచాయితీ తీర్చేందుకు ఎల్లయ్య సిద్ధమయ్యారు. గత నెల 18న వీరు కారులో జగ్గయ్యపేటకు బయలుదేరారు. మార్గమధ్యంలో ఎల్లయ్య తన స్నేహితుడు అంజయ్యను కారులో ఎక్కించుకున్నారు. శ్రీకాంతాచారి, అతని స్నేహితుడు శ్రీనివాస్(అపర్ణ భర్తగా చెప్పిన వ్యక్తి), మరికొందరు మిత్రులు అంతకు రెండ్రోజుల ముందే జగ్గయ్యపేటలో మకాం వేశారు. ఎల్లయ్య, అపర్ణ, అంజయ్య జగ్గయ్యపేటకు రాగానే.. శ్రీనివాస్ ఫోన్ చేశాడు. ఒంటరిగా వస్తే రూ.20 లక్షలు ఇస్తానని ఎల్లయ్యకు చెప్పాడు. దాంతో ఎల్లయ్య తన వెంట ఉన్న అంజయ్య, అపర్ణను ఆర్టీసీ బస్టాండ్ వద్ద దింపేసి, ఒంటరిగా వెళ్లారు. అక్కడ వాష్‌రూమ్ పేరుతో అపర్ణ తప్పించుకుంది. శ్రీను, ఎల్లయ్య ఫోన్లు స్విచాఫ్ కావడం.. అపర్ణ ఫోన్ కూడా అందుబాటులో లేకపోవడంతో.. అంజయ్య జరిగిన విషయాన్ని ఎల్లయ్య కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దాంతో.. ఎల్లయ్య సోదరుడు సతీశ్ సూర్యాపేట, జగ్గయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నేత కావడంతో.. పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారు. తొమ్మిది సంయుక్త బృందాలతో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శ్రీకాంతాచారిని అదుపులోకి తీసుకుని, ప్రశ్నించడంతో హత్య గుట్టు రట్టయినట్లు తెలిసింది. గత నెల 18న ఎల్లయ్యను జగ్గయ్యపేట పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో హతమార్చినట్లు.. మృతదేహాన్ని చేపలను పార్సిల్ చేసే బాక్సులో పెట్టి, విశాఖకు తరలించినట్లు శ్రీకాంతాచారి పోలీసులకు వాంగ్మూలమిచ్చినట్లు తెలిసింది. ఎల్లయ్య మృతదేహాన్ని విశాఖ తీరంలో సముద్రంలో పారేసినట్లు శ్రీకాంతాచారి అంగీకరించినట్లు సమాచారం. దీంతో పోలీసులు మృతదేహం కోసం సముద్రతీరంలో, జగ్గయ్యపేట అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. శ్రీనివాస్, ఇతర నిందితులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కాగా.. గత నెల 24న ఎల్లయ్య కారును జగ్గయ్యపేట పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు శ్రీకాంతాచారిపై ఏపీ, తెలంగాణల్లో 34కు పైగా కేసులున్నట్లు తెలిసింది. శ్రీకాంతాచారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని, మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని జగ్గయ్యపేట సీఐ జానకిరాం వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విద్యార్థుల గర్జన

గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ అమెరికాలోని వివిధ యూనివర్సిటీల్లో విద్యార్థులు చేపట్టిన నిరసన ప్రదర్శనలమీద పోలీసు దాడులు తీవ్రమవుతున్నాయి. ఆపాదమస్తకం రక్షణకవచాలు ధరించి, ఆయుధాలు, లాఠీలు చేబూనిన పోలీసులు యూనివర్సిటీ క్యాంపస్‌లలోకి చొరబడి విద్యార్థులను వెంటాడివేటాడి అరెస్టు చేస్తున్న దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో ప్రపంచమంతా చూస్తున్నది. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యానికి మారుపేరుగా చెప్పుకొనే అమెరికాలో ఆ స్థాయిలో అణచివేత ఉన్నందుకు ఆశ్చర్యపోతున్నది. నిరసన హక్కుకూ, భావప్రకటనా స్వేచ్ఛకూ దక్కుతున్న గౌరవాన్ని చూసి విస్తుపోతున్నది.

ఒక భయంకరమైన, అమానవీయమైన యుద్ధానికి వ్యతిరేకంగా యువత నోరువిప్పుతున్నందుకు, అపమని అడుగుతున్నందుకు అమెరికా ప్రభుత్వం, అక్కడి వ్యవస్థలు ఇంత వణికిపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఉగ్రవాదులను అంతం చేస్తానంటూ గాజాలోకి ఇజ్రాయెల్ చొరబడినప్పుడు విద్యార్థులు ఇంతగా ఆగ్రహించలేదు. కానీ, ఈ ఆర్నెల్లకాలంలో అక్కడ జరిగింది మానవహననమే. నలభైవేలమందిని చంపేసి, లక్షలాది మందిని నిరాశ్రయులను చేసి, ఆస్పత్రులను స్మశానాలుగా మార్చేసి, మిగిలినవారికి అన్నం నీరు దక్కకుండా చేసినా కూడా నెతన్యాహూ కసి ఇంకా చల్లారడం లేదు. వందలాదిమంది రోగులను కాల్చిచంపడమో, సజీవంగా పాతిపెట్టడమో జరిగిందని ఇటీవల ఇజ్రాయెల్ సేనలు వదిలిపెట్టిన రెండు ప్రధాన ఆస్పత్రుల పరిసరాల్లో చేపట్టిన తవ్వకాల్లో స్పష్టమైంది. గాజాలో ఇజ్రాయెల్ హమాస్‌ను అంతం చేయడం పేరిట జాతిహననానికి పాల్పడుతున్నది. ఇప్పటివరకూ సాగించిన ఘాతుకాలు చాలవన్నట్టుగా ఇప్పుడు రఫా నగరంలోకి ప్రవేశించి, అక్కడ తలదాచుకుంటున్న పదిలక్షలమందిని హతమార్చడానికి సిద్ధపడుతున్నది. ఇజ్రాయెల్ పాపాలు ఇలా పతాకస్థాయికి చేరిన తరువాతే అమెరికాలో విశ్వవిద్యాలయాలు వేడెక్కాయి. ఇజ్రాయెల్ దమనకాండనీ, దానికి అండదండలు దండీగా అందిస్తున్న అమెరికా సహా ఇతర అగ్రదేశాలను ప్రశ్నించడానికి మిగతా ప్రపంచం వణికిపోతున్న తరుణంలో, యుద్ధానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమిస్తున్నారు. అమెరికా విద్యాసంస్థలు యుద్ధంలో భాగస్వాములు కాకూడదని కోరుతున్నారు. అమెరికన్ యూనివర్సిటీలు వందలకోట్ల డాలర్లు ఆయుధ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి, వచ్చిన లాభాలనూ వడ్డీనీ తన అవసరాలకు వాడుకుంటున్నందున, యుద్ధంతో లాభపడుతున్న ఆయా కంపెనీలనుంచి డబ్బు వెనక్కుతీసుకోవాలనీ, ఆ పాపపు సొమ్ము తమకు వద్దని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇజ్రాయెల్‌తో అకడమిక్ సంబంధాలను తెగదెంపులు చేసుకోవాలని కోరుతున్నారు. గతంలో దక్షిణాఫ్రికాలో జాత్యహంకార పాలకులతో సంబంధాలున్న సంస్థలనుంచి పెట్టుబడులను ఉపసంహరించుకొని, సంబంధాలు సైతం తెంచుకున్న చరిత్ర ఈ యూనివర్సిటీలకు లేకపోలేదు. కానీ, ఇప్పుడు ఈ విద్యార్థి నిరసనలమీద దుష్ప్రచారం అధికంగా చేస్తూ, దానిని యూదువ్యతిరేక ఆందోళనగానూ, మతోన్మాదుల, ఉగ్రవాదుల దుశ్చర్యగానూ చిత్రీకరించే ప్రయత్నాలు విస్తృతంగా జరుగుతున్నాయి. బయటివారు వచ్చి తమ విద్యార్థుల మనసుల్లో విషం నింపుతున్నారనీ, యూదులకు వ్యతిరేకంగా వారిని రెచ్చగొడుతున్నారని ప్రకటించడం ద్వారా కొన్ని యూనివర్సిటీలు పోలీసు చర్యకు మార్గాన్ని సుగమం చేస్తున్నాయి. నిరసనలను దీర్ఘకాలం వదిలివేస్తే, అవి ప్రశాంతంగా సాగినా కూడా ప్రమాదమేనని శ్వేతసౌధం భయపడుతోంది. ఇప్పటికే నిరసనలు యూరప్‌కు విస్తరించాయి, బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లో జోరందుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, సాధ్యమైనంత వేగంగా, తీవ్రంగా అణచివేత ఉండాలని, లేనిపక్షంలో అది తనకూ తన మిత్రదేశాలకు ప్రమాదకరంగా పరిణమిస్తుందని అమెరికా భావిస్తున్నట్టు ఉంది. 'నువ్వు యుద్ధం చేస్తున్నది మా దేశాన్ని రక్షించడానికి కాదు, బందీలుగా చిక్కిన నా బంధువులను కాపాడటానికీ కాదు, నీ అధికారదాహానికి ఓ నమస్కారం, ఇక దిగిపో' అని నెతన్యాహూకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్‌లో వేలాదిమంది నిరసనలు వ్యక్తంచేస్తున్నారు. కానీ, అమెరికాలో మాత్రం ఇజ్రాయెల్ దురాగతాలను ప్రశ్నిస్తున్న విద్యార్థులకు శిక్ష తప్పడం లేదు.

చిచ్చుమాటల వెనుక చర్చనీయాంశాలు!



> నరేంద్రమోదీ మంగళవారం నాడు తెలంగాణలో మాట్లాడుతూ, రాజ్యాంగం అంటే తనకు గీత, ఖురాన్, బైబిల్‌తో సమానమని ఉద్వేగపూరితంగా అన్నారు. తాను జీవించి ఉండగా, ముస్లిములకు రిజర్వేషన్లు దక్కనివ్వనని ఎంత నిశ్చయంతో చెప్పారో, రాజ్యాంగాన్ని కాపాడతానని కూడా అంతే బలంగా చెప్పారు. ఆచరణలో ఏమి జరిగినా, జరగకపోయినా, నాయకులు ఎక్కడో ఒకచోట మాట ఇవ్వవలసిరావడం వాంఛనీయం. ప్రజలు ఈ ఊదరవాదనలను వింటూ, పాలూనీరూ వేరుచేసి, ఎవరు ఏ ఉద్దేశ్యంతో ఏమి మాట్లాడుతున్నారో గ్రహిస్తున్నారనే భావించాలి. కృత్రిమంగా రాజేస్తున్న అగ్గిమంటలను ఖాతరు చేయకుండా, దేశరాజకీయ వాతావరణం గుంభనంగా కనిపిస్తున్నది, మరి!



■ కె. శ్రీనివాస్

సందర్భం

ప్రచారం అన్న మాట వినడానికి ఎంతో పవిత్రంగా, అమాయకంగా కనిపిస్తుంది. ఇప్పుడు వ్యాపిస్తున్న మాటల కాలుష్యాన్ని ఎన్నికల ప్రచారం అనడం చాలా అన్యాయం. ఒకరిని లేదా ఒక విషయాన్ని పైకెత్తడానికి గానీ, కిందికి తోసేయడానికి కానీ, నిజాలను కానీ, వదంతులనుకానీ, అబద్ధాలని కానీ ప్రచారంచేయడాన్ని ఇంగ్లీషులో ప్రాపగాండా అంటారు. ఊదరగొట్టడం అంటే దగ్గరగా ఉంటుంది. ఈ కళలో ఆరితేరిన, పేరుమోసిన వారు చరిత్రలోను, వర్తమానంలోనూ అనేకులున్నారు. అటువంటి ఒక ఘనాపాటి ప్రకారం, బాగా ప్రభావం వేసే వాదనలను పదే పదే వినిపించడమే ఈ ఊదరకళకు ఊపిరి. అట్లాగని, మెత్తగా, గంభీరంగా ఉండే మాటలు మాట్లాడితే ఉపయోగం లేదు. మనం మాట్లాడేది మేధావుల కోసం కాదు. మేధావులను మనం మార్చలేం, మార్చక్కరలేదు కూడా, కాస్త నోరు పెంచామంటే వాళ్లే లొంగిపోతారు. మనం గురిపెట్టాల్సింది రోడ్లమీద కనిపించే అతి సామాన్యుడిని. మన వాదనలు బాగా మొరటుగా ఉండాలి, సులువుగా అర్థం కావాలి, చాలా పదునుగా ఉండాలి. వాడి బుర్రకి కాదు, మనసుకి, ఆవేశాలకి, సహజాతాలకి తాకేటట్టు మాట్లాడాలి. సత్యం మాట్లాడాలని పట్టింపు అక్కరలేదు. మన ఎత్తుగడలకు, మానసిక తంత్రానికి ఉపయోగపడకపోతే, నిజాలతో మనకు పనిలేదు. నమ్మదగినట్టుగా అబద్ధాలు మాట్లాడాలి. అతని కంటె ఘనుడు ఆచంట మల్లన్న ఏమన్నాడంటే, చిన్నాచితకా అబద్ధాల వల్ల ఉపయోగం లేదు. అటువంటివి అందరూ మాట్లాడతారు. పెద్ద, అతి పెద్ద, భారీ అబద్ధం ఆడాలి, దాన్ని పదే పదే వల్లె వేయాలి. అబద్ధం మీద ఆధారపడే పాలనలో, సత్యమే రాజ్యానికి అతి బద్ధశత్రువు. ఈ ఊదర అసత్యవాదం ఎన్నికల సమయంలోనే వ్యాపించి ఉంటుందనుకుంటే పొరపాటు. ప్రచారం లేకుండా ప్రభుత్వాలే ఉండవు. ప్రజలకెప్పుడూ ఏదో నూరిపోయకుండా పాలకులకు గడవదు.

లాక్కుని పంచేస్తారు, వాళ్లది తీసుకుని వీళ్లకు ఇచ్చేస్తారు, మంగళసూత్రాలు ఎత్తుకుపోతారు, వంటి ప్రచారానికి చప్పట్లు ఎక్కువ పడుతున్నాయో, అంతకు మించి మరో కొత్తమంత్రం దొరకలేదో ప్రధానమంత్రి, ఆయన సహచరులు రెండో దశ పోలింగ్ తరువాత కూడా అదే హోరును మరింత జోరుతో సాగిస్తున్నారు. కాంగ్రెస్ వాళ్లు కూడా ఏమీ తక్కువ తినలేదు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారు దగ్గర మొదలైన హెచ్చరిక, రిజర్వేషన్లు అన్నీ రద్దు చేస్తారు దాకా విస్తరించింది. సాధారణంగా ఎన్నికల ప్రచారాల్లో తాము అధికారంలోకి వస్తే అది ఇస్తాం, ఇది ఇస్తాం, వాళ్ల కంటె ఎక్కువ మేం ఇస్తాం, వంటి అంశాలను మాట్లాడతారు. అంటే, ప్రధానంగా ఇవ్వడం గురించి మాట్లాడతారు. ఇప్పుడు లాక్కోవడం, తీసేసుకోవడం అన్న అంశాల గురించి మాట్లాడుతున్నారు. అవతలివాళ్లు అధికారంలోకి వచ్చారో, ఉన్నది కోల్పోతారు అని భయపెడుతున్నారు. ప్రత్యర్థుల బూచీకరణ ఈ సారి ఎన్నికలలో ఒక విశేషం. ఉభయపక్షాలు, పరస్పరం చేసుకుంటున్న నిందారోపణల ప్రాతిపదిక మీదనే ఈ భయప్రచారం సాగుతున్నది. ప్రజల సంపదనంతా తీసుకుని, పునఃపంపిణీ చేస్తుందని, ప్రధానంగా ముస్లిములకు బట్వాడా చేస్తుందని మోదీ చేస్తున్న ప్రచారం ఆశ్చర్యకరమైనది, బలహీనమైన ఆధారాలకు విచిత్రమైన అన్వయాలను ఇవ్వడం ద్వారా నిర్మించిన వాదన అది. ప్రధానమంత్రి స్థాయి వ్యక్తి అట్లా మాట్లాడడం ఇప్పటికీ మింగుడుపడని వారున్నారు. కానీ మొరటు మాటలను పదే పదే వల్లించడంలో కలిగే సదుపాయం వేరు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే, రాజ్యాంగాన్ని మౌలికంగా మార్చేస్తారని, ప్రజాస్వామ్యం పూర్తిగా బలహీనపడుతుందని, ఇకపైన ఎన్నికలే ఉండవని కాంగ్రెస్ చాలా కాలంగా అంటున్నది. బీజేపీ రెండుదఫాల పాలన ఆధారంగా, ఆ పార్టీ సామాజిక విశ్వాసాల ఆధారంగా చేస్తున్న భవిష్యత్ అంచనా అది. రాజకీయసైద్ధాంతిక అంచనా. రోడ్డుమీది సామాన్యుడికి కూడా అందడానికి వీలుగా, మొత్తంగా రిజర్వేషన్లే రద్దు అవుతాయని ఆ వాదనను మెరుగుపరిచి, కాంగ్రెస్ ప్రచారంలో పెట్టింది.

అధికారం కోల్పోతామేమోనన్న భయమో, అధికారం దక్కించుకోవాలన్న ప్రయత్నమో, పార్టీల చేత ఉద్వేగపూరితమైన అధమస్థాయి ప్రచారానికి ప్రేరేపిస్తూ ఉండవచ్చు. ప్రజలు ఇంతకంటె మెరుగైన అంశాలను, తమ మనుగడకు సంబంధించిన సామాజికార్థిక అంశాలను ఎన్నికల సందర్భంలో చర్చించాలని ఆశిస్తారన్నది నిజమే. అట్లాగని రిజర్వేషన్ల అంశం, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రజలకు సంబంధించని అంశాలేమీ కాదు. కానీ, ముస్లిమ్ రిజర్వేషన్ల అంశం ఆవేశకావేశాలు రగిలించే రీతిలో ఇంత ప్రాధాన్యం ఇవ్వవలసిన అంశమా? ప్రాధాన్యం ఇస్తే, సచార్ కమిషన్ సిఫారసుల ప్రకారం న్యాయమైన సానుకూల చర్యలను పార్టీలు ప్రతిపాదించాలి. కానీ జరుగుతున్నదేమిటి? ముస్లిములందరికీ రిజర్వేషన్లు కల్పించే కర్ణాటక నమూనాను విమర్శించడంలో ఒక వాదన ఉన్నది. మొత్తంగా ఒక మతవర్గానికి రిజర్వేషన్లు కల్పించడం మతప్రాతిపదిక రిజర్వేషన్లు అవుతాయి. మరి తెలంగాణలో కూడా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని అంటున్నారు. తెలంగాణలో ముస్లిములలోని కొన్ని వెనుకబడిన శ్రేణులకు వెనుకబడిన తరగతులలో భాగంగా రిజర్వేషన్లు ఇస్తున్నారు. మరి అవి మతప్రాతిపదిక రిజర్వేషన్లు కావే? మరి ప్రధానమంత్రి వాదన మతప్రాతిపదిక రిజర్వేషన్లకు వ్యతిరేకంగానా? ముస్లిములకు వ్యతిరేకంగానా? ఈ చర్చ అంతా ఒక విభజన వాతావరణానికి ఆస్కారం ఇచ్చి, ఉద్వేగాల మీదికి దారిమళ్లిస్తుంది. దేశవనరుల మీద మొదటి హక్కు అట్టడుగు వర్గాలకు ఉంటుందన్నది అందరూ అంగీకరించవలసిన అంశం. మన్మోహన్ సింగ్ అన్నమాటలను ఇవాళ తప్పుపడుతున్నది కానీ, ఇరవయ్యేళ్ల నుంచి బీజేపీ సిద్ధాంతంగానూ, పదేళ్లుగా ప్రభుత్వ విధానాల్లో ఒకటిగానూ ఉన్న 'అంత్యోదయ' అర్థం ఏమిటి? చిట్టచివరన ఉన్నవారికి కూడా అభివృద్ధిఫలాలు అందడమే కదా? ఆ అట్టడుగు వర్గాలలో ముస్లిములు ఉండకూడదంటే, వారిలో వెనుకబాటు లేదని శాస్త్రీయంగా నిరూపించాలి.

> సాధారణంగా ఎన్నికల ప్రచారాల్లో తాము అధికారంలోకి వస్తే అది ఇస్తాం, ఇది ఇస్తాం, వాళ్ల కంటె ఎక్కువ మేం ఇస్తాం, వంటి అంశాలను మాట్లాడతారు. అంటే, ప్రధానంగా ఇవ్వడం గురించి మాట్లాడతారు. ఇప్పుడు లాక్కోవడం, తీసేసుకోవడం అన్న అంశాల గురించి మాట్లాడుతున్నారు. అవతలివాళ్లు అధికారంలోకి వచ్చారో, ఉన్నది కోల్పోతారు అని భయపెడుతున్నారు.


నిజానికి, సంపద పునఃపంపిణీ వాదవివాదాల సరుకు కాకుండా, మంచి ప్రయోజనాత్మకచర్చకు, నిర్మాణాత్మక ఫలితాలకు పనికివచ్చే అంశం. ఇంతకూ భారతీయ జనతా పార్టీ పేదరికం నిర్మూలన గురించి, ఆర్థిక అంతరాల తగ్గింపు గురించి ఏం మాట్లాడుతుంది? కాంగ్రెస్ గురించి మనకు తెలుసు. సోషలిస్టు భావాలను ప్రకటించడం, గరీబీ హటావో నినాదాలు ఇవ్వడం, ప్రణాళికా అభివృద్ధి విధానం వంటి చరిత్ర ఉన్నది. మరి బీజేపీకి? నియంత్రిత ఆర్థిక వ్యవస్థను వారు ఇష్టపడలేదు. ప్రైవేటు రంగానికి ఎక్కువ అవకాశాలు కోరుకున్నారు. స్వేచ్ఛామార్కెట్‌కు అనుకూలురు. స్వదేశీ విధానాన్ని మొదట్లో ప్రచారం చేసేవారు. ఆర్‌ఎస్ఎస్ సిద్ధాంతకర్తగా ప్రసిద్ధులయిన ఎం.ఎస్. గోల్వాల్కర్ ఆలోచనల గుచ్ఛం 'పాంచజన్యం'లో దేశంలో పేదరికం నిర్మూలనకు, కులనిర్మూలనకు ప్రాధాన్యం లేదు. పెట్టుబడిదారీ విధానాన్ని, సోషలిజాన్ని రెంటిని వ్యతిరేకించినవారు గోల్వాల్కర్. శ్రమకు తగ్గ గౌరవం ఇస్తే, పేదరికం సమస్యే కాదన్నట్టు అయన రాశారు. పశ్చిమదేశాల్లోని జాతీయవాదాన్ని, ప్రాదేశిక జాతీయవాదాన్ని కూడా ఆయన నిరాకరించారు. బీజేపీ అధికార విధానాల్లో కనిపించే సాంస్కృతిక జాతీయవాదం మూలాలు తొలినాటి ఆర్‌ఎస్ఎస్ సిద్ధాంత సంపుటులలో ఉన్నాయి. నెహ్రూ, ఇందిర ఆర్థికరంగంలో చేసిన హడావిడి వల్ల, తమకూ ఒక ఆర్థిక విధానం కావాలనుకుని, 1980లో భారతీయ జనతాపార్టీగా అవతరించినప్పుడు, గాంధేయ సోషలిజాన్ని ఆర్భాటంగా స్వీకరించారు. కానీ, 1984 ఎన్నికల్లో నిరాశ తరువాత, అద్వానీ ప్రాచుర్యం పెరిగాక ఆ నినాదం క్రమంగా తెరమరుగైంది. కానీ, 2005లో కూడా గాంధేయ సోషలిజం గురించి వాజపేయి సానుకూలంగా మాట్లాడారు. ఇప్పుడు గాంధీ గురించి సానుకూలంగా మాట్లాడేవారే ఆ పార్టీలో తగ్గిపోయారు. గాంధీజీ ప్రకారం, సంపన్నులు తాము ప్రజల ఆస్తికి ధర్మకర్తలుగా వ్యవహరించాలి, తమ గౌరవప్రదజీవనానికి సరిపడా తప్ప, తక్కిన ధనం మీద తమకు హక్కులేదని, అది అందరి యోగక్షేమాల కోసం ఖర్చుచేయాలి. సోషలిస్టులు, కమ్యూనిస్టులు తప్పుపట్టిన ఈ భావనను, ఆర్‌ఎస్ఎస్ కూడా ఆనాడు తప్పుపట్టింది. వినోబాభావే భూదాన ఉద్యమాన్ని కూడా గోల్వాల్కర్ విమర్శించారు. రాజభరణాల రద్దును, భూసంస్కరణలను ఆనాటి జనసంఘం వ్యతిరేకించింది. సంపద పునః పంపిణీ భావన ఏ రూపంలో ఉన్నా సిద్ధాంత స్థాయిలో బీజేపీ, దాని పరివారం వ్యతిరేకిస్తూ వచ్చాయి.

అట్లాగని, ప్రభుత్వాలు పునఃపంపిణీని ఏ రూపంలోనూ అమలు చేయడం లేదా? పేదల నుంచి భూములు లాక్కుని నీటి ప్రాజెక్టులు, రహదారులు కట్టడం లేదా? వారి వ్యక్తిగత ఇచ్ఛతో నిమిత్తం లేకుండా, సమష్టి ప్రయోజనం కోసమని వనరులను స్వాధీనంచేసుకోవడం లేదా? అడవుల మీద ఆదివాసులను తొలగించి, కార్పొరేట్లకు స్వాగతం చెప్పడం లేదా? తాము అవసరం అనుకున్న సందర్భాలలో, ప్రజలనుంచి లాక్కుని, ఇతరులకు అప్పగించడం జరుగుతూనే ఉన్నది. ఆస్తి హక్కు రక్షణ అన్ని వర్గాలకు సమానం కాదు. స్విస్ బ్యాంక్‌లో నల్లధనాన్ని రప్పించి ప్రజలకు పంచుతానన్న నరేంద్రమోదీ, మాటవరసకైనా, చేయాలనుకున్నది పునః పంపిణీయే కదా? ప్రభుత్వాలు చెప్పుకునేదాని ప్రకారం, వ్యాపారాలమీద, ఆర్జనల మీద వేసే పన్నులన్నీ సమాజంలో ఆర్థిక సమతూకం దెబ్బతినకుండా ఉంచడం కోసమే. ఎవరిదగ్గర నుంచో లాక్కుని తమకు ఇవ్వమని ప్రజలు అడగరు. అట్లా అడిగితే, ఎంత లాక్కున్నా తరగని సంపదలున్నవారి నుంచి తీసుకుని ఇవ్వమని చెబుతారు. ప్రజల దృష్టి అటువంటి ఆర్థిక దిగ్గజాల వైపు పడకుండా, ప్రజలలో ఒక వర్గం పేదల నుంచి మరో పేదల వర్గం అపహరించడం గురించి నాయకులు మాట్లాడతారు.

ఈ చర్చ అంతటి వల్ల ఉపయోగం కూడా ఉంటుంది. నరేంద్రమోదీ మంగళవారం నాడు తెలంగాణలో మాట్లాడుతూ, రాజ్యాంగం అంటే తనకు గీత, ఖురాన్, బైబిల్‌తో సమానమని ఉద్వేగపూరితంగా అన్నారు. తాను జీవించి ఉండగా, ముస్లిములకు రిజర్వేషన్లు దక్కనివ్వనని ఎంత నిశ్చయంతో చెప్పారో, రాజ్యాంగాన్ని కాపాడతానని కూడా అంతే బలంగా చెప్పారు. ఆచరణలో ఏమి జరిగినా, జరగకపోయినా, నాయకులు ఎక్కడో ఒకచోట మాట ఇవ్వవలసి రావడం వాంఛనీయం. ప్రజలు ఈ ఊదరవాదనలను వింటూ, పాలూనీరూ వేరుచేసి, ఎవరు ఏ ఉద్దేశ్యంతో ఏమి మాట్లాడుతున్నారో గ్రహిస్తున్నారనే భావించాలి. కృత్రిమంగా రాజేస్తున్న అగ్గిమంటలను ఖాతరు చేయకుండా, దేశరాజకీయ వాతావరణం గుంభనంగా కనిపిస్తున్నది, మరి!

నిస్వార్థ నేత నాగయ్య

కష్టపడి పని చేస్తే సాధించలేనిదేముంటుంది అనే పెద్దల మాట అర్ధ సత్యమేమో?! వివిధ రాజకీయ పార్టీలలో కష్టపడి పని చేసి ఉన్నత స్థానానికి చేరిన వారిని నేను చూశాను. అయితే అంకితభావంతో అహోరాత్రులూ పార్టీ ఉన్నతికి కష్టపడినా తమ కష్టానికి సముచిత గుర్తింపు పొందలేకపోయినవారు ఉన్నారు. ఇటువంటి కార్యకర్తలకు ఏదైనా పని అప్పగిస్తే దానిని పూర్తి చేసేదాకా వారు నిద్రపోరు. అటువంటివారిలో కొందరు తమ సేవల ఆధారంగా ఎన్నికలలో పోటీ చేసేందుకు ప్రయత్నించారు. సుదీర్ఘకాలం నిబద్ధతతో పార్టీకి సేవలు అందించినా వివిధ కారణాల వల్ల వారికి పార్టీ టిక్కెట్ లభించలేదు. అసంతృప్తికి గురైన ఆ నిస్వార్థపరులు వేరే పార్టీకి వెళ్లిపోవడమో లేదా అసలు ప్రజా జీవితం నుంచే వైదొలగడమో జరిగింది. అయితే ఆశించి భంగపడినా ఏదో ఒక రోజు తమకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందనే ఆశాభావంతో యథావిధిగా పార్టీకి తమ సేవలు కొనసాగిస్తున్న ఉదాత్తులూ ఉన్నారు. ఎంతకష్టపడ్డా కనీస గుర్తింపు లభించని వారినటుంచితే పెద్దగా సేవలు అందించనివారు పార్టీ ఆసరాతో ఉన్నత పదవులను అధిష్ఠించినవారున్నారు అదే సమయంలో పార్టీ ఆలంబనతో ఎన్నికలలో పోటీ చేస్తూ ఒక్కసారీ గెలవలేనివారు మళ్లీ మళ్లీ పార్టీ టిక్కెట్ పొందడమూ జరుగుతోంది.. బహుశా, కష్టపడి పని చేయడం కాకుండా, తమను తాము మార్కెటింగ్ చేసుకోవడమే నేటి కాలంలో విజయ సాధనకు రాజమార్గం కాబోలు!



> వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అంకితమైన నాయకుడు తాటిపాముల నాగయ్య. బీసీల శ్రేయో సాధన గురించే ఆయన సదా ఆలోచించేవారు. చేనేత కార్మికుల సంక్షేమానికి, వారి ఆత్మహత్యలను నిరోధించేందుకు ఆయన ఎంతో కృషి చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆదేశంపై నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా పర్యటించి చేనేత వర్గాల వారిని కలుసుకుని వారి స్థితిగతులు, సమస్యల పరిష్కారంపై ఒక సమగ్ర నివేదికను నాటి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు.

తాము పని చేస్తున్న పార్టీలకు అంకితమయి పోయిన పలువురిని నేను చూశాను. అటువంటి వారిలో ముందుగా తాటిపాముల నాగయ్య గారు ప్రముఖంగా మనసులో మెదులుతారు. దశాబ్దాల పాటు తన పార్టీ ఉన్నతికి కృషి చేసిన కష్టజీవి ఆయన. ఈ కోవకు చెందిన ఇతరులు శ్యామ్ మోహన్ కుసుమ్ కుమార్, జి.నిరంజన్. 1970 దశకం తుదినాళ్ల నుంచి తమకు అప్పగించిన బాధ్యతలను వారు సమర్థంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతకూ కనీస గుర్తింపు లభించకపోవడంతో అసంతృప్తి చెందిన సిజె శ్రీనివాస్ ప్రజా జీవితం నుంచి వైదొలిగి వ్యక్తిగత పనులకు, కుటుంబానికి పరిమితమయ్యారు. సంగిశెట్టి జగదీష్ సుదీర్ఘకాలం వేచి చూసి, ఆశోపహతుడై ప్రత్యామ్నాయ పార్టీలో చేరారు. తాటిపాముల నాగయ్య కొద్ది రోజుల క్రితం శాశ్వత నిద్రలోకి జారిపోయారు. జీవితంలో మాదిరిగానే మరణంలో కూడా ఆయనకు సరైన గుర్తింపు లభించలేదు. నాగయ్యగారు తన అంత్య దినాలను హైదరాబాద్‌లోని అద్దె గృహంలోనో లేదా స్వస్థలం బెల్లంపల్లిలోనే గడిపారు. మరణానికి బెల్లంపల్లిని ఎంచుకున్నారు. హైదరాబాద్‌లో ఉండగా, అప్పడప్పుడు మమ్ములను కలవాడానికి మినహా పెద్దగా బయటకు వచ్చే వారు కాదు. తన సేవలకు సరైన గుర్తింపు లభించలేదని ఆయన ఎన్నడూ ఆక్రోశించలేదు. అయితే అంతరంగికులతో చాలా అరుదుగా తన కష్టానికి సరైన గుర్తింపు లభించలేదని వాపోయేవారు.

తన పార్టీకి అంకితమైన విధంగానే వెనుకబడిన వర్గాల జాగృతి, అభ్యున్నతికి కూడా నాగయ్య గారు అంకితమయ్యారు. బీసీల శ్రేయో సాధన గురించే ఆయన నిత్యం ఆలోచించేవారు. అర్ధరాత్రి గాఢ నిద్రలో ఉండగా లేపినా కూడా వెనుకబడిన వర్గాల సమస్యల పరిష్కారం గురించి సుదీర్ఘంగా చర్చించేవారు. తనకు అప్పగించిన పనిని ఉత్సాహంతో అకుంఠిత దీక్షతో నిర్వర్తించేవారు. అందుకే సీనియర్ సహచరుడు కుసుమ్ కుమార్ ఆయనను ఎన్ఎస్‌యుఐ నాయకుడుగా సంబోధించేవారు. ఏడు పదుల వయస్సులో ఉన్న నాగయ్యగారు అంత యౌవనోత్సాహంతో పని చేసేవారు. నేత కార్మికుల సంక్షేమానికి, వారి ఆత్మహత్యలను నిరోధించేందుకు నాగయ్యగారు ఎంతో కృషి చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆదేశంపై నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా పర్యటించి చేనేత వర్గాల వారిని కలుసుకుని వారి స్థితిగతులపై, సమస్యల పరిష్కారంపై ఒక సమగ్ర నివేదికను నాటి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. నాగయ్యగారు 1978 నుంచి 1994 దాకా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార చేనేత కార్మికుల సంఘం (ఆప్కో)లో ఎన్నికైన డైరెక్టర్‌గా ఉన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కూడా పని చేశారు.

వెనుకబడిన వర్గాల వారి పురోగతి గురించి నిత్యం ఆలోచించిన నాగయ్యగారు ఎన్నడూ అసెంబ్లీకి పోటీ చేయాలని ఆరాటపడలేదు. శాసన మండలి సభ్యత్వాన్నీ ఆశించలేదు బీసీలకు మరిన్ని స్థానాలను కేటాయించాలని మాత్రమే కోరేవారు. 2018నాటి అసెంబ్లీ ఎన్నికలలో 14 మంది బీసీలకు టిక్కెట్ ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. నాగయ్యగారూ, నేనూ అహ్మద్ పటేల్‌ను కలుసుకుని ఆ సంఖ్యను 26కు పెంచేలా ప్రయత్నించి సఫలమయ్యాం. ఆయన గానీ, నేను గానీ మాకు టిక్కెట్ ఇవ్వాలని అడగలేదు అనే విషయాన్ని కూడ ఇక్కడ ప్రస్తావించవలసి ఉన్నది.

2012లో నాగయ్యగారిని రాజ్యసభకు పంపాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. ఆయన అనుమతి తీసుకోవడానికి నాటి పీసీసీ అధ్యక్షుడు నాగయ్య గారికి ఫోన్ చేసినప్పుడు ఆయన విమాన ప్రయాణంలో ఉన్నారు. నాగయ్యగారు తన స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు ఇటీవలి నామినేషన్ల సందర్భంలో ప్రయత్నించారు. ఆయన అటువంటి ప్రయత్నం చేయడం అదే మొదటిసారి, చివరిసారి. ఆయన స్వప్నం ఫలించలేదు.

తాటిపాముల నాగయ్యగారి మరణంతో వెనుకబడిన వర్గాల వారు ఒక నిస్వార్థ నాయకుడిని కోల్పోయారు.

• డాక్టర్ పి.వినయ్ కుమార్
సర్జన్, అపోలో హాస్పిటల్స్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ప్రాజెక్ట్ కట్టిన ఏజెన్సీలపై నాటి ప్రభుత్వానికి ఎందుకంత దయ?

కాళేశ్వరం కహానీ 4



మేడిగడ్డ బ్యారేజీ అసలు కాంట్రాక్టు విలువ రూ.1849.31 కోట్లు కాగా, ఎల్‌అండ్‌టీ–పీఈఎస్ జేవీ సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారు. జరిగిన ఒప్పందం ప్రకారం 26–8–2016 తేదీ నుంచి బ్యారేజీని 24 నెలల లోపు పూర్తి చేయాలి. కానీ తర్వాత మేడిగడ్డ బ్యారేజీ కాంట్రాక్టు విలువను రూ.1849 కోట్ల నుంచి రూ.4321 కోట్లకు అంటే 133.67 శాతం పెంచారు. సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టుల్లో పెరుగుదల 133.67 శాతం కంటే చాలా తక్కువ ఉంటుంది. ఇంత భారీగా ఎందుకు పెరిగిందో ప్రాజెక్టు అధికారులు వివరించాలి. ప్రాజెక్టు అంచనాలను సిద్ధం చేసిన ఇంజనీర్లు, అధికారులకు ఆ సమర్థత లేకపోవడం వల్లా? మరి ఈ వైఫల్యానికి వారిపై ఏమైనా చర్యలు తీసుకున్నారా? ఇది లోతైన పరిశోధన జరగాల్సిన అంశం.

కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ సామర్థ్యం 180టీఎంసీలు. ఈ 180 టీఎంసీల్లో 2019–20లో వాస్తవంగా ఎత్తిపోసిన నీరు 61.66 టీఎంసీలు (34.25శాతం). 2020–21లో ఎత్తిపోసిన నీరు 31.82 టీఎంసీలు (17.68శాతం). 2021–22లో ఎత్తిపోసిన నీరు 61.66 టీఎంసీలు (18.87శాతం). 2022–23లో ఎత్తిపోసిన నీరు 25.97 టీఎంసీలు (14.43శాతం). 2023–24లో ఎత్తిపోసిన నీరు 8.93 టీఎంసీలు (4.96శాతం). అంటే ప్రాజెక్టు ప్రారంభించిన అయిదేళ్లలో ప్రతి ఏటా 180 టీఎంసీల చొప్పున మొత్తం 900 టీఎంసీలు ఎత్తిపోయాల్సి ఉండగా, కేవలం 162.36 టీఎంసీలు (18.04శాతం) మాత్రమే ఎత్తిపోశారు. ఇంత తక్కువ నీటిని ఎందుకు ఎత్తి పోశారు? అది కూడా ప్రతి ఏటా ఎందుకు తగ్గుతూ వచ్చింది? సాధారణంగా కొత్త ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం తర్వాత ఎత్తిపోసే నీటి పరిమాణం ఏటేటా పెరగాలి కదా?

ఇంత తక్కువ నీటిని ఎత్తిపోయడానికి ప్రధాన కారణం ప్రాజెక్టు మొత్తం డిజైన్ పూర్తిగా లోపభూయిష్టం కావటమే! దిగువ స్థాయి బ్యారేజీ నుంచి ఎగువనున్న బ్యారేజీకి, నదీ ప్రవాహానికి వ్యతిరేకంగా ఉన్న మరో ఎత్తయిన బ్యారేజీకి ఎత్తిపోస్తూ నదిపై మూడు బ్యారేజీలతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. వాస్తవానికి ఎత్తిపోయడం అవసరమే కానీ నదీ ప్రవాహానికి వ్యతిరేకంగా కాదు, కాలువల ద్వారా లోతట్టు ప్రాంతాల వైపు. ప్రాణహిత నీటిని వాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది కాబట్టి గోదావరి నది సంగమం తర్వాత నిల్వ చేయాల్సిన అవసరం ఉంది. అందుకోసం మేడిగడ్డ అనువైన స్థలం. కానీ మనకు కావాల్సింది బ్యారేజీకి బదులు ఆనకట్ట అయిన పెద్ద నిల్వ. తద్వారా ప్రాణహిత నుంచి వచ్చే నీటితో పాటు ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి మీదుగా గోదావరి నుంచి వచ్చే నీటిని నిల్వ చేసుకోవచ్చు. కానీ పెద్ద ఆనకట్టకు బదులుగా మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించి లోతట్టు ప్రాంతాలకు నీటిని ఎత్తిపోయకుండా నదీ ప్రవాహానికి వ్యతిరేకంగా ఎత్తిపోయడం లోపభూయిష్టమైన డిజైన్.

తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీతో పాటు మేడిగడ్డ వద్ద భారీ స్టోరేజీ ఉంటే బాగుండేది. నిజానికి తెలంగాణ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య గోదావరి నదిపై సరిపడా నిల్వలు లేకపోవడమే. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి మినహా గోదావరి నదిపై చెప్పుకోదగ్గ నిల్వలు లేవు. తప్పుగా డిజైన్ చేసిన ప్రాజెక్టుకు దేవాదులే ఉదాహరణ. దేవాదుల వద్ద ప్రవహించే నది నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్టు కోసం గోదావరి నదిపై ఎలాంటి స్టోరేజీ నిర్మించలేదు. అందుకే ఈ ప్రాజెక్టు నిర్మించి ఇరవై ఏళ్లు గడుస్తున్నా ఈ ప్రాజెక్టు కింద అనుకున్న 2.5 లక్షల హెక్టార్లకు బదులు కేవలం 85 వేల హెక్టార్లకు మాత్రమే సాగునీరు అందుతోంది.

2019లో కాళేశ్వరం ప్రారంభించిన వెంటనే మరమ్మతుల కోసం మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం చేపట్టిన ఏజెన్సీ (ఎల్‌అండ్‌టీ)కి నీటి పారుదల శాఖ పలు నోటీసులు జారీ చేసింది. 18–5–2020 తేదీన, సిసి బ్లాకులకు జరిగిన నష్టాలు, కోట్ అరుగుదల మొదలైన వాటిని పరిష్కరించాలని నీటి పారుదల శాఖ ఏజెన్సీని కోరింది. 17–02–2021 తేదీన, సిసి బ్లాకుల పునర్నిర్మాణం, కోటు అరుగుదల, డైవర్షన్ ఛానల్‌పై అప్రోచ్ రోడ్లు, గాంట్రీ క్రేన్ల కోసం మెయింటెనెన్స్ బేలను పూర్తి చేయమని నీటి పారుదల శాఖ ఏజెన్సీని కోరింది. 06–4–2022న సిసి బ్లాకుల్లోని లోపాలను, కోటు అరుగుదలను సరిచేయాలని, ఒరిజినల్ పనులను పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ ఏజెన్సీని కోరింది. 28–4–2023న బ్లాక్–7 దిగువ భాగంలోని వెంట్స్ 17, 18, 19 & 20 వద్ద నీటి లీకేజీని పరిష్కరించాలని, ఎగువ ప్రవాహం వైపు దిగువ ప్రవాహం వైపు శిథిలాలను తొలగించాలని, ఉన్న చోటు నుంచి కదిలిపోయిన సిసి బ్లాకుల మరమ్మతులు నిర్వహించాలని నీటిపారుదల శాఖ ఏజెన్సీని కోరింది. ఇన్నిసార్లు నీటి పారుదల శాఖ నుంచి నోటీసులు అందిన తర్వాత కూడా ఏజెన్సీ ఎందుకు స్పందించి వాటిని సరిచేయలేదో అప్పటి ప్రభుత్వానికి మాత్రమే తెలుసు. ఆ ఏజెన్సీలను ఎవరు రక్షించారో, వారిపై చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఏమిటో కూడా అప్పటి ప్రభుత్వానికే తెలియాలి.

> ఇన్నిసార్లు నీటి పారుదల శాఖ నుంచి నోటీసులు అందిన తర్వాత కూడా ఏజెన్సీ ఎందుకు స్పందించి వాటిని సరిచేయలేదో అప్పటి ప్రభుత్వానికి మాత్రమే తెలుసు. ఆ ఏజెన్సీలను ఎవరు రక్షించారో, వారిపై చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఏమిటో కూడా అప్పటి ప్రభుత్వానికే తెలియాలి.



ఏజెన్సీ (ఎల్‌అండ్‌టీ)తో నీటిపారుదల శాఖ ఒప్పంద నిబంధనల్లో అనేక వైరుధ్యాలు కనిపిస్తున్నాయి. నాణ్యత – భద్రతల విషయంలో ప్రాజెక్టు ఒప్పందంలోని షరతులకు అనుగుణంగా ఉందని పేర్కొంటూ 10–9–2019న కంప్లీషన్ సర్టిఫికేట్ జారీ అయ్యింది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో పూర్తి కానప్పటికీ 15–3–2021న కంప్లీషన్ సర్టిఫికేట్ ఇచ్చారు. ఇంచార్జి ఇంజనీర్ నోటీసులను పరిగణనలోకి తీసుకోకుండా రూ.159.72కోట్ల విలువైన పర్ఫార్మెన్స్ సెక్యూరిటీలను విడుదల చేశారు. లోపాలకు బాధ్యత వహించాల్సిన కాలం 29–02–2020న ప్రారంభమైందని ఇంజనీర్ ఇన్ చీఫ్ నివేదించారు, ఇది కంప్లీషన్ సర్టిఫికేట్లపై తేదీలతో పోలిస్తే భిన్నంగా ఉంది.

ఆనకట్టలు, సంబంధిత నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్ – 2021 కింద షెడ్యూల్డ్ తనిఖీలు అవసరం. తనిఖీలను ప్రీ మాన్సూన్, పోస్ట్ మాన్సూన్, ఇతర షెడ్యూల్డ్ తనిఖీలుగా విభజించారు. ఈ తనిఖీలు నిర్వహించే బాధ్యత ఫీల్డ్ ఇంజినీర్లదే. తనిఖీల సమయంలో గుర్తించిన ఏవైనా లోపాలపై దిద్దుబాటు చర్యల విషయంలో మూల్యాంకనం కోసం, సలహా కోసం స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్‌వో)కు నివేదించాలి. అటువంటి తనిఖీలు ఏవీ నిర్వహించలేదు, ఎస్డీఎస్‌వోకు నివేదించలేదు.

డ్యామ్ సేఫ్టీ యాక్ట్–2021 ప్రకారం నిర్వహణ కార్యకలాపాలను లాగ్ బుక్‌లో కచ్చితంగా నమోదు చేయాలి. ఈ రికార్డులలో నిర్వహణ విధానం, తేదీ, సమయం, వాతావరణ పరిస్థితులు, పాల్గొన్న సిబ్బంది లేదా కాంట్రాక్టర్ల వివరాలను నమోదు చేయాలి. అలాగే నిర్వహణ రికార్డుల్లో ఈ కార్యకలాపాలు జరగక ముందు దశ తర్వాతి దశల ఫొటోలు, జరిగిన పని, దాని వ్యవధి, వినియోగించిన మెటీరియల్, ఎక్విప్‌మెంట్ల వివరాలు ఉండాలి. అయితే ఇక్కడ ఎలాంటి నిర్వహణ రికార్డులు లేవు. ఇండియన్ స్టాండర్డ్ ఐఎస్ 7349:2012 ప్రకారం ఏటా ఋతు పవనాల అనంతరం బ్యారేజీల్లో 'స్కారింగ్' (scouring), అప్రాన్ డ్యామేజ్ మదింపును తప్పనిసరిగా చేయాలి. ఇందులో భాగంగా అప్రాన్ దిగువన ఉన్న ప్రాంతాలను తనిఖీ చేయాలి. నీటిపారుదల శాఖ అధికారులు ఈ తనిఖీలను నిర్వహించలేదు.

క్లుప్తంగా చెప్పాలంటే అటు నీటి పారుదల శాఖ, ఇటు ఏజెన్సీ ఈ రెండువైపులా అనేక లోపాలు కనిపిస్తున్నాయి. కొన్ని ఉదాహరణలు పేర్కొంటే– బ్లాక్–7 నిర్మాణం ప్రణాళికకు భిన్నంగా ఉంది; రాఫ్ట్ ఇంకా సెకెంట్ పైల్స్‌ను నిర్దిష్ట సీక్వెన్షియల్ పద్ధతిలో వేయలేదు; 21–6–2019న ప్రారంభించినప్పటి నుంచి ఆపరేషన్, మెయింటెనెన్స్ చేయలేదు; ఐఎస్ 7349:2012 నిబంధనల ప్రకారం వర్షాకాలం తరువాత సౌండింగ్, ఇన్వెస్టిగేషన్ చేయలేదు; కాఫర్ డ్యాం, షీట్ పైల్స్ వంటి నిర్మాణ అవశేషాలను తొలగించలేదు; అగ్రిమెంట్ అప్పగింత క్లాజ్ కింద ఒప్పంద బాధ్యతలు నెరవేరలేదు; ప్రధాన బ్లాకులను సబ్ కాంట్రాక్టర్ నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి, దీనిపై కూడా విచారణ జరపాలి; పనులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ బ్యాంకు గ్యారంటీలు విడుదల చేశారు.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఈ మూడు బ్యారేజీల డిజైన్లతో సహా కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్లను సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) ఆమోదించిందని టీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ చెబుతుంటుంది. కానీ ఇది నిజం కాదు. హైడ్రాలజీ (ప్రాజెక్టు స్థలంలో తగినంత నీరు అందుబాటులో ఉందని నిర్ధారించటం), ఇంకా అంతర్రాష్ట్ర అనుమతులు (అంతర్రాష్ట్రాల మధ్య సమస్యలు లేవని నిర్ధారించటం) ఈ రెండు అంశాల్ని మాత్రమే సీడబ్ల్యూసీ ఆమోదించింది. డిజైన్లకు సంబంధించి సీడబ్ల్యూసీ తన మార్గదర్శకాల్లో ఏ రాష్ట్రంలోనైనా నీటి పారుదల శాఖలో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) విభాగం ఉంటే, నీటి పారుదల శాఖ చేసిన పటిష్ఠ ప్రణాళిక, పరిశోధనల ఆధారంగా ఆ సీడీవో విభాగం డిజైన్లు తయారు చేయాలని పేర్కొంది. సీడీవో విభాగం తాను చేసిన అన్ని కార్యకలాపాల జాబితాతో కూడిన చెక్ లిస్ట్‌లో దీనిని ధ్రువీకరించాలి. ఆ రకంగా వారు బాధ్యత తీసుకుంటారు. ప్రస్తుత సందర్భంలోనూ తెలంగాణ సీడీవో డిజైన్లు తయారు చేసి, తాము ఏయే ఇతర కార్యకలాపాలు కూడా చేశామో సర్టిఫై చేస్తూ బాధ్యత తీసుకున్నారు. అంతేతప్ప ప్రభుత్వం చెబుతున్నట్టు ప్రాజెక్ట్ డిజైన్లను సెంట్రల్ వాటర్ కమిషన్ ఆమోదించటం ఎప్పుడూ జరగలేదు.

■ వెదిరె శ్రీరామ్
కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సలహాదారు

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru









ఉచిత బస్సు తప్ప.. అంతా ఉత్తుత్తే..

కాంగ్రెస్ దుష్ట పరిపాలనలో హామీలేవీ నెరవేరడం లేదు

- మానుకోట జిల్లా ఉండాలంటే. బీఆర్ఎస్ గెలవాలె..
- బస్సుయాత్ర, కార్నర్ మీటింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్

మహబూబాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ దుష్ట పరిపాలనలో ఉచిత బస్సు తప్ప.. ఇతర హామీలేవీ అమలు కావడం లేదని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్ నిర్వహిస్తున్న బస్సుయాత్ర బుధవారం సాయంత్రం భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రం నుంచి రాత్రి 7.10గంటలకు మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. కానీ ఆయన ప్రచారంపై బుధవారం రాత్రి 8గంటల నుంచి 48 గంటల పాటు ఎన్నికల కమిషన్ నిషేధం విధించిన నేపథ్యంలో.. 7.20గంటలకు ఇందిరాగాంధీ సెంటర్‌కు చేరుకున్న ఆయన.. 14 నిమిషాల పాటు ప్రసంగించారు.

తాను మారుమూల గిరిజన ప్రాంతమైన మహబూబాబాద్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేస్తామని స్పష్టంగా చెబుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటికీ బ్రేక్ వేయాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. తన ప్రచారంపై 48 గంటల పాటు నిషేధం విధిస్తే.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు 96 గంటలు అవిశ్రాంతంగా పనిచేస్తారని కేసీఆర్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పాలనలో రైతులు నష్టపోతున్నారని, ఉచిత బస్సు పథకంతో ఆటోరిక్షా కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో ఈ ప్రాంతానికి ఎన్నడు నీళ్లు రాలేదని, కాళేశ్వరం కట్టిన తర్వాతనే వెన్నవరం కాలువల ద్వారా నీళ్లు వచ్చాయని వివరించారు. తెలంగాణకు న్యాయం చేసేందుకు తనగొంతులో ప్రాణం ఉన్నంత వరకు పోరాడుతానని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం గోదావరి నీళ్లను తీసుకుపోతోందని, సీఎం రేవంత్‌రెడ్డి మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేటల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని, కరెంట్, భగీరథ పథకాలు ఎక్కడికి పోయాయయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులను గౌరవించలేదని, మహబూబాబాద్ ప్రాంతంలో సేవాలాల్ దేవాలయాన్ని బీఆర్ఎస్ పాలనలో నిర్మించామని, గిరిజనులకు రిజర్వేషన్లను కల్పించామని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ కార్నర్ మీటింగ్‌లో మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, ఎమ్మెల్సీలు వద్దిరాజు రవిచంద్ర, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్.రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, హరిప్రియ, రేగ కాంతారావు, మానుకోట, ములుగు జడ్పీ ఛైర్‌పర్సన్‌లు ఆంగోతు బిందు, బడె నాగజ్యోతి తదితర నేతలు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

రాముడి పేరు చెప్పి బీజేపీ ఓట్లడగడం సిగ్గుచేటు

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం..
- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్ సిటీ, మే 1: రాముడి పేరు చెప్పి బీజేపీ ఓట్లడగడం సిగ్గుచేటని, ఇక రాముడిని ప్రతిష్ఠించాలంటే రాముడిని ఒక్కడినే కాకుండా సతీసమేతంగా విగ్రహ ప్రతిష్ఠాపన చేయాలని, కానీ నరేంద్రమోదీ బ్రహ్మచారి కాబట్టి సీతతో కాకుండా రాముడిని ఒక్కడినే ప్రతిష్ఠించారని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆక్షేపించారు. బుధవారం వరంగల్‌లోని ఓసిటీ క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో, సమాజంలో ముస్లింలు ఒక భాగమని, అలాంటిది ముస్లింల రిజర్వేషన్లు తీసివేయడం ఎందుకని ప్రశ్నించారు. మత రాజకీయాలు చేయడంలో బీజేపీ దిట్టని, బీజేపీ మళ్లీ వస్తే రజాకార్ల వ్యవస్థ వస్తుందన్న భయమేస్తోందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సరిగ్గా నాలుగు నెలలు కాలేదని.. అప్పుడే పథకాలు అమలు చేయలేదని విమర్శలు చేయడం తగదన్నారు. ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఐదు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఆగస్టు 15లోపు కచ్చితంగా రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని, ఇప్పటికే ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు 92 శాతం రైతుబంధు డబ్బులు పంపిణీ చేశామన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డ నీరు వదలడంతో చాలా ప్రమాదకరంగా మారాయని, ఇప్పటికే వాటిపై విచారణ జరుగుతుంన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించుకోబోతున్నామన్నారు. బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ చరిష్మా లేని అభ్యర్థులను పోటీలోకి దింపిందని, దీన్ని బట్టే ఆ పార్టీ వ్యూహం ఏమిటో అర్థమవుతుందన్నారు. రాబోయే ఎన్నికల లోపే బీఆర్ఎస్ ఖాళీ అయ్యే పరిస్థితి కనబడుతుండటంతో కేసీఆర్ అభద్రతా భావానికి లోనై ఏం మాట్లాడుతున్నారో తెలియని స్థితికి చేరుకున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, అధికార ప్రతినిధి చిప్ప వెంకటేశ్వర్లు, మహిళా సిటీ అధ్యక్షురాలు నారగోని స్వప్న, గోరంటాల రాజు, దాసరి రాజేష్, సిలువేరు శ్రీనివాస్, గుండేటి శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

- ఒకరిని అరెస్టు చేసిన సుబేదారి పోలీసులు

వరంగల్ క్రైం, మే 1: ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన పి.బుచ్చయ్య అనే నిందితుడిని సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం హనుమకొండ అదాలత్ జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న బుచ్చయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా పలు విషయాలను తెలిపినట్లు పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన బుచ్చయ్య.. హైదరాబాద్‌లో ఉంటూ మరో ఎనిమిది మందితో ముఠాగా ఏర్పడి గ్రూపు-1 ఉద్యోగాలు ఇప్పిస్తామని కోట్లలో డబ్బులు వసూలు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలువురి వద్ద డబ్బులు వసూలు చేసి మోసం చేశారు. వీరి మోసంపై అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన సుబేదారి పోలీసులు.. ముఠాలో ఒక సభ్యుడైన వరంగల్‌కు చెందిన వీరేశంను మార్చి 28న అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే మంగళవారం మరో నిందితుడైన బుచ్చయ్యను అరెస్టు చేశారు. బుచ్చయ్య అరెస్టును సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి ధ్రువీకరించారు. మిగతా ముఠా సభ్యుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు.


బుచ్చయ్యను అరెస్టు చేసిన పోలీసులు


మాట్లాడుతున్న కడియం శ్రీహరి, పక్కన కావ్య

అరూరికి ఓటమి భయం..

- అందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు..
- ఎర్రబెల్లి, అరూరిని మడతబెట్టిన నియోజకవర్గాల ప్రజలు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

7


మాట్లాడుతున్న అరూరి రమేష్

ఎన్నికల్లో ఆశీర్వదించండి..

- దళితులను ముట్టుకోని వ్యక్తి కడియం కావ్య
- పదవులు అనుభవించి కేసీఆర్‌కు కడియం వెన్నుపోటు
- వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి


దమ్మన్నపేట సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు


మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవుడిపై ఒట్లు.. కేసీఆర్‌పై తిట్లు..

- ఇదే సీఎం రేవంత్‌రెడ్డి పనితీరు
- అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- వర్ధన్నపేట మండలంలో సుధీర్‌కుమార్‌తో కలిసి ప్రచారం

వర్ధన్నపేట రూరల్, మే 1: దేవుడిపై ఒట్టు వేసి కేసీఆర్‌ను తిట్టడమే సీఎం రేవంత్‌రెడ్డి నిత్యం పనిగా పెట్టుకున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎద్దేవా చేశారు. బుధవారం వర్ధన్నపేట మండలంలోని చెన్నారం, నల్లబెల్లి, ఉప్పరపెల్లి, రాంధాన్ తండా, కత్త్ర్యాల, ఇల్లంద, బండౌతపురం, దమ్మన్నపేట, రామవరం, కొత్తపెల్లి గ్రామాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి, సంక్షేమం కనపడిందని, కాంగ్రెస్ వచ్చాక ఆగం, అధోగతి కనిపిస్తోందని ఆరోపించారు. చల్లగా ముందుకు పోతున్న రాష్ట్రాన్ని ఆగం చేసిన కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయించాలంటే ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఒక ఉద్యమకారుడికి.. ఇద్దరు మోసగాళ్లకు మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవని గుర్తుచేశారు. తెలంగాణ కోసం గొంతెత్తి, తెలంగాణ హక్కులు కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని, అందుకే పార్లమెంటులో బీఆర్ఎస్ గళం వినిపించడానికి గులాబీ దళం ఉండాలన్నారు. మార్పు అనగానే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని, కానీ, రుణమాఫీ, రైతు బంధు, మహిళలకు రూ.2500 వచ్చాయా.. అంటూ ప్రశ్నించారు. మార్పు కావాలని కోరుతున్న ప్రజలకు మార్పు రాలేదని, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిందన్నారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా రుణమాఫీ పేరిట రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేసి ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు ఎందుకు ఓటు వేయాలో చెప్పకుండా దేవుడిపై ఒట్లు వేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీకి చేసిన మోసానికి శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీలో చేరిన అరూరి రమేష్ సైతం వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలను మోసం చేశాడని, వీరికి ఓటుతోనే సమాధానం చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ రాగానే రైతులు, నేతన్నల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం, మోటార్లు కాలడం మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ, కాంగ్రెస్‌ల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను నమ్మొద్దు : సుధీర్‌కుమార్

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాయమాటలు నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని వరంగల్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారుడినైన తనను కేసీఆర్ పిలిచి ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టడం సంతోషంగా ఉందన్నారు. కడియం శ్రీహరి, అరూరి రమేష్, పసునూరి దయాకర్‌లు బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని గుర్తుచేశారు. వీరిని పదేండ్ల పాటు అందలం ఎక్కించి పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించేలా చేస్తే తమ స్వార్థ రాజకీయాల కోసం పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆగం చేశారని తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని, నాయకులు, కార్యకర్తలు నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీ అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలిపించేలా గులాబీ సైనికులు పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దమ్మన్నపేటలో మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

బుధవారం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 43.5°C | కనిష్ఠం : 26.5°C

ఎర్ర జెండాలతో ఎరుపెక్కిన నగరం

- ఘనంగా మేడే వేడుకలు

8


ఎర్రజెండాను ఆవిష్కరించిన సీపీఎం జిల్లా కార్యదర్శి చక్రపాణి

ముగిసిన 32 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం

- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో రవి మృతి
- సమాచారం అందించిన పోలీసులు
- భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో విషాదం


రవి (ఫైల్)

భీమదేవరపల్లి, మే 1: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేశవబోయిన రవి (48) ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు ఛతీస్‌ఘడ్ పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భీమదేవరపల్లి మండలం వంగరకు చెందిన కేశవబోయిన రాజయ్య-లచ్చమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు. వృత్తిరీత్యా రాజయ్య సింగరేణి కార్మికుడిగా బెల్లంపల్లిలో పనిచేశాడు. వారి చిన్న కుమారుడైన రవి పదో తరగతి వరకు బెల్లంపల్లిలో చదివాడు. పదో తరగతి ఫెయిల్ అయ్యావని కుటుంబ సభ్యులు ప్రశ్నించడంతో ఉద్యమ బాట పట్టాడు. రవి పీపుల్స్‌వార్ ఉద్యమంలో పనిచేస్తున్నట్లు తెలుసుకున్న బెల్లంపల్లి పోలీసులు రవి తల్లిదండ్రులకు 2002లో కౌన్సెలింగ్ నిర్వహించారు. రవిని జనజీవన స్రవంతిలో కలవాలని తల్లిదండ్రుల ద్వారా పోలీసులు రప్పించేందుకు ప్రయత్నం చేశారు. కానీ రవి సమచారం తెలియలేదు. దీంతో పోలీసులు, తల్లిదండ్రులు రవిని వెతడం మానేశారు.

2004లో రవి తల్లి లచ్చమ్మ, 2016లో రవి తండ్రి రాజయ్య మృతి చెందారు. తల్లిదండ్రులు మరణించినప్పుడు కూడా రవి ఇంటి ముఖం చూడలేదు. దండకారణ్యంలో రవి అలియాస్ విన య్, అలియాస్ అశోక్‌గా గుర్తింపు పొందాడు. 32 యేళ్ల పీపుల్స్‌వార్ ఉద్యమంలో పనిచేసిన రవి.. అంచెలంచెలుగా దండకారణ్యంలో డీవీసీఎం స్థాయికి ఎదిగాడు. రెండ్రోజుల కిందట ఛతీస్‌ఘడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మహిళలతో పాటు పది మంది నక్సలైట్లు మృతి చెందినట్లు ఛతీస్‌ఘడ్ పోలీసులు ప్రకటించారు. అందులో వంగర గ్రామానికి చెందిన రవి ఉన్నట్లు గుర్తించి వంగరలో ఉన్న రవి పెద్దన్న వెంకట్‌కు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఛతీస్‌ఘడ్‌లోని నారాయణపూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో భద్రపరిచినట్లు అక్కడి పోలీసులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రవి సోదరుడు వెంకట్, మరికొంత మంది కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు బుధవారం మధ్యాహ్నం వంగర నుంచి ఛతీస్‌ఘడ్‌కు బయలుదేరి వెళ్లారు. 32 ఏళ్లుగా వంగర గ్రామంతో సంబంధాలు తెగిపోయిన రవి.. ఛతీస్‌ఘడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడని తెలుసుకున్న గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.





నా చావుకు సీఐ, ఎస్‌ఐ కారణం

- సూసైడ్ నోట్ రాసి అదృశ్యమైన వ్యక్తి
- నా భర్తను కాపాడండి : బాధితుడి భార్య


అదృశ్యమైన ప్రశాంత్

వరంగల్ క్రైం, మే1: తన చావుకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ సీఐ జె.సురేష్, ఎస్ఐ ఎం.సురేష్‌తోపాటు మరో ఐదుగురు కానిస్టేబుళ్లు కారణమని ఆరోపిస్తూ వంగపహాడ్ గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే వ్యక్తి సూసైడ్ నోట్ రాసి అదృశ్యమవడం కలకలం రేపింది. గ్రామంలో తనకు వీరేశం అనే వ్యక్తి డబ్బులు ఇవ్వాల్సి ఉండగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. పోలీసుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నాని పేర్కొంటూ ప్రశాంత్ మంగళవారం అదృశ్యమయ్యాడు. అయితే తన భర్తను కాపాడి పోలీసులపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ బాధితుడి భార్య మాధవి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. సహాయం కోసం వెళితే హసన్‌పర్తి సీఐ, ఎస్ఐలు కొట్టడం వల్లనే అవమానం భరించలేక తన భర్త సూసైడ్ నోట్ రాసి ఎటో వెళ్లిపోయాడని ఆమె విలపించారు. తన భర్తకు ఏదైనా జరిగితే దానికి సీఐ, ఎస్ఐ బాధ్యత వహించాలని ఆమె తెలిపారు. కాగా, డయల్ 100ను దుర్వినియోగం చేశాడని సోమవారం హసన్‌పర్తి పోలీసులు ప్రశాంత్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన విషయం తెలిసిందే. అదేరోజు సాయంత్రం నుంచి ప్రశాంత్ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సమాజ సమస్యలపై వ్యాసరచనలు చేపట్టాలి

సుబేదారి, మే 1: సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై వ్యాసరచనలు చేపట్టాలని కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి వ్యవసాయ, విద్య, వైద్య సామాజిక రంగాలపై రాసిన వివిధ పత్రికల్లో ప్రచురితమైన వ్యాసాల సంపుటి పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రమేష్ మాట్లాడుతూ.. సామాజిక శాస్త్రాల అధ్యాపకులకు సమాజంపై పూర్తి అవగాహన ఉండాలని అన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, సీనియర్ అధ్యాపకులు అంజనారావు, డాక్టర్లు కరుణాకర్, శ్రీధర్‌కుమార్, శేషు, శ్రీలత, మాధవి, రాంబాబు, సుచరిత, నాగయ్య, భిక్షపతితోపాటు రచయిత ఆదిరెడ్డి పాల్గొన్నారు.



10 జీపీఏ సాధించిన వారికి మోషన్ కళాశాలలో ఉచిత విద్య

వరంగల్ ఎడ్యుకేషన్, మే 1: పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు హనుమకొండ నయీంనగర్‌లోని రాజస్థాన్ కోట మోషన్ జూనియర్ కళాశాలలో రెండేళ్ల ఫ్రీ ఎడ్యుకేషన్ అందిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఐఐటీ, నీట్‌లకు విద్యను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే 9.8 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఐఐటీ, నీట్‌తో పాటు కళాశాల ఫీజులో 50 శాతం రాయితీని ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐఐటీ, మెడికల్‌లో సీట్లు సాధించడమే లక్ష్యంగా నెలకొల్పిన రాజస్థాన్ కోట మోషన్ జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రతిభ కలిగిన ఉత్తమ విద్యార్థులను గుర్తించి ఉచితంగా విద్యను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మిగతా అన్ని వివరాలకు నయీంనగర్‌లోని మోషన్ జూనియర్ కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

మహిళ ఖాతా నుంచి డబ్బులు మాయం

హనుమకొండ టౌన్, మే1: మహిళ బ్యాంక్ ఖాతా నుంచి ఆమెకు తెలియకుండానే వేరే ఖాతాలోకి డబ్బులు బదిలీ అయ్యాయి. హనుమకొండ కిషన్‌పురలో నివాసం ఉంటున్న రజిని అనే మహిళ ఏప్రిల్ 26న ఉదయం బ్యాలెన్స్ చెక్ చేసుకోగా రూ.30,000 డ్రా చేసినట్లుగా చూపించింది. వెంటనే సంబంధిత బ్యాంకు మేనేజర్‌ను ఫోన్‌లో సంప్రదించగా సత్యం ఎంటర్‌ప్రైజెస్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లుగా సమాచారం ఇచ్చాడు. కాగా, బాధితురాలు బుధవారం హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు పేర్కొనారు.

కాజీపేటలో పోలీసుల తనిఖీలో రూ.3.41 లక్షలు పట్టివేత

కాజీపేట, మే 1: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల వాహనాలు తనిఖీ చేస్తుండగా తనిఖీలలో ఇద్దరు వ్యక్తులు సరైనపత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట డీజిల్‌కాలనీ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన లక్కాకుల సురేశ్ సరియైన పత్రాలు లేకుండా బైక్‌లో రూ.2,71,060 తరిలిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇదే చెక్‌పోస్ట్ వద్ద వరంగల్‌కు చెందిన మిట్టపల్లి రాకేశ్, సరైన పత్రాలు లేకుండా తన బైక్‌లో రూ.70వేల 800 తరలిస్తుండగా పట్టుపడ్డారు. నగదు స్వాధీనం చేసుకుని అధికారులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.







అరూరికి ఓటమి భయం

అందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు ● ఎర్రబెల్లి, అరూరిని మడతబెట్టిన నియోజకవర్గాల ప్రజలు : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వర్ధన్నపేట రూరల్, మే 1 : వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలోని ఏబీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కమిటీల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బూత్ కమిటీలే పార్టీకి పునాదులని, రానున్న రోజుల్లో కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. బీజేపీతో పదేండ్లుగా ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని, అన్ని రంగాల్లో విధ్వంసం జరిగిందని ఆరోపించారు. కడియం కావ్య నియోజకవర్గ పరిధిలోని పర్వతగిరి గ్రామంలోనే పుట్టి పెరిగిందని, చదువుకుని మళ్లీ వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యురాలిగా పనిచేసిందని గుర్తుచేశారు. ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాలు తెలిసిన కావ్యను గెలిపించి ఆశీర్వదించాలని కోరారు.

పార్లమెంటు అభివృద్ధిని మరిచి వ్యక్తిగత విమర్శలు చేస్తున్న అరూరికి ప్రజలే గుణపాఠం చెబుతారని తెలిపారు. వంద శాతం కడియం కావ్య లోకలేనని స్పష్టం చేశారు. రైతుల భూములు లాక్కొని రియల్ ఎస్టేట్ వాళ్లతో కలిసి ఫెన్సింగ్‌లు వేసిన ఘనత రమేష్‌దని గుర్తు చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అరూరి రమేష్ మండలానికో గెస్ట్ హౌస్ నిర్మించుకున్నాడని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావును, వర్ధన్నపేటలో అరూరి రమేష్‌ను ప్రజలు మడతపెట్టి కొడితే దిమ్మ తిరిగి పోయిందని ఎద్దేవా చేశారు. మనుమరాలు వయసున్న అమ్మాయి చేతిలో ఓడిపోయిన ఎర్రబెల్లి ఇంకా సిగ్గులేకుండా నియోజకవర్గంలో తిరుగుతూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన మేనిఫెస్టోను తీసుకువచ్చిందని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద మహిళలకు రూ.లక్ష అందించడం ఖాయమన్నారు. కిసాన్ న్యాయ్ పేరుతో రైతులను ఆదుకుంటామని, పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

అరూరి అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు : కడియం కావ్య

వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఉండి అరూరి రమేష్ చేసిన అకృత్యాలు అన్నీ ఇన్నీ కావని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విమర్శించారు. అరూరి రమేష్ చేసిన అవినీతి, అక్రమాలు, అకృత్యాలు, భూకబ్జాలు ప్రజలందరికీ తెలుసని, మళ్లీ ఓట్ల కోసం వస్తున్న రమేష్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. బీజేపీ రైతుల సంక్షేమాన్ని మరిచి కార్పొరేట్ సంస్థల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. బీజేపీకి ధన బలముంటే, కాంగ్రెస్ పార్టీకి ప్రజాబలం ఉందన్నారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే అరూరి రమేష్ బీజేపీ పంచన చేరాడని తెలిపారు. వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నా, ఏనాడూ ఎమ్మెల్యేగా ఉండి పట్టించుకోలేదని ఆరోపించారు. కరోనా క్లిష్టకాలంలో సైతం ఇక్కడి ప్రజలకు తాను సేవ చేశానని, మీరు ఆశీర్వదిస్తే వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు.

అనంతరం వర్ధన్నపేట పట్టణానికి చెందిన వంద మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ నేత కత్తి వెంకటస్వామి, డీసీసీబీ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి కడియం కావ్య, పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కావ్యకు పలువురి మద్దతు

హనుమకొండ సిటీ/వడ్డెపల్లి: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్యకు తెలంగాణ మైనారిటీ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అఖిల్ పాషా మద్దతు తెలియచేశారు. బుధవారం హనుమకొండలోని కడియం కావ్య నివాసంలో సమాఖ్య ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ మజహార్ హుస్సేన్, మహ్మద్ అబిద్ నవాజ్, నూర్జహాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

అలాగే కడియం కావ్యకు సంపూర్ణ మద్దతును తెలుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ చెరుకు రాంచందర్ పేర్కొన్నారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు రాష్ట్ర కన్వీనర్ నల్లాల కనకరాజు, వైస్ ఛైర్మన్లు అనిల్, నాను మాట్లాడారు. ఈ సమావేశంలో జంగం బాబురావు, రాజకొమురయ్య, ఐలయ్య సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, కడియం శ్రీహరి

జేఎన్ఎస్‌లో కావ్య ఎన్నికల ప్రచారం

హనుమకొండ చౌరస్తా, మే 1: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్, ఔట్ డోర్ స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలసి హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మార్నింగ్ వాకింగ్ పాల్గొని వాకర్స్‌ను కలసి ముచ్చటిస్తూ చెయ్యి గుర్తుకు ఓటు వేసి తనని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు.

ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి మారు పేరు అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజాపాలన అందుబాటులోకి వచ్చిందని కొనియాడారు. కేంద్రంలో రాహుల్ గాంధీ సారథ్యంలో దేశ ప్రజలకు మంచి పాలన అందనుందని తెలిపారు. నిత్యం ప్రజల మధ్యలో అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. చెయ్యి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని వాకర్స్‌ను కోరారు. ప్రచారంలో భాగంగా సరదాగా క్రీడాకారులతో కలిసి ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడి ఆకట్టుకున్నారు. అంతకుముందు బాలసముద్రంలోని కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారంలో కావ్య పాల్గొని కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ మేరకు మార్కెట్‌లో ఉన్న వ్యాపారులు కావ్యకు మద్దతూ ప్రకటిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఉక్కిరిబిక్కిరి

ఎండల తీవ్రత, ఉక్కపోతతో జనం విలవిల

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 45.6డిగ్రీల సగటు ఉష్ణోగ్రత

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) / ములుగు/ భూపాలపల్లి టౌన్/ జనగామ కల్చరల్ / మహబూబాబాద్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) :ఎండల తీవ్రత మరింత పెరిగింది. ఎండతీవ్రతకు తోడు వడగాలులు, ఉక్కపోతకు జనం విలవిలలాడుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత 45.6 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం ములుగు జిల్లాలో అత్యధికంగా 45.6 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదవగా వరంగల్‌లో 45.4 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 45.3 డిగ్రీలు, జనగామలో 45.3 డిగ్రీలు, మహబూబాబాద్‌లో 45.1 డిగ్రీలు, హనుమకొండలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవగా వీటిలో అయిదు జిల్లాలు ఉమ్మడి వరంగల్ పరిధిలోనే ఉన్నాయి. ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరుగుతుండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయగా.. ఈ అయిదు జిల్లాలు ఆ జాబితాలో ఉన్నాయి. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో 45డిగ్రీలు దాటి ఎండల తీవ్రత ఉండడం వందేళ్లలో ఇదే మొదటి సారి అని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. 1921లో ఈ స్థాయిలో ఎండలు రికార్డు అయ్యాయని, ఆ తర్వాత ఏప్రిల్ నెలలో 45 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవలేదని, సాధారణంగా ఏప్రిల్‌లో 40 నుంచి 41డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటాయని, ఈ సారి మాత్రం ఇందుకు భిన్నంగా ఏప్రిల్ మొదటి వారం నుంచె ఎండలు 41 డిగ్రీలు దాటాయని చెబుతున్నారు.

ఉడికిపోతున్న ఏజెన్సీ మండలాలు

వేసవి తీవ్రతతో ములుగు జిల్లాలోని ఏజెన్సీ మండలాలు ఉడికిపోతున్నాయి. కొద్దిరోజులుగా 45డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా బుధవారం ఏకంగా 46డిగ్రీలు దాటింది. మంగపేట మండలం మల్లూరులో 46.5, వెంకటాపురం(నూగూరు) మండలం ఆలుబాకలో 46డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. అలాగే తాడ్వాయి మండలం మేడారంలో 44.4, వాజేడు మండలం ధర్మవరంలో 44.3, వెంకటాపూర్(రామప్ప)లో 44.2, ములుగు మండలం ఖాసిందేవిపేటలో 44, ఏటూరునాగారంలో 43.8, గోవిందరావుపేటలో 43.5, కన్నాయిగూడెంలో 42.3డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆరంజ్ జోన్ నుంచి రెడ్ జోన్‌లోకి వచ్చింది. నిన్న మొన్నటి వరకు 43 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న మండలాల్లో బుధవారం 45 డిగ్రీలు దాటింది. చిట్యాల మండల కేంద్రంలో 45.5డిగ్రీలు, మల్హర్ మండలంలోని తాడిచర్లలో 45.3, రేగొండ మండలంలోని గోరికొత్తపల్లిలో 45.3, అలాగే గణపురంలోని చెల్పూరులో 45.1 డిగ్రీలు, మొగుళ్లపల్లిలో 44.8 డిగ్రీలు నమోదవగా మిగిలిన మండలాల్లోనూ 45 నుంచి 42డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు జనగామ కూడా రెడ్‌జోన్‌లోకి వెళ్లింది. బుధవారం గరిష్ఠంగా 45.6డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదైంది. చిలుపూర్, జఫర్‌గడ్ మండలాల్లో 45.6, జనగామలో 45.0 డిగ్రీలు నమోదైంది.



మండే ఎండ.. పచ్చి గడ్డే అండ


ఎండలు మండుతున్నాయి... రోజురోజుకు ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. బయటకు రావాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. ఇక ఇళ్లలో ఉండే వారు ఉక్కపోతకు అల్లాడుతున్నారు. ముఖ్యంగా రేకుల ఇళ్లలో నివాసం ఉండే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ క్రమంలో హనుమకొండ న్యూశాయంపేట వద్ద రేకుల షెడ్డులో నివాసం ఉంటున్న ఓ కుటుంబం భానుడి ప్రతాపం నుంచి కొంత ఉపశమనం పొందేందుకు ఇలా వారు నివాసం ఉంటున్న రేకుల కప్పుపై పచ్చని జమ్మి గడ్డిని వేసుకున్నారు.

ఫోటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫోటోగ్రాఫర్, వరంగల్

వడదెబ్బతో ముగ్గురి మృతి

వడదెబ్బ బారిన పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌లో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మేరుగు నారాయణ (75) ఎండతీవ్రత, వడగాలుకు అనారోగ్యం పాలై.. బుధవారం పరిస్థితి విషమించి ఇంటివద్దే మృతిచెందాడు. జనగామ జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డకు చెందిన మహ్మద్ మొయినొద్దీన్ (52) అనే కూలీ రోజూలాగే బుధవారం కూడా పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి కుప్పకూలిపోయాడు. జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. అలాగే కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామానికి చెం దిన పత్తిపాక రమేష్(48) అనే చిరువ్యాపారి రోజూలాగే దుస్తులు అమ్మి మంగళవారం అస్వస్థతకు గురవగా ఆసుపత్రికి తరలించారు. కానీ ఆయన అప్పటికే మృతిచెందాడు.





లోక్‌సభ ఎన్నికల్లో ఆశీర్వదించండి..

- దళితులను ముట్టుకోని వ్యక్తి కడియం కావ్య
- పదవులు అనుభవించి కేసీఆర్‌కు కడియం వెన్నుపోటు
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్
- ఏనుగల్లు, పర్వతగిరిలో కార్నర్ మీటింగ్‌లు



పర్వతగిరిలో దివ్యాంగురాలితో మాట్లాడుతున్న అరూరి రమేష్

పర్వతగిరి, మే 1: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని ఏనుగల్లు, పర్వతగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్‌లను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. జై బీజేపీ.. జై అరూరి.. నినాదాలతో గ్రామాలు మార్మోగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు తనను రెండు సార్లు ఎమ్మెల్యేగా ఆశీర్వదించారని, ప్రస్తుతం మీ ఇంటి బిడ్డగా పార్లమెంట్ సభ్యుడిగా ఆశీర్వదించాలని కోరారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై తాను బీజేపీలో చేరానని, తనతో పాటు అనేక మంది మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించడానికి ఎన్ని కుట్రలు చేశారో ప్రజలకు తెలుసని, ప్రస్తుతం ఆ కుట్రలను పటాపంచలు చేయాలన్నారు. తనను ఓడించడం కోసం కడియం శ్రీహరి అనేక ప్రయత్నాలు చేశాడని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలకు కన్నీళ్లు మిగిల్చాయన్నారు. హామీలు అమలు చేసే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, కాంగ్రెస్ పార్టీ నేతలు వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లడుగుతారని, వారి మాటలను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు.

కడియం శ్రీహరి కుమార్తె కావ్యకు రేవంత్‌రెడ్డి ఎందుకు టికెట్ ఇచ్చాడో కాంగ్రెస్ నేతలు ఆలోచన చేయాలని అరూరి రమేష్ కోరారు. కాంగ్రెస్‌లో కష్టపడ్డ దళితులు లేరా అని ప్రశ్నించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని, కాంగ్రెస్ పార్టీ నేతల మీద లేని స్కాంలు లేవన్నారు. వర్ధన్నపేట ఆస్పత్రిలో కడియం కావ్య డాక్టర్‌గా పని చేసిందని, ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన దళితులను కనీసం ముట్టుకుని వైద్యం చేయలేదని విమర్శించారు. ఊసరవెల్లిలాగా రంగులు మార్చే వ్యక్తి కడియం శ్రీహరి అని, పదవులు అనుభవించి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. తాటికొండ రాజయ్య, పసునూరి దయాకర్‌తో పాటు తనను సైతం బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లగొట్టింది కడియం శ్రీహరి అని ఆరోపించారు. పదేళ్లు వర్ధన్నపేటకు ఎమ్మెల్యేగా ఉండి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, అవి మీ కళ్ల ముందే ఉన్నాయని తెలిపారు. మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందని, అభివృద్ధి చేసే బీజేపీకే ఓటు వేసి మళ్లీ పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మే 13వ తేదీన అందరూ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.



ఏనుగల్లులో ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కొండేటి శ్రీధర్, వరంగల్ తూర్పు బీజేపీ ఇన్‌చార్జ్ ఎర్ర బెల్లి ప్రదీప్‌రావు, జడ్పీ వైస్ ఛైర్మన్ గజ్జెల శ్రీరాములు, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, జిల్లా నాయకులు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, బన్న ప్రభాకర్, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు ఏకాంతం గౌడ్, నరేందర్ వర్మ, రంగు కుమార్ గౌడ్, రంగు రజిత, లక్ష్మీనారాయణ, బొట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్, మే 1 : మాదిగలకు ద్రోహం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు మాదిగలు, మాదిగ ఉపకులాలు ఓటు వేసి గెలిపించాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాదిగల అండతో రాజకీయంగా ఎదిగిన కడియం శ్రీహరి.. మాదిగలను రాజకీయంగా అణగదొక్కుతూ వారి రాజకీయ భవిష్యత్తును సమాధి చేస్తున్నాడని అన్నారు. కడియంకు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే మాదిగలకు, మాదిగ ఉపకులాలకు మేలు జరుగుతుందన్నారు. బీజేపీ గెలిస్తే మాదిగల అనేక ఏళ్ల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు పుట్ట రవి, నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ ఏలియా, నాయకులు గాదె శ్రీధర్, రడపాక అదాం, గాదెపాక మహేందర్, గంగాదర్, రవీందర్, గాదె కుమార్, మేడ యాకస్వామి, అశోక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజ్ఞా శిబిరం ప్రారంభం

హనుమకొండ కల్చరల్, మే 1: హనుమకొండ నక్కలగుట్టలోని వికాస తరంగిణి కార్యాలయంలో బుధవారం ప్రజ్ఞా పేరిట ప్రత్యేక వేసవి శిక్షణా శిబిరం ప్రారంభమైంది. వికాస తరంగిణి ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ డాక్టర్ బచ్చు రాధాక్రిష్ణ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవులను పిల్లలు సద్వినియోగం చేసుకునేందుకుగాను వారిని సంస్కరణవంతులుగా తీర్చేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా నాయకత్వ లక్షణాలు, భగవద్గీత శ్లోకాలు, అన్నమాచార్య సంకీర్తనలతోపాటు చిత్రలేఖనం, నీతి కథలు, భజనలు, యోగా అభ్యసం లాంటి అంశాలపై కూడా విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తర్ఫీదు ఇస్తారని చెప్పారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి ఆశయాలకు అనుగుణంగా రూపొందించిన తరగతులను బోధిస్తామని తెలిపారు. 3వ తేదీ నుంచి హనుమకొండ చౌరస్తాలోని వీనస్ ఫంక్షన్ హాలులో తరగతులు నిర్వహిస్తామన్నారు. చాడా సుభాష్‌రెడ్డి, యోగా గురువు శ్రీనివాస్, తనూజ పాల్గొన్నారు.

టెన్త్‌లో సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు



విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం

వరంగల్ ఎడ్యుకేషన్, మే1: పదో తరగతి ఫలితాల్లో తెలంగాణ శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించి 47మంది విద్యార్థులు అత్యధికంగా 10/10 జీపీఏ సాధించినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. 26 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 15 మంది 9.7 జీపీఏ, 115 మంది విద్యార్థులు 9.0 జీపీఏపైగా సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఐఐటీ, మెడికల్ కోచింగ్‌తోపాటు స్టేట్ సిలబస్‌లో కూడా అత్యున్నత ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

శ్రీనివాస గురుకుల్ హవా



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాస్ గురుకుల్ విద్యాలయం యాజమాన్యం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 1: పదో తరగతి ఫలితాల్లో హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస గురుకుల్ విద్యార్థుల హవా ఎప్పటిలాగే కొనసాగిందని పాఠశాల కరస్పాండెంట్ చిదురాల సోమరత్నం ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల నుంచి 27 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హా జరుకాగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. అరిగెల లాస్య 9.8 జీపీఏ సాధించగా మరో 14 మంది విద్యార్థులు 9 జీపీఏ కంటే ఎక్కువ జీపీఏ సాధించారు. తెలుగులో 8 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించగా, హిందీలో 6 గురు, గణితంలో 14, సైన్స్‌లో 9, సోషల్‌లో 6గురు 10 జీపీఏ సాధించారన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన ఉపాధ్యాయ బృందంతో కలిసి అభినందించారు.

అసంక్రమిత వ్యాధులపై స్క్రీనింగ్

వరంగల్ మెడికల్, మే 1: అసంక్రమిత వ్యాధులకు సంబంధించి 30 యేళ్లకు పైబడిన వారందరికీ మూడో దశ ఎన్‌సీడీ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు తెలిపారు. బుధవారం ఐఎంఏ హాలులో వైద్యాధికారులకు పునఃశ్చరణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ.. రెండు దశల్లో నిర్వహించిన పరీక్షలలో గుర్తించిన 91,149 మందికి బీపీ, 46,289 మందికి షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా నెలనెలా మందులను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ సత్యేంద్రనాథ్, అదనపు డీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ టి.మదనోహన్‌రావు, డాక్టర్ ఎం.డి.యాకూబ్‌పాషా, డాక్టర్ ప్రహసిత్ పాల్గొన్నారు.

ఓటు హక్కు.. సామాజిక హక్కు

వడ్డెపల్లి, మే 1 : ఓటు హక్కు.. సామాజిక హక్కు అని జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో బుధవారం ఓటు హక్కు వినియోగంపై చైతన్య రథాన్ని ప్రారంభించి బ్రోచర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ చారిటబుల్ ట్రస్టు వరంగల్, హనుమకొండ జిల్లాల కో ఆర్డినేటర్ పరికిపండ్ల వేణు, సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్, తేరాల యుగంధర్, మురళి మోహన్, నన్నె సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే వేడుకలు



హనుమకొండ సీపీఐ కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ రావు

న్యూశాయంపేట, మే 1: మేడే స్ఫూర్తితో శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు అరుణపతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించి అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ తోపాటు సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో న్యూశాయంపేటలో బుధవారం ఘనంగా మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

● జులైవాడ: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని బుధవారం 49వ డివిజన్‌లోని ఆటో యూనియన్, హమాలీ కార్మికులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ హాజరై కార్మిక జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆటో యూనియన్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

● కాజీపేట: కార్మిక దినోత్సవ వేడుకలను బుధవారం కాజీపేట, రైల్వే ఆఫీస్ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మే డే జెండాను సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో బుధవారం కాజీపేట బాపూజీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గడ్డం సదానందం జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పసునూరి రాజు, మోహన్, సింగం కిషన్, నరసింహారావు, అమరేందర్, అశోక్, హసన్, శివ, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ కార్యాలయం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీఏఆర్ డివిజనల్ అధ్యక్షుడు ఆంజేయులు, కాజీపేట బ్రాంచ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, సెక్రటరీ సుధాకర్‌రావు హాజరై మాట్లాడారు.

● వరంగల్ ఎడ్యుకేషన్: పని గంటల కోసం జరిగిన పోరాటంగా మే డే నుంచి కార్మికులు అందరూ స్ఫూర్తి పొందాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ బాధ్యుడు బద్దం వెంకటరెడ్డి అన్నారు. హనుమకొండలోని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో టీఎస్ యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.రవీందర్‌రాజు, తాటికాయల కుమార్, పెండెం రాజు, సి.సుజన్ ప్రసాద్‌రావు, జిల్లా బాధ్యులు సదాశివరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, డి.కిరణ్‌కుమార్, సిహెచ్.లింగారావు, సిఎస్ ఆంర్.మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ చౌరస్తా: సీఐటీయూ, టీఎమ్మార్పీఎస్ మునిసిపల్ కార్మికుల ఆధ్వర్యంలో హనుమకొండ అశోక జంక్షన్‌లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య ముఖ్య అతిథిగా హాజరై ముందుగా మేడే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు వేల్పుల ధర్మరాజు, టీఎంఈడబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడు రాజారపు భాస్కర్, కార్యదర్శి బొట్ల రమేష్, సీఐటీయూ మునిసిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మున్నంగి రఘు, సీఐటీయూ మునిసిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాతంగి నవనీత, మునిసిపల్ జవాన్లు రాము, ఎలేందర్, అనీల్, కార్మికులు ప్రమీల, రాధా, నిర్మలతో పాటు 5, 6, 7, 8 డివిజన్ల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ టౌన్: దేశంలో ప్రజలను పీడించే దోపిడీ రాజ్యం పోయి దేశ సంపదను సృష్టిస్తున్న కార్మికుల రాజ్యం రావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ అన్నారు. మేడే పురస్కరించుకొని ఎన్పీడీసీఎల్ స్టోర్ కార్యాలయం ఎదుట హమాలీ కార్మికులతో రమేశ్ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు విజయ్, నరేశ్, గణేశ్, కుమార్ పాల్గొన్నారు.

● జిల్లా పెయింటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హనుమకొండ కుమార్‌పల్లి పెయింటర్స్ అడ్డాలో మేడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత, తాటి సత్యనారాయణ మేడే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ఎర్రోజు భాస్కర్, కర్నాల శ్రీను, వాసు, తదితరులు పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: తెలంగాణ ఓరుగల్లు ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్స్, క్లీనర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దొడ్డిపాటి సారయ్య హనుమకొండ ఏకశిల పార్కు వద్ద ఏర్పాటు చేసిన మేడే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు బండి భాస్కర్, పాకాల చొక్కారావు, మిరుపోరి బెనర్జి, బొమ్మనబోయిన అశోక్, మచ్చ రమేష్, దిడ్డి నాగభూషణం, పల్నాటి రమేష్, గుండు గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ అడ్డా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడే జెండాను యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నేత రవీంద్రాచారి, సీఐటీయూ నేత కూస రాజేష్, జిల్లా కమిటీ సభ్యులు భట్టు రాజు తదితరులు పాల్గొని జెండాను ఆవిష్కరించారు.

● వరంగల్ కార్పొరేషన్: హనుమకొండ రాంనగర్, వరంగల్ తమ్మెర భవన్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయాల్లో ఆయా జిల్లాల నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఎర్రజెండాలను ఎగురవేశారు. రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌తో పాటు, సమ్మయ్యనగర్, వాంబే కాలనీ, వాజ్‌పేయి కాలనీలలో ఎర్రజెండాలు ఎగురవేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీపీఐ, సీపీఎం నాయకులు మేడే వేడుకలను జరుపుకున్నారు. ప్రపంచ కార్మికుల దినం మేడే అని, ఎంతో మంది ఉద్యమకారుల ప్రాణత్యాగాలకు గుర్తుగా యేటా ఈ వేడుకలు నిర్వహిస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. మేడే వేడుకల్లో భాగంగా హనుమకొండ రాంగనగర్‌లోని సుందరయ్య భవన్‌లో చక్రపాణి ఎర్రజెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వాసుదేవరెడ్డి, వీరన్న, సంపత్, తిరుపతి, గొడుగు వెంకట్, సీతారాం, లింగమూర్తి, రాము, కుమారస్వామి పాల్గొన్నారు.

● ఐనవోలు: మేడే స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా ఐనవోలు, వెంకటాపూరం, సింగారం, ముల్కలగూడెం, గర్మిళ్లపల్లి గ్రామాల్లో కార్మిక దినోత్సవ జెండాలను ఆవిష్కరించారు. ఐనవోలులో అయ్యన్న కాకతీయ ఆటో డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు కొత్తూరు రమేష్ జెండాను ఆవిష్కరించారు. గర్మిళ్లపల్లిలో ఎంపీటీసీ బీరం మౌనికదేవేందర్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని అమరులకు నివాళులర్పించారు.

కడియం కావ్య గెలుపే లక్ష్యం



ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న వాలువాయి ఉషాకిరణ్

వడ్డెపల్లి, మే 1: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య గెలుపే తమ లక్ష్యమని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వాలువాయి ఉషాకిరణ్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి ఝాన్సీ లక్ష్మి అన్నారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీ గిరిజనుల కోసం వికేంద్రీకరణ, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మూడు ప్రత్యేక ఆర్థిక కార్పొరేషన్లను ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా తమ సంస్థ కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ కడియం కావ్య గెలుపు కోసం లోక్‌సభ నియోజక వర్గంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. నియోజక వర్గంలోని అన్ని సామాజిక వర్గాలు కడియం కావ్య గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్‌టీఎఫ్ రాష్ట్ర సలహాదారు డాక్టర్ స్టీఫెన్, రాష్ట్ర స్టూడెంట్ అధ్యక్షుడు మేడ శ్రీను, కార్యనిర్వాహక అధ్యక్షుడు వలువాయి శ్రీను, లంబాడి మహిళా కో కన్వీనర్ వినోద, దేవరాయ సురేష్ పాల్గొన్నారు.

● పదేళ్ల దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు దళితుల అభివృద్ధిని విస్మరించాయని, ఆ పార్టీలను లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని దళిత జన సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు గబ్బెట బాబు అన్నారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు మనువాద బీజేపీ కుట్ర పన్నుతోందని విమర్శించారు. డాక్టర్ కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని దళిత, గిరిజన సామాజిక వర్గాలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో దళిత జన సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కంజెర్ల బాబు, బి. ప్రభాకర్, నల్ల ప్రభాకర్‌శ్రీనివాస్, జన్ను బాబు, బరుపట్ల అంజయ్య, చడపాక రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

మడికొండ: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హనుమకొండలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్న కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో దేశిని హనుమంతరావు, ఏర్పుల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

● గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ కుమ్మరిగూడెంలో బుధవారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సట్ల సదానందం ఆధ్వర్యంలో సుమారు వంద మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాజు, రవికుమార్, నాగరుప్పలసాంబయ్య, చిలుకూరి బాస్కర్, పాల్గొన్నారు.

కాజీపేటలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం బూత్‌సభ్యులతో సమావేశం అయ్యారు. కావ్య గెలుపుకోసం నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ ప్రచారంలో మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, పీఏసీఎస్ డైరెక్టర్ మేరుగు రాజయ్య, డివిజన్ అధ్యక్షులు పాలడుగుల ఆంజనేయులుతోపాటు స్థానిక నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు.

తిరోగమన దిశలో మోదీ ఆర్థిక విధానాలు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 1: పదేళ్ల నుంచి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలు పర్చిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విధానాలతో 90శాతం ప్రజలు అస్తవ్యస్థానానికి గురయ్యారని రాష్ట్ర ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ కూరపాటి వెంకట నారాయణ అభిప్రాయపడ్డారు. బుధవారం కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలోని పూలే ప్రాంగణంలో ప్రజాసంఘాలు, ఉద్యమకారులు, ప్రజాస్వామ్యవాదులు సంయుక్తంగా రూపొందించిన 'ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం, సామాజిక న్యాయాన్ని కాపాడుకుందాం, కాంగ్రెస్‌నూ గెలిపించుకుందాం' అనే రెండు పేజీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మోదీ ముందుచూపు లేని కారణంగా 70శాతం ఉన్న దేశ సంపద అత్యున్నత స్థాయిలో ఉన్న 10శాతం ప్రజలకే అందుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వ పాలనలో పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఉప్పు, పప్పు మీద జీఎస్టీ వేసి సామాన్యుల ఉసురు తీస్తున్నదని, దానితో నగటు మనిషి బడ్జెట్ తలకిందులైందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలలో ఓబీసీల కోటా 27 శాతం ఉండగా అందులో 10శాతం కూడా నింపకుండా దాటవేస్తూ, బీసీ అని చెప్పుకునే నరేంద్రమోదీ ఓబీసీలకు ఏరకంగా కూడా న్యాయం చేయలేదన్నారు. అందుకోసం తెలంగాణలో మార్పు కోరుకున్నట్లే మోదీ ప్రభుత్వాన్ని సాగనంపడం కోసం రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాలు పంపిణీ చేయాలని తెలంగాణ సమాజానికి ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్, జేఏసీ కన్వీనర్ గునిగంటి శ్రీనివాస్, నాయకులు డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ మందా వీరస్వామి, డాక్టర్ వంగాల సుధాకర్, బిక్కు నాయక్, డాక్టర్ సుదయ్య పాల్గొన్నారు.

హెచ్‌ఆర్డీ సీజీఎంగా మధుసూదన్ బాధ్యతలు

హనుమకొండ టౌన్, మే1: ఎన్పీడీసీఎల్ హెచ్‌ఆర్డీ సీజీఎంగా టి.మధుసూదన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం విధులు నిర్వర్తించిన సి.ప్రభాకర్ మంగళవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఐపీసీ అండ్ రాక్ సీజీఎంగా పనిచేస్తున్న మధుసూదన్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎండీ వరుణ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభాకర్ సేవలు అభినందనీయం : సీఎండీ

ఏఈ స్థాయి నుంచి సీజీఎం హోదా వరకు ప్రభాకర్ అందించిన సేవలు అభినందనీయమని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. హెచ్‌ఆర్డీ సీజీఎం ప్రభాకర్ ఉద్యోగ విరమణ సన్మానోత్సవం మంగళవారం రాత్రి నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్ ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ అశోక్‌కుమార్, వి.మోహన్‌రావు, సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్ధన్, సీజీఎంలు మధుసూదన్, కె.ఎన్.గుట్ట, కిషన్, రాజుచౌహాన్, భీకంసింగ్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రెటరీ రమేశ్ జీఎంలు, ఎస్ఈ, డీఈలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

మడికొండ, మే 1: పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ సాధించిన మడికొండ జిల్లా ప్రజా పరిషత్ సకండరీ పాఠశాల విద్యార్థులను బుధవారం మడికొండ పోలీసులు సన్మానించారు. 9 పైన జీపీఏ సాధించిన సీ.హెచ్. శృతి, జి.మేఘన, ఎ.రోహన్, కె. పావనిలను స్థానిక ఎస్సై రాజబాబు, హెడ్ కానిస్టేబుల్ అభినందించారు. శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీపై సుమోటో కేసు

వరంగల్ మెడికల్, మే 1: వర్ధన్నపేట మండలంలోని ఆర్ఎంపీ ఆడెపు శ్రీనివాస్‌పై సుమోటో కేసు నమోదు చేయాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేసింది. వర్ధన్నపేట పట్టణానికి చెందిన కత్తి నవీన్ (28) జ్వరంతో బాధపడుతూ ఏప్రిల్ 24న ఆర్ఎంపీ ఆడెపు శ్రీనివాస్ వద్దకు వెళ్లాడు. గంట వ్యవధిలో ఏడు ఇంజక్షన్లు ఇవ్వడంతో నవీన్ మృతి చెందాడు. ఈవార్త అన్ని పత్రికల్లో వెలుగు చూడటంతో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సుమోటో కేసుగా స్వీకరిస్తున్నట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఇన్‌చార్జి రిజిస్టర్ డాక్టర్ డి.రమేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ఎంపీ ఆడెపు శ్రీను క్లినిక్‌ను మెడికల్ కౌన్సిల్ బృందం వెంటనే సందర్శించి వాస్తవ పరిస్థితులను నివేదించాలని ఉత్తర్వులో పేర్కొంది.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

సుబేదారి, మే 1: హనుమకొండ సుబేదారిలోని రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మే డే పురస్కరించుకొని బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక వర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి అభినందించి, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ శాశ్వత సభ్యులు ఎ. విజయ్‌కుమార్ రావు, ఎస్. నవీన్ రావు, ఈవీ సాత్విక, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

మీడియా సెంటర్ పరిశీలన

హనుమకొండ కలెక్టరేట్, మే 1: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెంటర్‌తోపాటు కంట్రోల్ రూమ్‌ను ఎన్నికల వ్యయపరిశీలకుడు దిలీబన్ బుధవారం పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన సి విజిల్, 1950కు వచ్చిన ఫిర్యాదుల గురించి దిలీబన్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, సోషల్ మీడియాల గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా సెంటర్, ఎంసీఎంసీలను సందర్శించి వాటి కార్యకలాపాల గురించి అడిగారు. ఈ సందర్భంగా డీఆర్వో వైవీ గణేష్, జడ్పీ సీఈవో విద్యాలత, సమాచార పౌరసంబంధాల శాఖ ఏడీ భానుప్రసాద్, డీసీఓ నాగేశ్వర్‌రావు, కంట్రోల్ రూమ్ ఇంచార్జి శంకర్ కుమార్, ఇతర అధికారులు దిలీబన్ వెంట ఉన్నారు.

ప్రభుత్వానికి ఆరోగ్య సూపర్‌వైజర్ సరెండర్

వరంగల్ మెడికల్, మే1: హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఆరోగ్య పర్యవేక్షకుడు జిలకర రమేశ్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు 1/699/2024 తేదీ 29-4-2024న ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోగ్య పర్యవేక్షకుడు జిలకర రమేశ్‌పై పలు ఆరోపణలపై నోటీసులు జారీ చేశారు. సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి డబ్బులు స్వీకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలు ఆధారాలతో సహా మెమో రూపంలో సమర్పించినప్పటికీ స్పందించకపోవడంతో రమేశ్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, మే1: నిబంధనలు ఉల్లఘించిన 16 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తనిఖీల్లో పట్టుబడ్డ 16 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 10 మందికి రూ. 8,700, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఆరుగురికి రూ. 4,200 న్యాయమూర్తి రమేశ్ జరిమానాగా విధించారని తెలిపారు.

రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

ఐనవోలు, మే 1: ఆత్మహత్యలకు పాల్పడిన ఐనవోలుకు చెందిన కౌలు రైతుల బాధిత కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని మానవహక్కుల వేదిక నిజనిర్ధారణ బృందం డిమాండ్ చేసింది. మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వనపాకల దిలీప్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బాధావత్ రాజులు బుధవారం ఐనవోలు మండలకేంద్రంలో ఇటీవల ఆత్మహత్యలకు పాల్పడిన కౌలు రైతు కుటుంబాలను కలుసుకొని వివరాలు సేకరించి విలేకరులతో మాట్లాడారు. యువరైతు ప్రశాంత్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఆర్థిక సహాయంతోపాటు అతడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి

వరంగల్ స్పోర్ట్స్, మే 1: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని ఓసిటీతో పాటు రూరల్ ప్రాంతాలలో నెలపాటు నిర్వహించనున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా క్రీడల అధికారి సత్యవాణి కోరారు. బుధవారం వరంగల్‌లోని ఓసిటీ క్రీడా మైదానంలో వివిధ క్రీడాంశాలలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని డీవైఎస్‌వో సత్యవాణి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో నగరంలోని యువత సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోకుండా నెలపాటు ఓసిటీ క్రీడా మైదానంతో పాటు ఇతర ప్రాంతాలలో నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు సుమన్, కుమార్, లింగమూర్తి, డీఎవస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేఎన్ఎస్‌లో శిక్షణ శిబిరం ప్రారంభం

హనుమకొండ జిల్లా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 31 వరకు నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణశిబిరాన్ని జిల్లా క్రీడల అధికారి అశోక్‌కుమార్ బుధవారం లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులకు శిక్షణ శిబిరంలో పాల్గొనడం కోసం ఈ నెల 3వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు శ్రీమన్నారాయణ, ఎండీ. అఫ్జల్, కొత్త ప్రశాంత్, నరేందర్, శంకర్, పి. వెంకటేశ్వర్లు, కె. రాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులకు ఎంపిక

ఈ నెల 3నుంచి 5వ తేదీ వరకు హైదరాబాద్ లాలాగూడ రైల్వే గ్యారేజీలోని బాక్సింగ్‌హాల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో పాల్గొననున్న జిల్లా క్రీడాకారులను ఎంపిక చేసినట్లు కోచ్ శాంసన్ తెలిపారు. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను హనుమకొండ జిల్లా క్రీడల అధికారి అశోక్‌కుమార్ బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ శాంసన్ మాట్లాడుతూ... ఈ నెల 22న హనుమకొండలోని బాక్సింగ్‌హాల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-17, 18 బాలబాలికల బాక్సింగ్ పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. జి. క్రాంతికుమార్, ఎండీ. సుల్తాన్‌నవాజ్, కార్తిక్, స్ఫూర్తిలను రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేశామన్నారు.

ఆంధ్రజ్యోతి
9
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 2 మే 2024



పిల్లలను సీరియస్‌గా తీసుకోవాలి!

"జ్ఞాపకాలు... మన జీవితాలను ఆనందమయం చేస్తాయి. జ్ఞాపకాలు...మన జీవితాన్ని విషాదంలోకీ నెడతాయి. ఈ రెండింటిలో ఏ మార్గాన్ని ఎంచుకుంటామనే విషయంపైనే వర్తమానంలో సుఖశాంతులు ఉంటాయి. ఈ విషయాన్ని పిల్లలతో పాటు తల్లితండ్రులు కూడా అర్థం చేసుకోవాలి. అప్పుడే మన సమాజంలో ఆనందకరమైన పరిస్థితులు ఏర్పడతాయి" అంటారు హ్యాపీ ఇవల్యూషన్ వ్యవస్థాపకురాలు **పల్లవి జావర్**. ఆమె రాసిన 'మూమెంట్స్', 'మెమరీస్' అనే రెండు పుస్తకాలు తాజాగా విడుదలయ్యాయి. ఈ సందర్భంగా ఆమె 'నవ్య'తో మాట్లాడారు. ఆ విశేషాలలోకి వెళ్తే...

"జ్ఞాపకాలు లేకుండా మనుషులు ఉండరు. వారి అస్తిత్వం ఉండదు. కానీ ఆ జ్ఞాపకాలను ఎంత పదిలంగా దాచుకుంటున్నామనే విషయం కూడా చాలా ముఖ్యం. చిన్నప్పటి నుంచి నాకు రకరకాల వస్తువులు, పుస్తకాలు దాచటమంటే ఇష్టం. వాటిని ఎప్పుడైనా బయటకు తీసి చూస్తే- నా చిన్ననాటి రోజులు గుర్తుకొచ్చేవి. అప్పటి ఆలోచనలు, సంతోషకరమైన క్షణాలు, ఇబ్బందికర పరిస్థితులు... అన్నీ ఒక్కసారి చుట్టుముట్టేవి. ఆ ఆలోచనలతో పాటుగానే - కొత్త కోణాలు కూడా ఆవిష్కృతమయ్యేవి. బహుశా అందరికీ ఇలాంటి అనుభవాలే ఉంటాయనుకుంటా! కొద్దిగా పెద్దయిన తర్వాత అమ్మ, నాన్న.. అత్తయ్య, మామయ్య- ఇలా అందరికీ రకరకాల వీడియోలు తీసేదాన్ని. వాటిని భద్రపరిచేదాన్ని. ఇలా దాచుకున్న జ్ఞాపకాలన్నింటినీ - ఇంట్లో ఏదైనా ఫంక్షన్ అయినా, బర్త్‌డే అయినా బయటకు తీసేదాన్ని. దీని వల్ల అందరూ ఆనందంగా ఉండేవారు. కొవిడ్ తర్వాత నాన్న, మామయ్య కొన్ని నెలల వ్యవధిలోనే మరణించారు. అది నా జీవితంలో చాలా పెద్ద దెబ్బ. ప్రపంచమంతా ఆగిపోయినట్లు అనిపించింది. ఆ సంఘటనల నుంచి నేను బయటకు రావటానికి చాలా కష్టపడ్డా! యోగా, భగవద్గీత ప్రవచనాలు- ఇలా అనేక మార్గాలు అనుసరించా. ఆ సమయంలో నాకు ఈ పుస్తకాలు రాయాలనే ఆలోచన వచ్చింది. 'ప్రిజర్వింగ్ ద జర్నీ ఆఫ్ పేరెంట్‌హుడ్', 'ప్రిజర్వింగ్ ద ఫుట్‌ప్రింట్స్ ఆఫ్ లైఫ్' అనే ఈ రెండు పుస్తకాలు అందరికీ ఉపకరిస్తాయి.

ఈ తరం వేరు...

చాలా మందికి పేరెంటింగ్ ఒక అందమైన అనుభవం. పిల్లలు పుట్టిన దగ్గర నుంచి ఉద్యోగంలో చేరేవరకు రకరకాలుగా మారిపోతూ ఉంటారు. చిన్నప్పుడు ఒకలా ఉంటారు. టీనేజ్‌లో మరోలా ఉంటారు. చదువు పూర్తయిన తర్వాత వారి అభిప్రాయాలు వేరుగా ఉంటాయి. వీటన్నిటినీ తల్లితండ్రులు గమనించాలి. పిల్లల ఆలోచనలను గౌరవించాలి. వారికి ఆరోగ్యకరమైన సూచనలు ఇవ్వాలి. కానీ ఇది అంత సులభం కాదు. ఉదాహరణకు ఒక పిల్ల తన ఫ్రెండ్స్‌ను తరచూ మార్చేస్తూ ఉంటుందనుకుందాం. తనకు సాయం చేసిన వ్యక్తికి కృతజ్ఞతలు చెప్పదనుకుందాం. ఇలాంటి ధోరణిని సరిచేయాల్సింది తల్లితండ్రులే కదా! ఇతరులకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలనే విషయాన్ని పిల్లలకు జాగ్రత్తగా తెలియజెప్పాలి. ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా ప్రస్తావిస్తా. 1970లలో, 80లలో పుట్టిన వారిలో ఎక్కువ మంది తమ తల్లితండ్రుల మాట వినేవారు. ఈ తరం వారు తల్లితండ్రుల మాట వినటం లేదు. ఎందుకంటే వారి ఆలోచనలు చాలా వేగంగా ఉంటున్నాయి. క్షణాల్లో సమాచారం అందుతోంది. అలాంటప్పుడు వారితో ఎలా మాట్లాడాలనేది చాలా మందికి ఎదురయ్యే ఒక పెద్ద సమస్య. దీనికి పరిష్కారం- మనం ఉదాహరణగా నిలవటమే! డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని కాల్స్ మాట్లాడే తల్లితండ్రులు... భోజనం చేసేటప్పుడు సెల్ ఫోన్ చూడద్దని పిల్లలకు ఎలా చెప్పగలుగుతారు? ఇలాంటి సమస్యలు ఎదురయినప్పుడు వాటిని పరిష్కరించుకోవటానికి కొన్ని సూచనలు నా పుస్తకంలో ఉన్నాయి. తల్లితండ్రులు ప్రతి రోజూ తమ పిల్లలతో ఒక అరగంట మనసు విప్పి మాట్లాడగలిగితే చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. తల్లితండ్రుల జీవితంలో ఏం జరుగుతోందో పిల్లలకు తెలుస్తుంది. పిల్లల జీవితంలో ఏం జరుగుతోందో తల్లితండ్రులకు తెలుస్తుంది.

ఈ తరం వాళ్లకు అన్నీ త్వరగా కావాలి. సమాచారం, ఆహారం.. ఇతరులతో స్నేహం... ఏ విషయానికైనా వేచి చూసే ఓపిక ఉండటం లేదు. అదే సమయంలో వాళ్లకు చాలా స్పష్టత ఉంది. వాళ్లతో కూర్చుని రోజుకు అరగంట మాట్లాడితే - వాళ్లకు ఏం కావాలో మనకు అర్థమవుతుంది. అందువల్లే- నేను పిల్లలను సీరియస్‌గా తీసుకోవాలని తల్లితండ్రులకు చెబుతూ ఉంటా! 'చిన్న పిల్లలు... వాళ్లకేం తెలుస్తుంది' అనే ఆలోచనే తప్పు.



చిన్నవే అయినా...

ఆనందకరమైన చిన్న చిన్న జ్ఞాపకాలే- మనకున్న పెద్ద ఆస్తులని నేను నమ్ముతాను. అలాంటి ఆనందకర జ్ఞాపకాల పరిణామక్రమమే - 'హ్యాపీ ఇవల్యూషన్'. మన వర్తమానాన్ని ఆనందంగా గడిపితే- ఆ జ్ఞాపకాలు గుర్తుండిపోతాయి. అవి భవిష్యత్తులో మళ్లీ ఎదురయినప్పుడు మంచి అనుభూతి కలుగుతుంది. కానీ ఇది చెప్పుకున్నంత సులభం కాదు. ఎందుకంటే మన జీవితంలో మంచి, చెడు- రెండూ ఉంటాయి. సవాళ్లు, ఎదురుదెబ్బలు ఉంటాయి. వీటన్నింటినీ దాటుకొని ముందుకు వెళ్తేనే జీవితానికి ఒక అర్థం ఉంటుంది. ఈ ప్రయాణంలో ఆనందం, దుఃఖం- రెండూ కలుగుతాయి. కొందరు ఆనందకరమైన క్షణాలు గుర్తుపెట్టుకొంటారు. మరి కొందరు దుఃఖంతో జీవిస్తూ ఉంటారు. ఆనందకరమైన జ్ఞాపకాలను గుర్తుపెట్టుకోగలిగితే జీవితం చాలా సాఫీగా సాగిపోతుంది. అలా జ్ఞాపకాలను ఎలా గుర్తుపెట్టుకోవాలనే విషయాన్ని నా పుస్తకంలో వివరించా. ఒక చిన్న ఉదాహరణ చెబుతా! చిన్నప్పుడు ఒకరు నా దగ్గరకు వచ్చి- "నీ నవ్వు చాలా బావుంటుంది" అని కాంప్లిమెంట్ ఇచ్చారు. అది నాకు ఎప్పుడు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని, సంతోషాన్ని కలుగజేసేది. అలాంటి విషయాలను రికార్డు చేసి, పెద్దయిన తర్వాత పిల్లలకు అందచేస్తే- వాళ్లకు ఆనందకరమైన క్షణాలు గుర్తుకొస్తాయి.

అవి తినడం ప్రమాదకరమా?

Q A

డాక్టర్! డ్రై ఐస్, లిక్విడ్ నైట్రోజన్‌లను ఉపయోగిస్తూ, ఆహార పదార్థాలకు ఆకర్షణ తెచ్చిపెడుతున్న సందర్భాలను చూస్తున్నాం. ఈ పదార్థాలు హానికరమనే వార్తలు వెలువడుతున్నాయి. ఇది ఎంతవరకూ నిజం?

- ఓ సోదరి, హైదరాబాద్.

ప్రయోగశాలలో శ్యాంపిల్స్ నిల్వకు, ఐస్‌క్రీమ్స్ తయారీలో ఫ్రీజింగ్ ఏజెంట్స్‌గా, ప్రిజర్వేటివ్స్‌గా, ఇతరత్రా వైద్య, వినోద అవసరాలకు లిక్విడ్ నైట్రోజన్, డ్రై ఐస్‌లను ఉపయోగిస్తూ ఉంటారు. వీటిని అత్యంత తక్కువ తాపమానాలకు గురి చేయవచ్చు.

డ్రై ఐస్ - 78.5 డిగ్రీలకూ, లిక్విడ్ నైట్రోజన్ - 196 డిగ్రీలకూ చల్లబడతాయి. వీటిని గది ఉష్ణోగ్రతకు బహిర్గతం చేసినప్పుడు తెల్లని పొగలు వెలువడతాయి. దాంతో వీటిని వినోదాల్లో వేడుకల్లో వినియోగిస్తూ ఉంటారు. కానీ అత్యంత



కౌన్సెలింగ్

కనిష్ఠ తాపమానాలను కలిగి ఉండే వీటిని తినడం ప్రమాదకరం. ఇవి శరీరానికి తగిలినప్పుడు కణజాల నష్టం, చర్మం కాలిపోవడం లాంటివి జరుగుతాయి. కాబట్టి డ్రై ఐస్ లేదా లిక్విడ్ నైట్రోజన్‌లతో కలిపి అందించే పదార్థాలకు దూరంగా ఉండాలి. పొగ రూపంలో వెలువడే లిక్విడ్ నైట్రోజన్‌ను పీల్చడం కూడా ప్రమాదకరమే! ఉబ్బసం లాంటి శ్వాసకోశ సమస్యలున్న వారికి ఇది రెట్టింపు ప్రమాదకరం.

డాక్టర్ రమాకాంత్
జనరల్ ఫిజీషియన్, హైదరాబాద్

అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ)... దేశంలోని అతి పురాతన విశ్వవిద్యాలయాల్లో ఒకటి. వందేళ్లు దాటిన ఈ వర్సిటీ చరిత్రలో తొలిసారి ఒక మహిళ వైస్‌చాన్స్‌లర్ అయ్యారు. ఏఎంయూలో విభిన్న హోదాల్లో సేవలందించిన ఆమె... నేడు అదే విద్యాలయం అత్యున్నత పదవిని అలంకరించారు. ప్రొఫెసర్ **నయీమా ఖాతూన్** విజయవంతమైన ప్రయాణం ఇది...

• న్యూస్‌మేకర్



వందేళ్లలో ఒక్కరే!

వైస్‌చాన్స్‌లర్‌గా నియమితులు కావడానికి ముందు నయీమా ఖాతూన్... అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) మహిళా కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. పొలిటికల్ సైకాలజీలో పీహెచ్‌డీ పట్టా పొందిన ఆమె... ఢిల్లీలోని 'సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్', ఏఎంయూల్లో పని చేశారు. ఏడాదిపాటు రువాండాలోని 'నేషనల్ యూనివర్సిటీ'లో బోధించారు. అమెరికాలోని 'లూయిస్ విల్లే యూనివర్సిటీ', రొమానియా 'అల్బా లూలియా', బ్యాంగ్‌కాక్ 'చులాలాంగ్‌కోర్న్ యూనివర్సిటీ' తదితర విద్యాలయాలను సందర్శించారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో ప్రసంగించారు. ప్రముఖ జర్నల్స్‌లో ఆమె పరిశోధనా పత్రాలు ఎన్నో ప్రచురితమయ్యాయి. ఒడిశాలో పుట్టి పెరిగిన నయీమా... విద్యార్థి దశ నుంచీ చదువులో ముందుండేవారు. పట్టుదలగా ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. పీహెచ్‌డీ తరువాత ఏఎంయూలోని అదే విభాగం(1988)లో లెక్చరర్‌గా కెరీర్ ప్రారంభించారు. పదేళ్లకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2006లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2014లో మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యే సమయానికి ఆమె సైకాలజీ విభాగానికి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. దాంతోపాటు వర్సిటీ 'సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ కెరీర్ ప్లానింగ్'కు డైరెక్టర్‌గా సేవలు అందించారు.

ఆచార్యులుగానే కాకుండా రచయితగా, పరిశోధకురాలిగా నయీమా ఖాతూన్ సుపరిచితురాలు. ఆమె రచనలు పలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఆరు పుస్తకాలు రాశారు. క్లినికల్, హెల్త్, అప్లైడ్ సోషల్, స్పిరుట్యువల్ సైకాలజీల్లో స్పెషలైజేషన్ చేశారు. నైమా నిరుపమాన సేవలకు గానూ 'పాపా మియా పద్మభూషణ్ బెస్ట్ గర్ల్ అవార్డ్'ను అందుకున్నారు.

1875లో 'మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజీ'గా స్థాపితమైన విద్యా సంస్థ... 1920లో 'అలీఘడ్ ముస్లిమ్ యూనివర్సిటీ'గా రూపాంతరం చెందింది. 2020 సెప్టెంబర్‌లో ఏఎంయూ వందేళ్లు పూర్తి చేసుకుంది. ఇన్నేళ్లలో వర్సిటీకి వీసీగా వ్యవహరించిన మహిళ లేరు. ఆ లోటును నయీమా ఖాతూన్ భర్తీ చేశారు. 1920లో బేగమ్ సుల్తాన్ జహాన్ ఏఎంయూ చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. ఆమె తరువాత ఏ మహిళా ఆ హోదాను అలంకరించలేదు.

1875లో 'మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజీ'గా స్థాపితమైన విద్యా సంస్థ... 1920లో 'అలీఘడ్ ముస్లిమ్ యూనివర్సిటీ'గా రూపాంతరం చెందింది. 2020 సెప్టెంబర్‌లో ఏఎంయూ వందేళ్లు పూర్తి చేసుకుంది. ఇన్నేళ్లలో వర్సిటీకి వీసీగా వ్యవహరించిన మహిళ లేరు. ఆ లోటును నయీమా ఖాతూన్ భర్తీ చేశారు.

ఇదిలావుంటే... నయీమా ఖాతూన్ భర్త ప్రొఫెసర్ మొహమ్మద్ గుల్రెజ్ మొన్నటివరకు వర్సిటీ తాత్కాలిక వీసీగా బాధ్యతలు నిర్వర్తించారు. యూపీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు గత వీసీ తారిక్ మన్సూర్ తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఆ పోస్టు భర్తీ కోసం రూపొందించిన ఐదుగురి జాబితాలో నయీమా ఖాతూన్ కూడా ఉన్నారు.

మొత్తం 36 మంది దరఖాస్తు చేసుకోగా... అందులో వడపోసి ఐదుగురిని ఎంపిక చేసింది వర్సిటీ పాలక మండలి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అధికారిక ముద్ర రాగానే కేంద్ర విద్యా శాఖ నయీమా ఖాతూన్‌ను వీసీగా ప్రకటించింది. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అనుమతి కోసం ఈసీకి లేఖ రాసింది. ఇందులో రాజకీయ ప్రయోజనాలు లేవని భావించిన ఈసీ... వర్సిటీ వీసీ నియామకానికి ఆమోద ముద్ర వేసింది. అలా శతాబ్దానికి పైగా చరిత్ర గలిగిన విశ్వవిద్యాలయానికి నయీమా మొట్టమొదటి మహిళా వైస్‌చాన్స్‌లర్ అయ్యారు. నవ అధ్యాయానికి నాంది పలికారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/kZTAVd6 లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

సినిమా బ్లాక్ బస్టర్



సుహాస్ హీరోగా రూపొందిన యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రసన్న వదనం' ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సుహాస్ మాట్లాడుతూ 'తొలి కాపీ చూశాం. సినిమా బ్లాక్ బస్టర్ . ఇందులో సందేహం లేదు. నా సినిమాలు మౌత్ టాక్ వల్లే ఆడతాయి కనుక తొందరగా చూసి మిగిలిన వారికి చెప్పండి. సీట్ ఎడ్జ్‌లో కూర్చుని సినిమా చూస్తారు' అని చెప్పారు. 'దర్శకుడిగా నాకు ఇదే తొలి సినిమా. బాగా వచ్చింది. యూనిక్ కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకొన్న రియల్ కమర్షియల్ ఫిల్మ్ ఇది. సుహాస్ అద్భుతంగా చేశాడు' అన్నారు దర్శకుడు అర్జున్. అందరూ థియేటర్‌లో సినిమా చూసి ప్రోత్సహించాలని నిర్మాత మణికంఠ కోరారు.

హై రేంజ్ మాస్ ఎలివేషన్స్



'పుష్ప' సినిమా పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటిన సంగతి తెలిసిందే. సినిమా ఆ రేంజ్‌లో హిట్ కావడానికి అందులో పాటలు కూడా ఓ కారణమనే చెప్పాలి. ఇప్పుడు సీక్వెల్‌గా వస్తున్న 'పుష్ప-2'లోని పాటలు మరింత ఆకట్టుకునేలా చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను మంగళవారం మేకర్స్ విడుదల చేశారు. ఇందులో అల్లు అర్జున్ క్యారెక్టర్ పుష్పరాజ్‌కు హై రేంజ్ మాస్ ఎలివేషన్స్ ఇచ్చేలా 'పుష్ప పుష్ప' టైటిల్ సాంగ్ లిరిక్స్ సాగాయి. ఈ పాటకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా, నకాశ్ అజీజ్, దీపక్ బ్లూ ఆలపించారు. చంద్రబోస్ సాహిత్యం అందించారు. ఆగస్టు 15న 'పుష్ప-2' రిలీజ్ అవుతోంది.

అందరూ మా ఎత్తు గురించి మాట్లాడుకున్నారు



'నాన్నగారు డైరెక్ట్ చేసిన 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం టైటిల్‌నే మా సినిమాకూ పెట్టడంతో పోలిక వస్తుందేమో అనుకున్నాం. కానీ ఆ సినిమాకూ మా చిత్రానికీ సంబంధం లేదు. ఈ సినిమాకు మొదట 'మ్యాచ్ ఫిక్సింగ్' సహా రకరకాల టైటిల్స్ అనుకున్నాం. చివరకు ఈ టైటిల్ ఫిక్స్ చేశాం. కథకు యాప్ట్ టైటిల్ ఇది' అన్నారు 'అల్లరి' నరేశ్. ఆయన నటించిన 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

• ఇప్పుడు ప్రేక్షకుల అభిరుచి కూడా మారింది. కథలో కామెడీ ఉంటే ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నారు. ఇలాంటి సమయంలో దర్శకుడు మల్లి ఈ కథతో వచ్చారు. నాకు చాలా నచ్చింది. పెళ్లి చుట్టూ జరుగుతున్న కోట్ల రూపాయల వ్యాపారాన్ని వినోదాత్మకంగా ఈ చిత్రంలో చూపించాం. సినిమా అంతా నవ్విస్తూ చివరి రెండు రీళ్లలో ఎమోషనల్‌గా ఉంటుంది. నాన్నగారి చిత్రాల్లో అంతర్లీనంగా మంచి సందేశం ఉంటుంది. ఈ సినిమాలో చూపించే సందేశం ప్రేక్షకులను కదిలిస్తుంది.

• కథ ఫైనలైజ్ చేసిన తర్వాత హీరోయిన్‌గా ఫరియాను అనుకున్నాం. ఆమెకు కూడా కథ నచ్చింది. తను సెట్‌కి వచ్చిన తర్వాత అందరూ మా ఎత్తు గురించి మాట్లాడుకున్నారు. ఫరియా మంచి నటి, డాన్సర్. కామెడీ సెన్స్ ఉంది. మా జోడీ బాగుంటుంది.

• కామెడీ చేసి నవ్వించడం చాలా కష్టం. ఈ మధ్య సినిమాల్లో ఫైట్లు చేసి మోకాళ్ల నొప్పులు వచ్చాయి. మళ్లీ కామెడీ చేయడం హ్యాపీగా ఉంది. కామెడీ చిత్రాలకు ఇదివరకటి కంటే ఆదరణ పెరిగింది. కంటెంట్, హ్యూమర్ బాగుంటే ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు. ఇకపై కామెడీ చిత్రాలకూ ప్రాధాన్యం ఇస్తాను.

కన్నడ నవల ఆధారంగా ఆరంభం



మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ కీలక పాత్రలు పోషించిన 'ఆరంభం' చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. అజయ్ నాగ్ వి దర్శకత్వంలో అభిషేక్ వీటీ నిర్మించారు. ఈ నేపథ్యంలో సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మాట్లాడుతూ 'కమర్షియల్ ఎలిమెంట్స్ లేకపోయినా కథ విని చాలా ఇంప్రెస్ అయ్యాను. అందుకే సినిమా తీయాలని అనిపించింది. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ బాగుంటోంది కనుక మా సినిమా విజయంపై నమ్మకం ఉంది' అన్నారు. దర్శకుడు అజయ్ నాగ్ మాట్లాడుతూ 'ఓ కన్నడ నవల ఆధారంగా ఈ సినిమా స్క్రిప్ట్ తయారు చేశాను. ఒక జానర్‌లో కాకుండా వివిధ జానర్స్‌లో ఉండే సినిమా ఇది. మా కొత్త టీమ్‌తో ఇబ్బందులు ఉన్నా ఆర్టిస్టులు సహకరించారు. వెస్టర్న్ ఘాట్స్‌లో షూటింగ్ చేశాం. తెలుగులో విడుదల చేసిన తర్వాత మిగిలిన భాషల్లో రిలీజ్ చేస్తాం' అన్నారు.

కామెడీ టచ్‌తో



నూతన నటీనటులతో దర్శకుడు నరసింహ బోదాసు తెరకెక్కిస్తున్న హారర్ కామెడీ 'తిండిబోతు దెయ్యం'. శిరీష నరసింహ బోదాసు నిర్మిస్తున్నారు. మంగళవారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. తొలిషాట్‌కు దర్శకుడు రేలంగి నరసింహారావు క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కొత్తదనం ఉన్న కథతో తెరకెక్కిస్తున్నాం. హీరోగా నటిస్తున్నాను. కామెడీ టచ్‌తో కూడిన హారర్ చిత్రమిది. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అన్నారు. ఇప్పుడు వస్తున్న హారర్ కామెడీ సినిమాలకు మా చిత్రం భిన్నంగా ఉంటుంది అని నిర్మాత తెలిపారు. మోనికా సమత్తార్, తన్నీరు వాసవి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మహేందర్ ఎం.

సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్



వికాస్, శాంతి హీరో హీరోయిన్లుగా డాక్టర్ ప్రదీప్ అల్లు దర్శకత్వంలో డాక్టర్ ఎల్ వీ సూర్యం నిర్మించిన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'దర్శిని'. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం ట్రైలర్‌ను కేఎల్ దామోదర్ ప్రసాద్ విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'కామెడీ, లవ్, ఎమోషన్... అన్ని అంశాలు కుదిరాయి, సినిమాను ఈ నెల్లో విడుదల చేస్తామ'ని తెలిపారు. మూడు పాత్రల చుట్టూ అల్లుకున్న కథ ఇది, కాన్సెప్ట్ ఆసక్తికరంగా ఉంటుంది అని నిర్మాత తెలిపారు.

దర్శకుడు సుకుమార్ కుమార్తెకు ఉత్తమ బాల నటి పురస్కారం



డైరెక్టర్ సుకుమార్ కుమార్తె సుకృతి బండ్రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో తొలి చిత్రంతోనే ఉత్తమ బాల నటి పురస్కారం ఆమెను వరించింది. 'గాంధీ తాత చెట్టు' సినిమాలో ఆమె నటనకు మెచ్చి మంగళవారం ఢిల్లీలో ఈ అవార్డును అందజేశారు. ఈ చిత్రానికి ఇప్పటికే సుకృతి పలు అవార్డులను అందుకోవడం విశేషం. అలాగే, పర్యావరణ పరిరక్షణ కోసం సందేశాత్మకంగా తెరకెక్కిన ఈ చిత్రం పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఎన్నో అవార్డులను గెలుచుకుంది.

కవితకు బెయిలా? మళ్లీ నిరాశేనా?

» ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బెయిల్ పిటిషన్‌పై నేడు తీర్పు

న్యూఢిల్లీ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు గురువారం తుది తీర్పు వెలువరించనుంది. ఆమెకు బెయిల్ దొరుకుతుందా? లేదా మళ్లీ నిరాశే ఎదురవుతుందా అనేది తేలనుంది. ఈ కేసులో సీబీఐ తనను అక్రమంగా అరెస్టు చేసిందని, తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని గతంలో ఆమె పిటిషన్ దాఖలు చేయగా న్యాయస్థానం తిరస్కరించింది. ఆ తర్వాత సాధారణ బెయిల్ కోసం మరోసారి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై చివరిసారిగా ఈ నెల 22న రౌస్ అవెన్యూ కోర్టులో వాదనలు జరిగాయి. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులకు అరెస్టు అవసరం లేదని, కవిత మహిళ కాబట్టి పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం బెయిల్‌కు అర్హురాలని ఆమె తరఫున న్యాయవాది విక్రమ్ చౌదరి కోర్టులో వాదనలు వినిపించారు. సరైన ఆధారాలే లేని ఈ కేసులో ఆమెకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. అయితే, ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవితదే కీలక పాత్రని, కేసు దర్యాప్తు జరుగుతోందని, ఆమె బయటికి వస్తే కేసును ప్రభావితం చేస్తారని, కాబట్టి బెయిల్ ఇవ్వొద్దని సీబీఐ తరఫు న్యాయవాది పంకజ్ గుప్తా వాదించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కావేరి భవేజ తీర్పును మే 2వ తేదీకి రిజర్వు చేశారు. ఇక మనీలాండరింగ్ కేసులో కవిత బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 6న తీర్పు రానుంది. ఆమె జ్యుడీషియల్ కస్టడీ ఈ నెల 7వ తేదీతో ముగియనుంది.

7 వరకు ఐసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్ దరఖాస్తు గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడిగిస్తూ ఆ సెట్ కన్వీనర్ నరసింహాచారి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం ఐసెట్ దరఖాస్తు గడువు ఏప్రిల్ 30వ తేదీతో ముగిసింది. అయితే అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు ఈ గడువును పొడిగించారు. రూ.250 రుసుంతో ఈ నెల 17 వరకు, రూ.500 రుసుంతో 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. జూన్ 5, 6వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఐసెట్ నిర్వహించనున్నారు.

డబుల్‌డ్యూటీ డ్రైవర్లకు రోజుకు రూ.వెయ్యి

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో డ్రైవర్ల కొరత కారణంగా డబుల్ డ్యూటీ చేసే వారికి రోజుకు అదనంగా రూ.వెయ్యి చెల్లించాలని నిర్ణయించినట్లు సంస్థ ఎండీ సజ్జనార్ బుధవారం తెలిపారు. వేసవి ఎండల దృష్ట్యా మే, జూన్ నెలల్లో డబుల్ డ్యూటీ నిర్వహించేందుకు ముందుకు వచ్చే డ్రైవర్లకు ప్రోత్సాహకాలను పెంచినట్టు తెలిపారు. లక్ష్యే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా పలు డిపోల్లో డ్రైవర్లకు డబుల్ డ్యూటీ అనివార్యంగా మారడంతో ప్రోత్సాహకాన్ని వెయ్యికి పెంచినట్లు చెప్పారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై రూ.19 తగ్గుదల

లోక్‌సభ ఎన్నికలవేళ వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ (19 కిలోలు)ధరను ఆయిల్ కంపెనీలు బుధవారం రూ.19మేర తగ్గించాయి. తగ్గిన ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని కంపెనీలు తెలిపాయి. తాజా తగ్గింపుతో హైదరాబాద్‌లో వాణిజ్య సిలిండర్ ధర రూ.1,956కు చేరింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో రూ.1,807, ఢిల్లీలో రూ.1,745కు తగ్గింది.

నకిలీ పత్రాలతో రూ.15 కోట్ల ప్లాట్లు స్వాహా

» ముగ్గురు నిందితులకు రిమాండ్

సంగారెడ్డి క్రైం, మే 1: నకిలీ పత్రాలతో పాటు నకిలీ వంశస్తులను కూడా సృష్టించి కోట్ల విలువైన ప్లాట్లను స్వాహా చేస్తున్న ఓ ముఠా గుట్టును జిల్లా సీసీఎస్ పోలీసులు రట్టు చేశారు. ఈ వివరాలను సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ ప్రాంతానికి చెందిన బండి దుర్గాప్రసాద్, సుబ్బారావు, రవిగౌడ్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. అమీన్‌పూర్ పరిధిలోని రామేశ్వరం బండ ప్రాంతంలో 25 ఏళ్లుగా ఖాళీగా ఉన్న ప్లాట్లను గుర్తించి, ఆ ప్లాట్ల అసలు యజమాని వివరాలు తెలుసుకొని వారి పేరు మీద నకిలీ ఆధార్, సేల్ డీడ్, లింకు డాక్యుమెంట్లను తయారు చేసేవారు. ఆ తర్వాత సదరు ప్లాట్ల యజమానికి సరిపడా వయస్సు ఉన్న వ్యక్తులను ఎంచుకుని వారి డబ్బులిచ్చి, రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రప్పించి సంతకాలు చేయించేవారు. ఇలా మొత్తం 15 నుంచి 20 ప్లాట్లను నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించినట్లు పోలీసులు గుర్తించారు. వీటి విలువ రూ.15 కోట్ల వరకు ఉంటుందన్నారు. ఈ కేసులో నిందితులైన బండి దుర్గాప్రసాద్, సుబ్బారావు, రవిగౌడ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రూపేష్ తెలిపారు. ఈ ముఠాకు సహకరించిన రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సైబర్ నేరగాళ్లకు 'బ్యాంకు ఖాతాల' సాయం!

» ముఠాలోని కీలక నిందితుడి అరెస్టు

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న కీలక ఏజెంట్‌ను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన ప్రణయ్ షిండే మరికొంత మందితో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. సైబర్ నేరగాళ్లకు అవసరమైన బ్యాంకు ఖాతాలు తెరిపించి ఇవ్వడం ఈ ముఠా పని.. ఇందుకోసం అమాయకులకు కమీషన్ల ఆశ చూపి 125కుపైగా బ్యాంకు ఖాతాలు తెరిపించారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో జరిగిన సైబర్ నేరాలకు సంబంధించిన నగదు నిర్మల్ జిల్లాలోని బ్యాంకు ఖాతాలకు మళ్లినట్లు గుర్తించి దర్యాప్తు జరపడంతో ముఠా గుట్టు బయటపడిందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో చీఫ్ షీకా గోయల్ తెలిపారు.

సంగారెడ్డిలో ఐటీ దాడులు

సంగారెడ్డి టౌన్, మే1: సంగారెడ్డి మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ లత విజయేందర్‌రెడ్డి ఇంటితోపాటు మరికొందరు బీఆర్ఎస్ నాయకుల ఇళ్లల్లో బుధవారం రాత్రి ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. అయితే, ఈ సోదాల్లో లత విజయేందర్‌రెడ్డి ఇంట్లో సుమారు రూ.70 లక్షలు దొరికినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ... బీజేపీతో కలిస్తే జోడీ లేకుంటే ఈడీ, ఐటీ దాడులని అన్నారు. బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే తమ నాయకులపై బీజేపీ ఐటీ దాడులు చేయిస్తోందని ఆరోపించారు.

ఫేక్ వీడియోపై పూర్తి బాధ్యత రేవంత్‌దే

» ఇందులో ఎంతటివారున్నా వదలం

» ఊచలు లెక్కపెట్టక తప్పదు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్/గజ్వేల్, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లన్నూ రద్దు చేస్తారంటూ ఫేక్ వీడియోల సృష్టికి పూర్తి బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదేనని, ఈ కేసులో ఆయనే మొదటి ముద్దాయి అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఫేక్ వీడియోలు సృష్టించిన వారిలో ఎవరున్నా వదిలే ప్రసక్తే లేదని, వారు జైలు ఊచలు లెక్కపెట్టక తప్పదని హెచ్చరించారు. ఈ విషయంలో తెలంగాణ బీజేపీ తరఫున కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. బుధవారం వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్ కల్పన, డివిజన్ అధ్యక్షులు, పలువురు నాయకులు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో నరేంద్ర మోదీకి, బీజేపీకి అనుకూలంగా పెరుగుతున్న మద్దతు తట్టుకోలేక వీడియోల్ని మార్ఫింగ్ చేయించి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ నేతలు కూడా బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే.. యూపీఏ హయాంలో తెలంగాణకు ఏమిచ్చారు? తొమ్మిదిన్నరేళ్ల మోదీ పాలనలో రాష్ట్రానికి ఎన్ని నిధులు వచ్చాయనే విషయంపై చర్చకు సిద్ధమా? అని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలెవరూ నమ్మరని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల ప్రధాని మోదీ పాలనపై విమర్శలు చేసేందుకు అవకాశం లేక అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి తన స్థాయికి తగ్గట్లు వ్యవహరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని చెప్పారు. రిజర్వేషన్లపై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు ఫేక్ వీడియో సృష్టించారని, ఈ విషయంలో ఎన్నికల తర్వాత సీఎం రేవంత్ రెడ్డిని ఢిల్లీ పోలీసులు పట్టుకుపోవడం ఖాయమని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. కాగా, ప్రచారంలో భాగంగా తాము ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు, బ్యానర్లను చింపేస్తున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీ రవిగుప్తాకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు.

రజాకార్ల ప్రతినిధిని ఓడించాలి

ఆయన పాలన నుంచి హైదరాబాద్‌కు విముక్తి.. 400 సీట్లలో హైదరాబాద్ కమలం ఉండాలి

» హిందువులు, ముస్లింలు బీజేపీని గెలిపించాలి

» పాతబస్తీ రోడ్‌షోలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

» హాజరైన రాజాసింగ్



రోడ్డుషోలో పాల్గొన్న అమిత్ షా, కిషన్‌రెడ్డి, మాధవిలత

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లోక్‌సభ నియోజవర్గంలో ఈసారి రజాకార్ల ప్రతినిధిని ఓడించాలని, బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కోరారు. 40 ఏళ్లుగా హైదరాబాద్ నుంచి పార్లమెంటులో రజాకార్ల ప్రతినిధి ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. బుధవారం సాయంత్రం అమిత్ షా హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు. పాతబస్తీ లాల్ దర్వాజ మహంకాళి ఆలయం నుంచి శాలిబండలోని సుధా టాకీస్ వరకు నిర్వహించిన రోడ్‌షోలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ అభ్యర్థి మాధవిలతతో కలిసి పాల్గొన్నారు. ప్రచార సమయం ముగుస్తుండటంతో సభలో.. అమిత్ షా క్లుప్తంగా మాట్లాడారు. రజాకార్ల పాలన నుంచి హైదరాబాద్‌కు ముక్తి కల్పించాలని, బీజేపీ అభ్యర్థి మాధవిలతను గెలిపించాలని, నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా బీజేపీ గెలవబోయే 400 ఎంపీ సీట్లలో ఒకటి హైదరాబాద్ నుంచి ఉండాలన్నారు. హైదరాబాదులో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, ఇక్కడి ప్రజలను తాకే ధైర్యం ఎవరికీ లేదని చెప్పారు. హిందువులైనా, ముస్లింలైనా ఈసారి బీజేపీకి ఓటేసి గెలిపించాలని కోరారు. కాగా, అమిత్ షా రోడ్‌షోలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ దర్శనం ఇవ్వడంతో కార్యకర్తలు ఉత్సాహంతో ఊగిపోయారు. అభ్యర్థి మాధవిలత సంతోషంతో రాజాసింగ్ చేతులు పట్టుకొని పైకి ఎత్తి నినాదాలు చేశారు. మాధవిలతకు పార్టీ టికెట్ కేటాయించినప్పటి నుంచి రాజాసింగ్ అసంతృప్తితో ఉన్నారు. ఇన్ని రోజులు ప్రచారానికి దూరంగా ఉన్న ఆయన రాత్రి ఒక్కసారి ఆయన కనిపించడంతో కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

రోడ్‌షోతో కార్యకర్తల్లో ఉత్సాహం

పాతబస్తీలో అమిత్‌షా రోడ్ షో అనుకున్న సమయానికి నాలుగు గంటలు ఆలస్యంగా జరిగినా బీజేపీ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. రాత్రి 9.25 గంటలకు ఆయన లాల్‌దర్వాజ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9.33 గంటలకు దేవాలయం నుంచి రోడ్డు షో మొదలైంది. రోడ్‌షో తర్వాత నిర్వహించిన సభలో ప్రచార సమయం ముగుస్తుండటంతో కేవలం ఒకటిన్నర నిమిషం మాత్రమే అమిత్ ప్రసంగించారు. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి తరఫున పార్టీ అగ్రనేత ప్రచారానికి రావడంతో కార్యకర్తలు ఉత్సాహంలో మునిగిపోయారు.

రోడ్ షో సైడ్‌లైట్స్...

- రాత్రి 9.33 నిమిషాలకు అమిత్ షా రోడ్ షో ప్రారంభం
- ఒకటిన్నర నిమిషంలోనే షా ప్రసంగం పూర్తి
- లాల్ దర్వాజ నుంచి ఛత్రినాక వరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలతో నిండిపోయిన రోడ్లు
- లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి దేవాలయం నుంచి సుధా టాకీస్ సమీపంలోని సభా వేదిక వరకు 30 స్వాగత వేదికలు ఏర్పాటు.
- లాల్ దర్వాజ రోడ్ నుంచి ఛత్రినాక వెళ్లే మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపివేత
- రోడ్ షోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన తలపాగాలు ధరించిన మహిళా నేతలు
- రోడ్ షోలో ముస్లిం మహిళలూ పాల్గొన్నారు.

-హైదరాబాద్ సిటీ/మదీన/రాజేంద్రనగర్

తెలంగాణలో 12 పక్కా

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కార్యాలయంలో పార్టీ సీనియర్ నేతలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, కన్వీనర్లు, జిల్లా అధ్యక్షులతో అమిత్ షా సమావేశమయ్యారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ప్రచార సరళిని సమీక్షించారు. ఎన్నికలకు మరో పదిరోజుల గడువు మాత్రమే ఉన్న నేపథ్యంలో ప్రచారం మరింత ఉధృతంగా కొనసాగించాలని ఆదేశించారు. డబుల్ డిజిట్ స్థానాలు కైవసం చేసుకోవడంలో భాగంగా అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్.. పార్లమెంటు సెగ్మెంట్ల వారీగా ప్రచార సరళిని సమీక్షించారు. కాగా, ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ, ఈ నెల 8, 10వ తేదీల్లో రాష్ట్రంలో పర్యటించనున్నారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి బండి సంజయ్‌కి మద్దతుగా ఈ నెల 8న వేములవాడలో నిర్వహించే బహిరంగ సభలో మోదీ పాల్గొంటారు. అనంతరం వరంగల్‌లో నిర్వహించే ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారు. 10న మహబూబ్‌నగర్‌లో, హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.



కరీంనగర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్, పక్కన కేంద్ర సహాయ మంత్రి మురుగన్

సీఎం సీటు పోతుందని రేవంత్‌కు భయం

» రిజర్వేషన్ల రద్దు నాటకం కాంగ్రెస్ కుట్రనే

» మీరు చేస్తున్నదే 'గాడిద గుడ్డు': సంజయ్

» రాజ్యాంగం భగవద్గీత అని మోదీ చెప్పారు: కేంద్ర మంత్రి మురుగన్

భగత్‌నగర్/హైదరాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి సీటు పోతుందనే భయం పట్టుకుందని కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి కరీంనగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను బద్నాం చేస్తే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమన్నారు. రిజర్వేషన్ల రద్దు నాటకం కాంగ్రెస్ కుట్రలో భాగమేనని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నాన్ లోకల్ అని, పదేళ్ల అధికారంలో ఉన్నా ప్రజలకు చేసిందేమి లేదన్నారు. నరేంద్ర మోదీ తెలంగాణకు గాడిదగుడ్డు కూడా ఇవ్వలేదన్న రేవంత్ వ్యాఖ్యలపై సంజయ్ స్పందించారు. "రేవంత్ రెడ్డీ.. మహిళల అకౌంట్లో నెలనెలా రూ.2,500 వేశావా? మరి అది గాడిద గుడ్డే కదా, వృద్ధులకు నెలనెలా రూ.4వేలు ఇచ్చావా? రైతుల అకౌంట్లో రూ.15వేలు వేస్తానని చెప్పి గాడిద గుడ్డు, గుండు సున్నా చేసినవ్. వడ్లకు రూ.500బోనస్ అని చెప్పి గాడిద గుడ్డు చూపిస్తున్నవు" అంటూ మండిపడ్డారు. రాజ్యాంగాన్ని భగవద్గీతగా మోదీ అభివర్ణించారని కేంద్ర మంత్రి మురుగన్ అన్నారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను తాను బతికున్నంత కాలం మార్చే ప్రసక్తి లేదని మోదీ ప్రతి సమావేశంలోనూ చెబుతున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం బీజేపీ కట్టుబడి ఉందని చెప్పారు.

వివేకా హత్యకు 40 కోట్ల సుపారీ

» హత్య చేసినవారికే మళ్లీ టికెట్ ఇచ్చారు

» అవినాశ్‌ను ఐదేళ్లుగా కాపాడుతున్నారు

» హంతకులు చట్టసభలకు వెళ్లకూడదనే కడప ఎంపీగా పోటీ చేస్తున్నా: షర్మిల



కడప, మే 1(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేయడానికి రూ.40కోట్లు సుపారీ ఇచ్చారని, దీనిలో భాగంగా హంతకులకు రూ.5కోట్లు చెల్లించారని పీసీసీ చీఫ్, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలా రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆమె కడప పార్లమెంటు పరిధిలో రెండో విడత ఎన్నికల ప్రచారాన్ని బద్వేలు నియోజకవర్గం కాశినాయన మండలం వడ్డమాను గ్రామం నుంచి చేపట్టారు. కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు, అట్లూరు మండలాల్లో బస్సు యాత్ర సాగింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, "వివేకాను హత్య చేసినవారికే జగన్ మళ్లీ టికెట్ ఇచ్చారు. ఇంతకంటే అన్యాయం ఉంటుందా? ఈ హత్య ఎంపీ అవినాశ్‌రెడ్డి చేయించాడని అన్ని ఆధారాలూ ఉన్నాయి. హత్యకు ముందు పెద్దఎత్తున డబ్బుల డీలింగ్ జరిగినట్లు సీబీఐ చెప్పింది. అవినాశ్ అరెస్టు కాకుండా కర్ఫ్యూ సృష్టించారు. కర్నూలులో అరెస్టు చేయాలని చూస్తే రక్షించారు. ఐదేళ్ల నుంచి అవినాశ్‌రెడ్డిని అడుగడుగునా జగన్ కాపాడుతున్నారు" అని షర్మిల నిప్పులు చెరిగారు. "వివేకాను ఎవరు చంపారో అందరికీ తెలుసు. మళ్లీ హంతకులు గెలవాలా? హంతకులు మళ్లీ చట్ట సభలకు వెళ్లకూడదనే నేను ఎంపీగా పోటీ చేస్తున్నా. నేను ఎంపీ అయితే కేంద్ర మంత్రిగా కడప జిల్లా బాగోగులు చూసుకుంటా. కడప ఎంపీగా గెలిస్తే కేంద్రంలో మంత్రినవుతా. ప్రత్యేక హోదా సాధించుకుని వస్తా" అని షర్మిల పేర్కొన్నారు.

అంగట్లో ఆంధ్రా ప్రజల డేటా

ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్న జగన్ సర్కారు

» ప్రభుత్వ సైట్లలో అందుబాటులో

» ఒక్క క్లిక్‌తో ఆ సమాచారం లభ్యం


» ఆధార్, పాన్, రేషన్ కార్డులు, ఫోన్ నంబర్లు.. అన్నీ ఓపెన్

» ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..

» సైబర్ నేరగాళ్లకు ఏపీ సర్కారు 'సమాచార విందు'

» 'క్రిటికల్ రివర్' అనే కంపెనీకి రిజిస్ట్రేషన్ వివరాలు, వేలిముద్రలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



ఒక వివాహ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివరాలివి! ఇందులో వధూ వరుల టెన్త్‌క్లాస్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు, పాస్‌పోర్టులు అప్‌లోడ్ చేసేశారు. ఒక్క క్లిక్‌తో వీటిని ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

"వ్యక్తిగత సమాచారానికి రాజ్యాంగబద్ధమైన రక్షణ ఉంది. ప్రభుత్వం కూడా దాన్ని తీసుకోవడానికి లేదు"... ఈ మాటలు అన్నది ఎవరో తెలుసా? వైఎస్ జగన్! ఇప్పుడు ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన.. 2019 ఎన్నికల ముందు విపక్ష నేతగా 'డేటా చోరీ' పేరుతో నానా రచ్చ చేశారు. 'అమ్మో.. మీ ఆధార్ నంబర్లు చంద్రబాబు దగ్గరున్నాయి. అయ్యో.. మీ బ్యాంకు ఖాతా వివరాలు చంద్రబాబు దగ్గరున్నాయి' అంటూ ఊరూరా ఊదరగొట్టారు! అప్పట్లో తెలంగాణలో ఉన్న అనుకూల సర్కారు ద్వారా హైదరాబాద్ కేంద్రంగా హైడ్రామా నడిపించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రకరకాల పేర్లతో వలంటీర్ల ద్వారా ప్రజల సమస్త సమాచారాన్ని సేకరించేశారు. దానిని ఒక ప్రైవేటు కన్సల్టెన్సీకి అప్పగించి... రాజకీయ అవసరాల కోసమూ వాడుకుంటున్నారు. అదంతా ఒక ఎత్తు! ప్రజలకు సంబంధించి అవసరమున్న, అవసరం లేని కీలక సమాచారాన్ని ప్రభుత్వ వెబ్‌సైట్లలో పెట్టేయడం మరొక ఎత్తు! కుటుంబ సభ్యులకు, బంధువులకు, చివరికి భార్యకు కూడా తెలియని/చెప్పని వివరాలూ జగన్ గుప్పిట్లోకి వెళ్లిపోయాయి. ప్రభుత్వం స్వయంగా కోట్ల రూపాయలు వెచ్చించి డెవలప్ చేయించుకున్న వెబ్‌సైట్లలో ఈ సమగ్ర సమాచారం పెట్టేశారు. ఆ సర్టిఫికెట్లను ఎవరైనా చూడొచ్చు. డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

అందరి సమాచారం..

ప్రభుత్వానికి ఏదైనా దరఖాస్తు చేసుకుంటే, దాని సంగతి ఎక్కడిదాకా వచ్చిందో తెలుసుకోవాలంటే... అప్లికేషన్ నంబరు, ఫోన్ నంబర్ టైప్ చేస్తాం. ఓటీపీ లేదా ఇతర సెక్యూరిటీ దాటిన తర్వాతే ఆ వివరాలు తెలుస్తాయి. మనకు సంబంధించిన సమాచారం మనం మాత్రమే చూసుకునే ఏర్పాటు ఇది. జగన్ సర్కారుకు ఇదేం పట్టలేదు. 'సెర్చ్' అనే బటన్ నొక్కితే చాలు! అందరి సమాచారం అందుబాటులోకి వస్తుంది. ఉదాహరణకు... సీడీఎంఏ వెబ్‌సైటులోకి వెళ్లి... 'ఆన్‌లైన్ సర్వీసెస్' అనే ఆప్షన్ మీద మౌస్ కర్సర్ పెడితే ఒక పాపప్ వస్తుంది. అందులో... మొట్టమొదట 'ప్రాపర్టీ ట్యాక్స్' కనిపిస్తుంది. దానిమీద కర్సర్ పెట్టగానే... సబ్ పాపప్‌లో చివర్లో 'నో యువర్ అప్లికేషన్ స్టేటస్' మీద క్లిక్ చేస్తే... జిల్లా, ఆ జిల్లాలోని పట్టణాల వివరాలు సెలెక్ట్ చేసుకుంటే చాలు! ఆ తర్వాత... పెళ్లి రిజిస్ట్రేషన్లు, ప్రాపర్టీ నమోదులు, ట్రేడ్ లైసెన్సులు, వాటర్ చార్జెస్, అడ్వర్టైజ్‌మెంట్ ట్యాక్స్ వంటివి డిస్‌ప్లే అవుతాయి. అందులో పెళ్లి రిజిస్ట్రేషన్ చెక్ చేసుకుని... 'సెర్చ్' కొడితే చాలు. ఆ జిల్లాలో, సదరు పట్టణంలో రిజిస్టర్ అయిన అన్ని వివాహాలకు సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి. ఇది అంతటితో ఆగదు! వధూవరుల ఫొటోలు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, మెయిల్ ఐడీ, ఆధార్ కార్డులు, టెన్త్ క్లాస్ మార్కుల లిస్టులు మొత్తం కనిపిస్తాయి. ఆయా డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ కూడా చేసుకోవచ్చు. అప్లికేషన్ నంబర్ టైప్ చేయాల్సిన అవసరంలేదు. ఓటీపీ కోసం ఫోన్ నంబరు ఇవ్వక్కర్లేదు. పాస్‌వర్డు లేదు. కేవలం... మనకు కావాల్సిన సమాచారాన్ని ఎంచుకుని 'సెర్చ్' కొడితే చాలు. మొత్తం సమాచారం తెరపైన ప్రత్యక్షం! దేశంలో ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందనుకుంటున్నారేమో! కానే కాదు! మిగిలిన అన్ని రాష్ట్రాల్లోనూ ప్రజల డేటా భద్రంగానే ఉంది. ఒక్క ఏపీలో మాత్రమే తలుపులు తెరిచేశారు.

జగన్‌కు, ప్రభుత్వానికీ తెలిసే..

డేటా లీకేజీపై ప్రభుత్వానికి, అంటే నేరుగా సీఎం జగన్‌కే రాతపూర్వకంగా ఫిర్యాదులు అందాయి. కొందరు మేధావులు నేరుగా జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయానికే వెళ్లి సీఎం సన్నిహితులకు సీల్డ్ కవర్లో ఈ వివరాలన్నీ అందజేశారు. స్పందన ద్వారా ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించినా వారు తీసుకోలేదు. దాదాపు ఏడాది నుంచి ఈ భారీ డేటా చోరీపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నా స్పందనే లేదు. ఆ తర్వాతే పవన్ కల్యాణ్ డేటా చోరీ అంటూ విమర్శలు చేశారు. అప్పటి నుంచి ఈ రోజు వరకు ఈ డేటా చోరీపై ప్రభుత్వం విచారణ చేపట్టలేదంటే అర్థమేమిటి? అంతేకాదు.. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజల ఆస్తులకు సంబంధించిన వివరాలు, వేలిముద్రలను డిజిటల్ రూపంలో భద్రపరిచే బాధ్యతను జగన్ సర్కారు 'క్రిటికల్ రివర్' అనే కంపెనీ చేతిలో పెట్టింది. అలాగే ఇతర సమాచారాన్ని కూడా ఆ ప్రైవేటు కంపెనీకే మళ్లిస్తున్నారా? వేర్వేరు కంపెనీల్లో భద్రపరుస్తున్నారా అనేది ఏపీ ప్రభుత్వమే చెప్పాలి.

బొత్స సందీప్ ఫోర్జరీ కేసు వివరాలివ్వండి

» తెలంగాణ పోలీసులకు హైకోర్టు ఆదేశం

» ఏపీ మంత్రి బొత్స కొడుకుపై పిటిషన్

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ కొడుకు బొత్స సందీప్‌పై ఉన్న ఫోర్జరీ కేసు వివరాలను సమర్పించాలని తెలంగాణ హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచన్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 422లోని 31 ఎకరాల భూములను కబ్జా చేసే ఉద్దేశంతో తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను ఫోర్జరీ చేశారని పేర్కొంటూ బొత్స సందీప్ సహా పలువురిపై ఫిర్యాదు నమోదైంది. ఈ కేసులో పోలీసులు బొత్స సందీప్ సహా ఇతరులపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని పేర్కొంటూ షాబాద్ మండలం పెదవేడు గ్రామానికి చెందిన బొప్పి మహేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సదరు ఫోర్జరీ కేసు వివరాలు సమర్పించాలని పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను జూన్ 5కు వాయిదా వేసింది.



అబ్ కీ బార్?

లోక్‌సభ ఎన్నికలతో 9 లక్షల మందికి ఉపాధి!

ముంబై, మే1: సార్వత్రిక ఎన్నికలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశాన్ని కల్పించడంతో పాటు పెద్ద ఎత్తున తాత్కాలిక ఉపాధి అవకాశాలనూ కల్పిస్తున్నాయి. 7 దశల్లో నిర్వహిస్తున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దేశవ్యాప్తంగా 9 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి లభిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఎన్నికల ప్రక్రియలో వివిధ స్థాయుల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎన్నికల సామగ్రిని తరలించే సిబ్బంది వంటివారిని తాత్కాలికంగా నియమిస్తుంటారు. వీరితో పాటు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నియమించుకునే సిబ్బంది, సర్వేలు నిర్వహించేవారు ఇలా అందరినీ లెక్కేస్తే దాదాపు 9 లక్షల మందికి తాత్కాలిక ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

మతపరమైన రిజర్వేషన్లు ఇవ్వబోమని కాంగ్రెస్ రాతపూర్వక హామీ ఇవ్వగలదా?

» బీజేపీ ఉన్నంత వరకూ రిజర్వేషన్లు ఉంటాయి: మోదీ



బనస్కంత, కోర్బా, న్యూఢిల్లీ, మే 1: మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలనేదే కాంగ్రెస్ ఉద్దేశం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఒకవేళ మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వబోమని కాంగ్రెస్ చెప్పదలచుకుంటే.. ఆ విషయాన్ని ఆ పార్టీ, ఇండియా కూటమిలోని మిత్రపక్షాలు రాతపూర్వకంగా ఇవ్వగలవా? అని ప్రశ్నించారు. మతం పేరిట రిజర్వేషన్లను దుర్వినియోగపరచబోమంటూ కాంగ్రెస్ రాకుమారుడు చెప్పగలారా? అని రాహుల్ గాంధీ పేరును ప్రస్తావించకుండా మోదీ నిలదీశారు. గుజరాత్‌లోని బనస్కంత జిల్లాలోని దీసా పట్టణంలో బుధవారం ఓ ర్యాలీలో మోదీ ప్రసంగించారు. తాను, బీజేపీ ఉన్నంత వరకు ఎస్సీ ఎస్టీ, బీసీలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కొనసాగుతాయని ప్రకటించారు. కాగా, రిజర్వేషన్లను తాము తొలగించబోమని, ఆ పనికి సిద్ధమైతే కాంగ్రెస్‌నూ అడ్డుకుంటామని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ కోర్బా జిల్లాలోని కట్గోరా పట్టణంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో షా మాట్లాడారు. అబద్ధాలను బహిరంగంగా, బిగ్గరగా, పదే పదే చెప్పడం కాంగ్రెస్ నైజం అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఒక కుటుంబం కోసం అబద్ధాలు చెప్పడం మానుకోవాలని, చివరికి ఎన్నికల్లో ఓటమికి ఆయన్నే బాధ్యులను చేస్తారని పేర్కొన్నారు.

మోదీ హఠావో.. దేశ్ బచావో: ఖర్గే

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి): 'మోదీ హఠావో.. దేశ్ బచావో' అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఓటర్లకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రం యాదగిరిలో బుధవారం నిర్వహించిన ప్రచారసభలో ఖర్గే ప్రసంగించారు. ప్రధాని మోదీని గద్దె దించాలని, తద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన ఓటర్లను కోరారు. ఈనెల 7న జరిగే పోలింగ్‌లో కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. యాదగిరి ప్రాంతం ఒకప్పుడు హైదరాబాద్ నిజాంల పాలనలో ఉండేదని, హిందూ ముస్లింల మధ్య విభేదాలు ఉండేవి కావని తెలిపారు. అయితే ప్రధాని మోదీ ఇక్కడ చిచ్చు రేపుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. కేవలం ఓట్ల కోసమే శ్రీరాముడు, అయోధ్య వంటి అంశాలను మోదీ ప్రస్తావిస్తున్నారని ఆక్షేపించారు. పేదలు ఇంతవరకు పేదలుగానే ఉండగా ధనవంతులు శ్రీమంతులయ్యారన్నారు.

చైనాలో రహదారి కుంగి.. 24 మంది మృతి

బీజింగ్, మే 1: చైనాలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ జాతీయ రహదారి కొంత భాగం కుంగిపోవడంతో కనీసం 24 మంది మరణించారు. సుమారు 30 మంది గాయపడ్డారు. ఈ ఘటన దక్షిణ చైనాలోని గ్వాంగ్‌డాంగ్‌లో బుధవారం జరిగింది. స్థానిక మీడియా ప్రకారం... గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని మీజౌ, డాగ్‌కౌంట్ నగరాల మధ్య గల జాతీయ రహదారి బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో దాదాపు 18 మీటర్ల మేర కుంగింది. అకస్మాత్తుగా రోడ్డు కుప్పకూలడంతో పెద్ద గోతి ఏర్పడింది. ఆ సమయంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న 18 వాహనాలు అందులో పడిపోయాయి. ఈ వాహనాల్లో ఉన్న 54 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందడంతో రెస్క్యూ టీం ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో 24 మంది చనిపోయారు. మిగిలిన వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

తొలి విడత 66.14%
రెండో విడతలో 66.71%

» పోలింగ్ తుది వివరాలు వెల్లడించిన ఈసీ
» పోలింగ్ శాతం పెరగడంపై మమత డౌట్
» ఈవీఎంల విశ్వసనీయతపై అనుమానం



మాల్దా జిల్లాలో ఎన్నికల ప్రచారంలో మమత

న్యూఢిల్లీ, ఫరక్కా (పశ్చిమ బెంగాల్), మే1: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన మొదటి, రెండో విడత పోలింగ్ తుది వివరాలను ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. మొదటి విడతలో 66.14 శాతం, రెండో విడతలో 66.71 శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ పేర్కొంది. తొలి విడత పోలింగ్ ఏప్రిల్ 19న జరగ్గా పోలింగ్‌కు సంబంధించిన తుది వివరాలను 11 రోజుల తర్వాత ఈసీ అధికారికంగా మంగళవారం వెల్లడించింది. ఈ విడతలో 66.22% మంది పురుషులు, 66.07% మంది మహిళలు, 31.32% మంది థర్డ్ జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో జరిగిన మొదటి విడతలో పోలింగ్ 69.43 శాతంగా నమోదైంది. ఇక రెండో విడత విషయానికి వస్తే.. ఈ విడత పోలింగ్ ఏప్రిల్ 26న జరిగింది. ఇందులో 66.99% మంది పురుషులు, 66.42% మంది మహిళలు, 23.86% మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఓటు వేశారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రెండో విడతలో పోలింగ్ 69.64 శాతంగా నమోదైంది. కాగా మొదటి విడతలో బిహార్‌లో తక్కువ (49.26 శాతం), రెండో విడతలో ఉత్తర ప్రదేశ్‌లో తక్కువ (55.19 శాతం) పోలింగ్ జరిగింది. మొదటి విడతలో భాగంగా 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలింగ్ జరగ్గా.. 11చోట్ల మహిళల ఓటింగే ఎక్కువగా ఉందని ఈసీ వెల్లడించింది. వీటిలో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, జమ్మూకశ్మీర్, తమిళనాడు, లక్షద్వీప్, మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్, పుదుచ్చేరి, తమిళనాడు, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. రెండో విడతలో 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలింగ్ జరిగింది. వీటిలో ఆరు చోట్ల మహిళల ఓటింగ్ అధికంగా ఉంది. వీటిలో అస్సాం, బిహార్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, కేరళ, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు తర్వాత పోలింగ్ తుది వివరాలు అందుబాటులో ఉంటాయని ఈసీ స్పష్టం చేసింది.

ఇదిలా ఉండగా.. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన తొలి, రెండో విడత పోలింగ్ తుది వివరాల వెల్లడిలో ఎన్నికల కమిషన్ (ఈసీ) చేసిన జాప్యం పట్ల పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. ఈ రెండు విడతల్లో ఒక్కసారిగా పోలింగ్ శాతాలు పెరగడంపై బుధవారం ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతకు ముందు ఎన్నికల కమిషన్ విడుదల చేసిన దానికంటే పోలింగ్ తుది వివరాల్లో దాదాపు 5.75% పెరుగుదల ఆందోళన కలిగిస్తోందని మమతా బెనర్జీ అన్నారు. చాలా కాలంగా ఈవీఎంలు కనపడకుండా పోయినందు వల్ల బీజేపీ ఫలితాలను తారుమారు చేస్తుందనే ఆందోళనలున్నాయన్నారు. పోలింగ్ శాతం పెరుగుదల ఆందోళనకలిగించడమేకాకుండా ఈవీఎంల విశ్వసనీయతపై తీవ్ర భయాందోళనలు కలిగిస్తోందని చెప్పారు. ముర్షిదాబాద్ జిల్లాలోని ఫరక్కాలో నిర్వహించిన ర్యాలీలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈసీ వెల్లడించిన ఓటింగ్ వివరాల పట్ల కాంగ్రెస్ కూడా స్పందించింది. ఇంతకు ముందు మాదిరిగా పోలింగ్ వివరాలు వెల్లడించడంలో ఈసీ విఫలమవడం అందరినీ నిరాశపరుస్తోందని తెలిపారు. ఆ వివరాలతో రాజకీయ ఆటలు ఆడకూడదని ఆశిస్తున్నామన్నారు.

డీప్‌ఫేక్ వీడియోలపై ఢిల్లీ హైకోర్టులో 'పిల్'

న్యూఢిల్లీ, మే 1(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను వక్రీకరించారన్న వివాదం నేపథ్యంలో 'డీప్‌ఫేక్ వీడియోలపై ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేస్తున్నందున డీప్‌ఫేక్ వీడియోల వ్యాప్తిని, ప్రసారాన్ని అరికట్టేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని న్యాయవాదుల బృందం ఈ పిల్‌లో కోరింది. సీనియర్ న్యాయవాది జయంత్ మెహతా బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్‌సింగ్ అరోరాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు ఈ పిటిషన్ గురించి ప్రస్తావించారు. డీప్‌ఫేక్ వీడియోలపై ఫిర్యాదు చేసినప్పటికీ ఈసీ స్పందించలేదన్నారు. ఎన్నికల వేళ చక్కర్లు కొడుతున్న డీప్‌ఫేక్ వీడియోలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం పిటిషన్ సక్రమంగా ఉంటే గురువారం విచారణ చేపడతామని తెలిపింది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	46.4	25.4
నిజామాబాద్	44.1	29.9
రామగుండం	44.0	27.6
వరంగల్	43.5	26.5
నల్లగొండ	43.5	25.2
ఆదిలాబాద్	42.8	26.2
సంగారెడ్డి	42.0	27.0
హైదరాబాద్	41.9	29.9

ప్రజ్వల్‌ను దేశానికి రప్పించండి

» ప్రధాని మోదీకి కర్ణాటక సీఎం లేఖ

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి):మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పాస్‌పోర్టును రద్దు చేయాలని, ఆయనను స్వదేశానికి రప్పించాలని కోరుతూ ప్రధాని మోదీకి కర్ణాటక సీఎం సిద్దరామయ్య లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ప్రజ్వల్‌ను ఎన్డీయే అభ్యర్థిగా బరిలోకి దింపడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. అతనిపై భయంకరమైన ఆరోపణలు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ వివాదంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, వెంటనే ప్రజ్వల్ పాస్‌పోర్ట్‌ను రద్దు చేసేలా కేంద్ర హోం, విదేశాంగశాఖలకు సూచించాలని లేఖలో కోరారు. అతన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు సిట్ అవిశ్రాంతంగా పనిచేస్తోందని సిద్దరామయ్య ఆ లేఖలో తెలియజేశారు. కాగా, ఈ వ్యవహారంలో 24 గంటల్లోగా విచారణకు హాజరు కావాలని ప్రజ్వల్‌తోపాటు ఆయన తండ్రి, ఎమ్మెల్యే రేవణ్ణకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) మంగళవారం నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ప్రజ్వల్ రేవణ్ణ బుధవారం స్పందించారు. ప్రస్తుతం తాను బెంగళూరులో అందుబాటులో లేనని, జర్మనీలో ఉన్నానని పేర్కొన్నారు. విచారణకు హాజరయ్యేందుకు ఏడు రోజుల గడువు కావాలని కోరారు. ప్రజ్వల్ తరపు న్యాయవాది అరుణ్ ఈ మేరకు సిట్ అధికారులకు లేఖ పంపారు. మరోవైపు ప్రజ్వల్ లైంగిక వేధింపుల వీడియోల పెన్‌డ్రైవ్‌ల విడుదల వెనుక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ హస్తం ఉందని జేడీఎస్ నేత కుమారస్వామి చేసిన ఆరోపణలను కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ తిప్పికొట్టారు. అసలు పెన్‌డ్రైవ్‌లు బయటకు రావడానికి కుమారస్వామి కారణమై ఉంటారన్నారు. ప్రజ్వల్ విదేశాలకు పారిపోడానికి రాష్ట్ర ప్రభుత్వమే సహకరించిందని బీజేపీ చేసిన ఆరోపణలను ముఖ్యమంత్రి సిద్దరామయ్య తిప్పికొట్టారు. 'విదేశాలకు వెళ్లడానికి పాస్‌పోర్టు, వీసా ఎవరిచ్చారు? కేంద్రమే ఇచ్చింది. కేంద్రానికి తెలియకుండా అతను వెళ్లగలడా?' అని సిద్దరామయ్య ఆరోపించారు. కాగా, మోదీ తన రాజకీయ కుటుంబంలోని నేరస్థులను కాపాడే గ్యారెంటీలో ఇది కూడా భాగమేనా? అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. 'కర్ణాటకలో మహిళలపై దారుణమైన నేరాలు జరిగితే, నరేంద్ర మోదీ సిగ్గులేకుండా ఎప్పటిలాగే మౌనంగా ఉన్నారు. ప్రధాన మంత్రి జవాబు చెప్పాల్సిందే. అన్నీ తెలిసినప్పటికీ, వందలాదిమంది కుమార్తెలను లైంగికంగా వేధించిన రాక్షసుడి కోసం ఆయన ఎందుకు ప్రచారం చేశారు? కేవలం ఓట్ల కోసమే! ఇలాంటి కేసులో అంత పెద్ద నేరస్థుడు దేశం నుంచి ఎలా పారిపోగలడు? అత్యాచారాలకు పాల్పడిన నేరస్థులకు ప్రధాని మౌనమద్దతు దేశ వ్యాప్తంగా ఉన్న నేరస్థుల్లో ధైర్యం నింపుతోంది' అని రాహుల్ ఓ సోషల్ మీడియా పోస్టులో ఆక్షేపించారు.

స్కూళ్లకు బాంబు బెదిరింపులు!

130 పాఠశాలలకు అజ్ఞాత ఈ మెయిళ్లు .. ఢిల్లీలో కలకలం.. వణికిపోయిన విద్యార్థులు, తల్లిదండ్రులు

» స్కూళ్ల వద్ద గందరగోళ పరిస్థితులు
» తనిఖీలు జరిపి ఏమీ లేదని తేల్చిన బాంబు స్క్వాడ్ బృందాలు
» రష్యా నుంచి ఈమెయిళ్లు..ఐఎస్ హస్తం?



ఢిల్లీలో ఓ పాఠశాల ఆవరణలో పిల్లలు



తనిఖీలు నిర్వహిస్తున్న బాంబ్ స్క్వాడ్

న్యూఢిల్లీ, మే 1: పాఠశాలల్లో బాంబులు పెట్టామనే బెదిరింపు ఈమెయిళ్లతో ఢిల్లీలో బుధవారం కలకలం చెలరేగింది. తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతపై తీవ్ర ఆందోళనతో స్కూళ్లకు పరుగులు తీశారు. యాజమాన్యాలు స్కూళ్లను మూసివేసి విద్యార్థులను ఇళ్లకు పంపించాయి. పోలీసు, భద్రతా దళాలు పాఠశాలల్లో తనిఖీలు జరిపి బాంబులు ఏమీ లేవని, బెదిరింపు ఈ మెయిళ్లు ఒట్టివేనని తేల్చారు. ఈ మెయిళ్లు ఎక్కడి నుంచి వచ్చాయన్నది అధికారికంగా వెల్లడి కాకపోయినా.. రష్యా నుంచి వచ్చినట్లు తెలుస్తోందని, అవన్నీ ఒకే విధంగా ఉన్నాయని ఢిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీతో పాటు నగర పరిసరాల్లోని నోయిడా, గ్రేటర్ నోయిడాల్లో ఉన్న దాదాపు 130 స్కూళ్లకు బెదిరింపు ఈమెయిళ్లు వచ్చాయి. దీంతో స్కూళ్ల సిబ్బంది ఓవైపు తల్లిదండ్రులకు ఫోన్ చేస్తూనే మరోవైపు పోలీసులకు, అగ్నిమాపక విభాగానికి సమాచారం అందించారు. పిల్లల్ని స్కూల్లో దించి గంట కూడా కాకముందే.. 'ఎమర్జెన్సీ పరిస్థితి కారణంగా స్కూల్‌ను మూసేస్తున్నాం.. మీ పిల్లల్ని తీసుకెళ్లండి' అని పాఠశాలల నుంచి ఫోన్ రావటంతో తల్లిదండ్రులు ఆదరాబాదరగా తరలివెళ్లారు. దీంతో అన్ని స్కూళ్ల వద్ద తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ ఆకస్మిక పరిణామంతో విద్యార్థులు వణికిపోయారు. బెదిరింపు ఈమెయిళ్లు వచ్చిన అన్ని స్కూళ్లలో బాంబు తనిఖీ దళాలు క్షుణ్ణంగా సోదాలు జరిపాయి. ఎక్కడా ప్రమాదకరమైన వస్తువులు ఏవీ లేవని తేల్చారు. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ స్పందిస్తూ.. బాంబు బెదిరింపు ఒట్టిదేనని.. పోలీసులు, భద్రతా సిబ్బంది పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని, ప్రజలెవరూ భయాందోళనలకు గురి కావద్దని ఒక ప్రకటన విడుదల చేసింది. పుకార్లను వ్యాపింపజేయటం కోసమే బెదిరింపు ఈమెయిళ్లను పంపించి ఉంటారని ఢిల్లీ అదనపు పోలీసు కమిషనర్ సీపీ మీనా పేర్కొన్నారు. కాగా, బెదిరింపు ఈ మెయిళ్లపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులను గుర్తించాలని ఢిల్లీ పోలీసు కమిషనర్‌కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక విచారణ ప్రకారం.. ఈమెయిళ్లు రష్యా నుంచి వచ్చినట్లు తెలుస్తోందని ఢిల్లీ పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. సావరిమ్ అనే అరబిక్ పదంతో కూడిన ఈమెయిల్ ఐడీ నుంచి మెయిళ్లు వచ్చాయని, సదరు మెయిల్ ఐడీని ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదసంస్థ ఉపయోగిస్తుందని ఓ పోలీసు అధికారి తెలిపారు.

బిహార్ రాజ్‌భవన్‌కు బాంబు బెదిరింపు

బిహార్‌లోనూ బాంబు బెదిరింపు కలకలం రేపింది. రాజ్‌భవన్‌లో బాంబు అమర్చినట్లు మంగళవారం రాజ్‌భవన్ అధికారులకు, బిహార్ పోలీసులకు ఈ మెయిల్ వచ్చింది. వారు వెంటనే అప్రమత్తమై భద్రతను కట్టుదిట్టం చేశారు. బాంబు బెదిరింపు నేపథ్యంలో రాజ్‌భవన్‌లో విస్తృతంగా తనిఖీలు చేశామని, అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని బుధవారం సీనియర్ పోలీసు అధికారి రాజీవ్ మిశ్రా తెలిపారు. దాన్ని ఆకతాయి చర్యగా తేల్చారు.

ఉక్రెయిన్‌లో హ్యారీ పోటర్ కోట ధ్వంసం



» క్షిపణులతో రష్యా దాడి.. ఐదుగురి మృతి

కీవ్, మే 1: ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంలో నల్లసముద్ర తీరం వెంబడి ఉన్న ఓ అందమైన కట్టడం, స్థానికంగా హ్యారీపోటర్ కోటగా ప్రసిద్ధికెక్కిన భవనాన్ని రష్యా క్షిపణిదాడులు జరిపి ధ్వంసం చేసింది. ఈ దాడిలో భవనంలో ఉన్న ఐదుగురు చనిపోయారు. 32మంది గాయపడ్డారు. ప్రైవేటు న్యాయసేవా సంస్థ తమ కార్యకలాపాల కోసం ఈ భవనాన్ని ఉపయోగించుకుంటోందని, అదొక విద్యాసంస్థ అని పలు వార్తా సంస్థలు వెల్లడించాయి. బుధవారం రష్యా ఒడెసా నగరంపై క్షిపణులతో విరుచుకుపడింది. దాడిలో 20కి పైగా భవనాలు ధ్వంసం అయ్యాయి. ఈ దాడుల్లో రష్యా ఇస్కాండర్ బాలిస్టిక్ మిసైల్, క్లస్టర్ బాంబులను వాడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, క్రిమియాలోని తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఉక్రెయిన్ క్షిపణులను కూల్చిందని రష్యా ప్రకటించింది.

కాలిఫోర్నియా వర్సిటీలో 'జై శ్రీరామ్' నినాదాలు

న్యూయార్క్, మే 1: అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ నుంచి పాలస్తీనాకు అనుకూలంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులను ఎట్టకేలకు బుధవారం తొలగించారు. మరోవైపు లాస్ ఏంజెలిస్‌లోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో పాలస్తీనా అనుకూల, వ్యతిరేక విద్యార్థుల మధ్య ఘర్షణ చెలరేగింది. ముష్టిఘాతాలు, కుర్చీలు, కర్రలతో కొట్టుకున్న ఘటనలు చోటుచేసుకున్నాయి. కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఘర్షణ సందర్భంగా ఇజ్రాయెల్ అనుకూల విద్యార్థి 'జై శ్రీరామ్' నినాదాలు చేసిన వీడియో వైరల్‌గా మారింది. పాలస్తీనా అనుకూల విద్యార్థి ఒకరు భారత వ్యతిరేక నినాదాలు చేయడంతో, దానికి కౌంటర్‌గా ఇజ్రాయెల్ అనుకూల విద్యార్థి 'జై శ్రీరామ్' నినాదాలు చేశారు. ఇజ్రాయెల్ జెండాను కప్పుకొన్న ఆ విద్యార్థి పేరు శయన్ ఆలి కృష్ణ. పాకిస్థాన్‌లో జన్మించారు. కాగా, అమెరికా వ్యాప్తంగా ఇతర యూనివర్సిటీల్లో బుధవారం కూడా పలువురు నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో అరెస్టయిన విద్యార్థుల సంఖ్య వెయ్యి దాటింది.

పెళ్లంటే పాటలు, డ్యాన్స్‌లు కాదు

» రిజిస్ట్రేషన్ రుజువు మాత్రమే.. చట్టబద్ధం కాదు: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, మే 1: హిందూ వివాహం చెల్లుబాటు కావాలంటే సముచిత ఆచార వ్యవహారాల మధ్య వివాహ క్రతువు నిర్వహించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హిందూ వివాహాన్ని పవిత్ర మతపరమైన తంతుగా అభివర్ణించింది. సప్తపది (పవిత్ర అగ్నిగుండం చుట్టూ 7 అడుగులు) ప్రాధాన్యాన్ని ప్రస్తావించింది. భవిష్యత్తులో వచ్చే వివాదాల సమయంలో ఇటువంటివి రుజువుగానూ ఉంటాయని పేర్కొంది. అంతేకానీ ఆటపాటలు.. విందు భోజనాల కోసం నిర్వహించే కార్యక్రమం పెళ్లి కాదని జస్టిస్ బీవీ నాగరత్నం నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. సంప్రదాయబద్ధంగా వివాహం చేసుకోని ఓ యువ జంట.. విడాకుల కోసం ఆశ్రయించిన నేపథ్యంలో కోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. 'హిందూ వివాహం ఓ సంస్కారం.. పవిత్రమైన మతకర్మ. భారతీయ సమాజంలో దీనికి ఎంతో ప్రాధాన్యత ఉంది. వివాహమంటే ఆటపాటలు, విందువినోదాలు, కట్నకానుకలు ఇచ్చిపుచ్చుకునే సందర్భమో.. వాణిజ్యపరమైన లావాదేవీనో అస్సలు కాదు. ఇది కుటుంబ వ్యవస్థకు ఓ గంభీరమైన పునాది కార్యక్రమం' అని వ్యాఖ్యానించింది. 'హిందూ వివాహ చట్టం-1952లోని సెక్షన్ 8 ప్రకారం వివాహాన్ని నమోదు చేయడం వల్ల రుజువు లభిస్తుంది. అయితే సెక్షన్ 7 మేరకు ఆచార సంప్రదాయాలతో వివాహం నిర్వహించకపోతే చట్టబద్ధత లభించదు' అని కోర్టు స్పష్టం చేసింది.

కొవిషీల్డ్‌పై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ, మే 1 (ఆంధ్రజ్యోతి): కొవిషీల్డ్ టీకా దుష్ప్రభావాలపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ టీకా వల్ల అరుదైన కేసుల్లో రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉందంటూ.. దాన్ని తయారుచేసిన ఆస్ట్రాజెనెకా సంస్థే ఇటీవల ఒప్పుకొన్న నేపథ్యంలో.. సీనియర్ న్యాయవాది విశాల్ తివారీ బుధవారం సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. కొవిషీల్డ్ టీకా దుష్ప్రభావాలపై వైద్య నిపుణుల బృందాన్ని నియమించేలా.. ఆ టీకా తీసుకున్న తర్వాత చనిపోయిన, వైకల్యానికి గురైనవారి కుటుంబాలకు నష్టపరిహారం అందించేందుకు వ్యాక్సిన్ డ్యామేజ్ పేమెంట్ సిస్టమ్‌ను ఏర్పాటుచేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని ఆ పిటిషన్‌లో ఆయన అభ్యర్థించారు. "దేశంలో 175 కోట్లకు పైగా డోసుల కొవిషీల్డ్ టీకాలు ప్రజలకు వేశారు. ఇటీవల యువకులు కూడా గుండెపోటుతో మరణిస్తున్న ఘటనలు పెరిగిపోయాయి" అని విశాల్ తివారీ తన పిటిషన్‌లో గుర్తు చేశారు.

సల్మాన్ ఇంటి వద్ద కాల్పుల ఘటనలో.. కస్టడీలోని నిందితుడి ఆత్మహత్య

ముంబై, మే 1: బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద ఇటీవలే కాల్పులకు పాల్పడిన ఘటనలో పలువురిని క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసుల కస్టడీలో ఉన్న నిందితుడు అనూజ్ తపన్(32) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. టాయిలెట్‌లోని కిటికీకి బెడ్‌షీట్‌తో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ముంబైలోని సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద గత నెల 14న కాల్పులు జరిపిన ఇద్దరు నిందితులకు ఆయుధాలను సరఫరా చేసిన కారణంగా తపన్‌ను అరెస్టు చేశారు.



అయోధ్యలో కొలువుదీరిన బాలరాముడిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆమె అయోధ్యలోనే హనుమాన్ గఢీ ఆలయంలో హనుమంతున్ని దర్శించుకొని పూజలు చేశారు.

ఉగ్రవాది గోల్డీ బ్రార్ హత్య

» కాలిఫోర్నియాలో కాల్చి చంపిన దుండగులు



వాషింగ్టన్, మే 1: పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యకేసులో కీలక నిందితుడు, బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ ఉగ్రవాది గోల్డీ బ్రార్(30) అమెరికాలో హత్యకు గురయ్యాడు. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం కాలిఫోర్నియాలోని ఫెయిర్ మాంట్‌లో ఉన్న హోల్ట్ అవెన్యూలో ఓ ఇంటి ముందు తన స్నేహితుడితో కలిసి నిలబడ్డ గోల్డీ బ్రార్‌పై గుర్తుతెలియని దుండగులు తుపాకులతో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన గోల్డీ బ్రార్, అతని స్నేహితుడిని సమీప ఆస్పత్రికి తరలించారు. గోల్డీ బ్రార్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. గోల్డీ బ్రార్ హత్యకు తమదే బాధ్యత అని ఆయన ప్రత్యర్థులు అర్ష్ దల్లా, లఖ్బీర్ ప్రకటించారు. గోల్డీబ్రార్ స్వస్థలం పంజాబ్‌లోని శ్రీముక్త్‌సర్ సాహిబ్. 1994లో జన్మించారు. తన సోదరుడు గురులాల్ బ్రార్‌ను చంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యువజన కాంగ్రెస్ నేత గురులాల్ పహిల్వాన్‌ను 2021 ఫిబ్రవరి 8న హతమార్చాడు. ఆ తర్వాత విద్యార్థి వీసాపై కెనడాకు పారిపోయాడు. 2021 ఆగస్టులో మొహాలీలో గోల్డీ మరో సోదరుడు విక్కీ మిద్దూఖేరా(గ్యాంగ్‌స్టర్) హత్యకు గురయ్యాడు. ఆ కేసులో గాయకుడు సిద్ధూ మూసేవాలా మేనేజర్ షాగన్ ప్రీత్‌సింగ్ ప్రధాన నిందితుడు. దీంతో గోల్డీ బ్రార్ కెనడా నుంచి మూసేవాలా హత్యకు స్కెచ్ వేశాడు. 2022 మే 29న మూసేవాలాను హతమార్చాడు.

'అబూజ్‌మడ్' మృతుల్లో ముగ్గురు తెలుగువారు

చర్ల, మే 1: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అబూజ్‌మడ్ అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 10 మంది మావోయిస్టుల్లో 8 మందిని పోలీసులు గుర్తించారు. వీరిలో ముగ్గురు తెలుగువారు ఉన్నారు. 10 మంది మావోయిస్టులపై మొత్తం రివార్డు విలువ రూ.63 లక్షలుగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతుల్లో కరీంనగర్ జిల్లా రామగుండానికి చెందిన జోగయ్య అలియాస్ చీమల నర్సయ్య(66) ఉన్నారు. ఇతనిపై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్టు ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలిపారు. మిగతా మృతుల్లో.. ఆదిలాబాద్ జిల్లా చెన్నూరుకు చెందిన డీవీసీఎం సభ్యుడు వినయ్ అలియాస్ రవి(55), వరంగల్ జిల్లాకు చెందిన సుస్మిత అలియాస్ చైతే ఉన్నట్టు వివరించారు. వినయ్‌పై రూ.8లక్షలు, సుస్మితపై రూ.2 లక్షల మేర రివార్డు ఉన్నట్టు తెలిపారు.



జూలైలో వలంటీర్ల వ్యవస్థ తీసుకొస్తాం

(మొదటిపేజీ తరువాయి)



నిర్వహించిన నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15వ తేదీలోగా రైతులకు రుణమాఫీ చేసి తీరుతామని, లేదంటే తాను దేనికైనా సిద్ధమని ప్రకటించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా పేరిట డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావన్నారు. తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారంటూ మోదీ మాట్లాడడం సమంజసం కాదన్నారు.

ఆ ఫేక్ వీడియోతో నాకు సంబంధం లేదు

- టీ కాంగ్రెస్ అధికారిక ఎక్స్ అకౌంట్‌కు నేను బాధ్యుడిని కాను
- సీఎంవో తెలంగాణ, వ్యక్తిగత ఎక్స్ ఖాతాలే వినియోగిస్తున్నా
- న్యాయవాది ద్వారా ఢిల్లీ పోలీసులకు సీఎం రేవంత్ వివరణ

న్యూఢిల్లీ, మే 1 (ఆంధ్రజ్యోతి): అమిత్ షా ఫేక్ వీడియోలతో తనకు ఏ సంబంధమూ లేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పోలీసులకు వివరణ ఇచ్చారు. ఐఎన్‌సీ తెలంగాణ(తెలంగాణ కాంగ్రెస్ అధికారిక ఎక్స్ ఖాతా) ఖాతాను తాను వినియోగించడం లేదని, దానికి తాను బాధ్యుడిని కానని అందులో ఆయన స్పష్టం చేశారు. ఎక్స్‌లో.. సీఎంవో తెలంగాణతోపాటు తన వ్యక్తిగత ఖాతాను మాత్రమే వినియోస్తున్నానని పేర్కొన్నారు. రేవంత్ తరఫున ఆయన న్యాయవాది సౌమ్య గుప్తా ఢిల్లీ పోలీసులకు ఈ వివరణ అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఫేక్ వీడియోను షేర్ చేసిన డివైజ్ (ఫోన్, ల్యాప్ ట్యాప్, ట్యాబ్) ఇవ్వాలని పోలీసులు కోరారని తెలిపారు. కాగా.. ఇదే కేసులో ఝార్ఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్‌కు ఢిల్లీ పోలీసులు బుధవారం నోటీసిచ్చారు. ఢిల్లీ పోలీసులకు చెందిన ఇంటెలిజెన్స్ ఫ్యూజన్ అండ్ స్ట్రాటజిక్ ఆపరేషన్స్ (ఐఎఫ్ఎస్‌వో) ఆఫీసుకు గురువారం రావాల్సిందిగా ఆ నోటీసుల్లో పేర్కొన్నారని రాజేశ్ ఠాకూర్ తెలిపారు. అయితే.. అసలు ఈ నోటీసు తనకు ఎందుకు ఇచ్చారో అర్థం కావట్లేదని, ఇది అరాచకం తప్ప మరేం కాదని ఆయన మండిపడ్డారు. "వారికి దీనిపై ఏదైనా ఫిర్యాదు వస్తే ముందు నా ఎక్స్ ఖాతాలో ఏముందో తనిఖీ చేయాలి. ఎన్నికల ప్రచారం పతాకస్థాయిలో ఉన్న వేళ ఇలా సమన్లు జారీ చేయడం సమంజసం కాదు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. అమిత్ షా ఫేక్ వీడియోను షేర్ చేసినందుకు కశ్మీర్‌లోని బడ్గామ్‌కు చెందిన మహ్మద్ ఇల్యాస్ హుస్సేన్ మిర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.

కాంగ్రెస్ గూటికి ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం తన రాజీనామా లేఖను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పంపారు. అనంతరం గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆయన హస్తం గూటికి చేరారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేతిలో ఓటమిపాలైనప్పటి నుంచి బీఆర్ఎస్‌తో అల్లోల అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. రెండు నెలల నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, ఆయన చేరికను స్థానిక డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతో పాటు పలువురు సీనియర్ నేతలు బలంగా వ్యతిరేకించారు. దీంతో ఒక సందర్భంలో ఇంద్రకరణ్‌ను పార్టీలో చేర్చుకోబోమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సైతం ప్రకటించారు. కాగా, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా చేరికలకు కాంగ్రెస్ అధిష్ఠానం ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో అల్లోలకు మార్గం సుగమమైంది. ఆయనతోపాటు సంచార జాతుల నాయకుడు వెన్నెల అశోక్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి, మధు యాష్కీ సమక్షంలో వనస్థలిపురం బీజేపీ కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి హస్తం గూటికి చేరారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లు దళిత వ్యతిరేక పార్టీలు

- ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ సంపత్‌కుమార్
- రిజర్వేషన్ల రద్దు యత్నాలను నిరసిస్తూ 4న ధర్నా

హైదరాబాద్, మే1 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లు ఎత్తివేస్తామన్న బీజేపీ.. అసలు రిజర్వేషన్లను ఏ విధంగా వర్గీకరిస్తుంద ని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సంపత్‌కుమార్ ప్రశ్నించారు. దళితులు ముఖ్యంగా మాదిగలు ఇప్పుడు మెరుగైన స్థాయిలో ఉండడానికి కాంగ్రెస్ పార్టీ అందించిన అనేక సంక్షేమ ఫలాలే కారణమని అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో పలువురు దళిత నాయకులు సమావేశమయ్యారు. అనంతరం సంపత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో కొనసాగిన బీజేపీ, బీఆర్ఎస్‌లు వర్గీకరణపై ఒక్క అడుగు ముందుకు వేయలేదని, ఈ రెండూ దళిత వ్యతిరేక ప్రభుత్వాలని విమర్శించారు. మాదిగల వర్గీకరణకు కట్టుబడి ఉన్న రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో అండగా నిలబడాలని కోరారు. రిజర్వేషన్ల రద్దు యత్నాలను నిరసిస్తూ మే 4న పెద్ద ఎత్తున ధర్నా చేయనున్నట్టు మాజీ మంత్రి చంద్రశేఖర్, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ ప్రీతం ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలు బీజేపీకి.. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మధ్య జరుగుతున్న యుద్ధమని ఎస్సీ సెల్ నాయకుడు గజ్జల కాంతం వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్ అరెస్ట్

హైదరాబాద్ సిటీ/తార్నాక/చౌటుప్పల్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో నకిలీ నోటీసులు ప్రచారం చేసిన కేసులో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌గేట్ వద్ద పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం జిల్లా కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా పంతంగి టోల్‌గేట్ వద్ద క్రిశాంక్ వాహనాన్ని పోలీసులు ఆపారు. అనంతరం ఆయన్ను అరెస్టు చేసి ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉస్మానియా యూనివర్సిటీలో నీరు, కరెంట్ సమస్యలపై నకిలీ నోటీసులు సృష్టించి వర్సిటీ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ ఓయూ చీఫ్ వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రిశాంక్‌పై ఓయూ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆయనను అదుపులోకి తీసుకున్నారు. వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం ఈస్ట్ మారేడ్‌పల్లిలోని జడ్జి ముందు హాజరు పరిచారు. క్రిశాంక్‌కు న్యాయమూర్తి 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండు విధించారు. దీంతో క్రిశాంక్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా, తమ పార్టీ యువనేత, ఉద్యమకారుడు క్రిశాంక్‌ను అరెస్టు చేయడం అక్రమమని, గల్లీ కాంగ్రెస్ వైఫల్యాలు, ఢిల్లీ బీజేపీ అరాచకాలపై గొంతెత్తినందుకే ఆయనపై దౌర్జన్యానికి పాల్పడ్డారని 'ఎక్స్' వేదికగా కేటీఆర్ బుధవారం పేర్కొన్నారు. కాంగ్రెస్-బీజేపీ కలిసి చేస్తున్న ఈ కక్ష సాధింపులకు మూల్యం చెల్లించక తప్పదని, తెలంగాణ ప్రజాక్షేత్రంలో వారికి శిక్ష తప్పదన్నారు. ప్రస్తుతం అప్రకటిత ఎమర్జెన్సీని చూస్తున్నామని, ఆనాడు పాలక పక్షానికి పట్టిన గతే రేపు కాంగ్రెస్, బీజేపీలకు పడుతుందని ఆయన జోస్యం చెప్పారు.

విద్యుత్తు, నీటి కొరత లేని నోటీసు ఫేక్

- వాటిపై పోలీసులకు ఫిర్యాదు: ఓయూ రిజిస్ట్రార్

హైదరాబాద్ సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): గతేడాది వేసవి సెలవుల సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ జారీ చేసిన నోటీసులో విద్యుత్తు, నీటి కొరతను ప్రస్తావించామని, ఆ అంశమే లేదంటూ సృష్టించిన నోటీసు ఫేక్ అని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. యూనివర్సిటీలో విద్యుత్తు, తాగునీటి సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయని, వాటిని వినియోగించుకునే క్రమంలోనే తమకు అంతర్గతంగా ఇబ్బందులు వస్తాయని తెలిపారు. రెండు రోజుల క్రితం అనుకోకుండా ఆర్ట్స్ కాలేజీ వద్ద ఎండల వేడికి ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో 4 గంటలు విద్యుత్తు సరఫరాలో అంతరాయం తలెత్తిందని, సరిదిద్దడంతో విద్యుత్తు పునరుద్ధరణ జరిగిందని తెలిపారు. ఇలాంటి సమస్యలుంటాయని ప్రతీ ఏడాది వేసవిలో సెలవులిచ్చే క్రమంలో నోటీసులో ప్రస్తావిస్తామని, గతేడాది ప్రకారమే నోటీసు జారీ చేయాలని తాము చీఫ్ వార్డెన్‌కు ఆదేశాలిచ్చామని రిజిస్ట్రార్ తెలిపారు. యూనివర్సిటీ, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా కొందరు ఫేక్ నోటీసులు సృష్టించడంతో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. వేసవి సెలవుల్లో హాస్టళ్లు తెరిచే ఉన్నాయన్నారు. హాస్టళ్లను ఖాళీ చేసి ఇంటికెళ్లే విద్యార్థులు తప్పనిసరిగా లేఖ రాసి వార్డెన్‌కు కానీ, చీఫ్ వార్డెన్‌కు కానీ, డైరెక్టర్‌కు గాని ఇవ్వాలని అన్నారు.

బీజేపీకి వేసే ప్రతి ఓటూ రిజర్వేషన్ల రద్దుకే

(మొదటిపేజీ తరువాయి)



ఇచ్చిన రిజర్వేషన్లు రద్దు చేసేందుకే ఉపయోగపడుతుందని అన్నారు. తనను పోలీసులతో బెదిరించడం సాధ్యం కాదన్న విషయాన్ని మోదీ, అమిత్‌షా గుర్తుంచుకోవాలని సూచించారు. తనపై దాడి చేయడమంటే.. తెలంగాణపైన, తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీలపైన దాడి చేయడమేనని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఒక పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా, ఒక రాష్ట్రానికి సీఎంగా ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతం, రాజకీయ విధానంపైన తాను స్పష్టంగా మాట్లాడితే తెలంగాణ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతం రిజర్వేషన్లను రద్దు చేయడమేనని, దాన్ని అమలు చేయడానికి ఎన్నుకున్న రాజకీయ కార్యాచరణ పేరే బీజేపీ అని చెప్పారు. అవకాశం వస్తే రాజ్యాంగాన్ని మార్చి.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ఎత్తేయాలన్నదే బీజేపీ అజెండా అని, ఆ విషయాన్ని తాను ప్రెస్ మీట్లు, బహిరంగ సభల్లోనూ మాట్లాడానని చెప్పుకొచ్చారు. ఇది దేశ వ్యాప్తంగా చర్చకు రావడంతో బీజేపీ తనను టార్గెట్ చేసిందని దుయ్యబట్టారు. అందులో భాగంగానే తనపైన కేంద్ర హోంశాఖ స్వయంగా ఢిల్లీలో అక్రమ కేసు పెట్టిందన్నారు. తనతోపాటు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో పని చేసేవారికి నోటీసులు ఇచ్చి బుధవారం ఢిల్లీకి వచ్చి హాజరు కావాలని హుకుం జారీ చేసిందన్నారు.

వాజ్‌పేయి హయాంలోనే ప్రయత్నం

రాజ్యాంగం మార్చేందుకు వాజ్‌పేయి హయాంలోనే ప్రయత్నం జరిగిందని రేవంత్ ఆరోపించారు. స్వాతంత్రం వచ్చి 50 ఏళ్ల అయిన సందర్భంగా రాజ్యాంగాన్ని సమీక్షించే పేరిట పది మంది సభ్యులతో జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్‌ను నియమిస్తూ 2000 ఫిబ్రవరి 22న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని మార్చడమే బీజేపీ అజెండా అనడానికి ఈ గెజిట్ నోటిఫికేషనే ఆధారమని పేర్కొన్నారు. ఆ కమిషన్ 2002లో నివేదిక ఇచ్చిందని తెలిపారు. కానీ, 2004లో ప్రజలు ఎన్డీయేను తిరస్కరించి సోనియా నేతృత్వంలోని యూపీఏను అధికారంలోకి తీసుకురావడంతో రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం తప్పిందన్నారు. ఆర్ఎస్ఎస్ రెండో సర్సంగ్ చాలక్ మాధవ్ సదాశివరావ్ గోల్వాల్కర్ 1960లో రచించిన రెండు పుస్తకాల్లో దురదృష్టవశాత్తూ రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు కల్పించారని రాశారన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త ఎమ్జీ వైద్య.. 2015లో ఇండియా టుడేకి ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ దేశంలో ఏ కులమూ వెనుకబడి లేదని, కుల ఆధారిత రిజర్వేషన్ అవసరం లేదని, ఎస్సీ, ఎస్టీలకు ఇంకో పదేళ్లు రిజర్వేషన్ ఉంచి రద్దు చేయాలని స్పష్టం చేశారన్నారు. ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న మండల్ కమిషన్ సిఫారసును నాటి వీపీ సింగ్ ప్రభుత్వం అమలు చేసినప్పుడు.. దానికి వ్యతిరేకంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు ఉద్యమం చేశాయని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని మార్చేందుకే తాము వచ్చామంటూ 2017లో కేంద్ర మంత్రి అనంతకుమార్ హెగ్డే వ్యాఖ్యానించారని, రిజర్వేషన్లు అభివృద్ధిని తెస్తాయా? అంటూ లోక్‌సభ మాజీ స్పీకర్ సుమిత్రా మహాజన్ కూడా మాట్లాడారని వెల్లడించారు. వీళ్లంతా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన ముఖ్య నేతలేనని చెప్పారు. రిజర్వేషన్లు వద్దన్న సదరు నేతలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చాక జనగణన చేపట్టి దామాషా పద్ధతిలో రిజర్వేషన్ అమలు చేయాలన్న విధానాన్ని కాంగ్రెస్ తీసుకుందని తెలిపారు. దీంతో అప్రమత్తమైన బీజేపీ.. ఈ ఎన్నికల్లో 400 సీట్ల లక్ష్యం నినాదాన్ని ఎత్తుకుందన్నారు. రాజ్యాంగంలోని మూల సూత్రాలను తొలగించాలంటే లోక్‌సభలో మూడొంతుల మెజారిటీతోపాటు సగం రాష్ట్రాల శాసనసభల ఆమోదమూ అవసరమన్నారు. అందులోభాగంగానే ఇప్పటికే 8 రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టి సొంత ప్రభుత్వాలను బీజేపీ ఏర్పాటు చేసుకుందన్నారు.

పదేళ్లలో ఇచ్చింది గాడిదగుడ్డు

పదేళ్ల మోదీ పాలనలో తెలంగాణకు ఇచ్చింది పెద్ద గాడిద గుడ్డు అని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా, కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కృష్ణా, గోదావరి జలాల్లో వాటాల పంపకం, మేడారం జాతరకు జాతీయ హోదాను తెలంగాణ అడిగితే.. మోదీ గాడిద గుడ్డు ఇచ్చారని వ్యాఖ్యానించారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీనే అడ్డని, పదేళ్ల పాలనలో తెలంగాణకు ఇచ్చింది పెద్ద గాడిద గుడ్డని 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.

ఆ అంశాలు లేవనెత్తాననే నాపై కేసు!

రిజర్వేషన్ల రద్దుకు సంబంధించిన అంశాలను ప్రస్తావించినందుకే కేంద్రంలోని బీజేపీ తనపై కేసు పెట్టించిందని రేవంత్ ఆరోపించారు. "సీఎంలు ఎవరైనా ఫేక్ వీడియోలు తయారు చేస్తారా? బీజేపీ వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ పత్రికా సమావేశాలతోపాటు బహిరంగంగానే చెప్పిన. ఇంకా ఫేక్ వీడియోలు ఎందుకు?" అని ప్రశ్నించారు. మోదీ, షా ముందు చిన్నవాడినే అయ్యుండవచ్చని, అయితే వారు తనను పోలీసులతో బెదిరించాలనుకుంటే సాధ్యం కాదని అన్నారు. భయపెట్టి రాజకీయం చేయాలనుకుంటే తెలంగాణలో పరిణామాలు ఎలా ఉంటాయో?.. మీతో చీకట్లో మాట్లాడే వ్యక్తిని(కేసీఆర్‌ను) అడిగి తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో మతపరమైన రిజర్వేషన్ లేదని, బీసీ-ఈ కింద ఇచ్చింది కూడా ముస్లింల్లోని వెనుకబడిన వర్గాలకేనని గుర్తు చేశారు. 'బీసీ-ఈ'ని ప్రవేశపెట్టక ముందు నుంచీ వారు రిజర్వేషన్లు పొందుతున్నారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించి ఎమోషన్లతో ఆడుకోవాలని మోదీ, అమిత్‌షా చూస్తున్నారని దుయ్యబట్టారు.

మోదీ.. కన్వర్టెడ్ బీసీ

ప్రధాని మోదీ కన్వర్టెడ్ బీసీ అని రేవంత్ ఆరోపించారు. గుజరాత్‌కు మోదీ సీఎం కాకముందు ఆయన సామాజిక వర్గం ఫార్వర్డ్ క్యాస్టేనని తెలిపారు. మోదీ సీఎం అయ్యాకే ఆయన సామాజిక వర్గాన్ని బీసీ జాబితాలో కలిపారని వెల్లడించారు. మోదీకి బీసీల పట్ల ప్రేమ లేదని, అవసరమైనప్పుడే బీసీ కార్డును ప్రయోగిస్తారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో దాదాపు 30లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసి ఉంటే దేశంలోని 15 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉద్యోగాలు వచ్చి ఉండేవన్నారు.

రజాకార్లకు పట్టిన గతే.. బీజేపీకీ!

- ఢిల్లీ పోలీసు కేసుకు భయపడం: సీఎం రేవంత్

జగిత్యాల, హైదరాబాద్ సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): భయపెట్టి ఆధిపత్యం చెలాయించాలనుకుంటే.. నాడు రజాకార్లకు పట్టిన గతే నేడు బీజేపీకి పడుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఢిల్లీలో పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తనకు హుకుం జారీ చేశారని, ఎన్నికల ప్రచార సభలను రద్దు చేసుకొని ఢిల్లీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ముద్దాయిగా నిలబడాల్నా, ఇదేనా ప్రధాని మోదీ నీతి అని ప్రశ్నించారు. ఇలా భయపెట్టించి ఎంత కాలం రాజ్యాన్ని ఏలుతారని నిలదీశారు. నిజాం నవాబుకు ఏం గతి పట్టిందో కనుక్కోవాలని, రజాకార్ల పరిస్థితి ఏమైందో తెలుసుకోవాలని బీజేపీకి సూచించారు. బీజేపీ వాళ్లు భయపెడితే భయపడానికి ఇక్కడ ఎవరూ లేరని, తమను భయపెడితే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సీటు రాదని హెచ్చరించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల-మెట్‌పల్లిలో నిర్వహించిన బహిరంగసభతోపాటు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో, లింగంపల్లిలో రోడ్డుషోల్లో సీఎం రేవంత్ ప్రసంగించారు. 'బీజేపీ కుట్రపూరితంగా చేస్తున్న రిజర్వేషన్ల రద్దు యోచనను అడ్డుకుంటున్నందుకే ఢిల్లీ పోలీసులతో కేసు బనాయించారు. ఆ కేసులకు భయపడేది లేదు.' అని స్పష్టం చేశారు. ప్రస్తుత ఎన్నికలు తెలంగాణ పౌరుషానికి, గుజరాత్ ఆధిపత్యానికి మధ్య జరుగుతున్న పోరాటం అని రేవంత్ చెప్పారు. గుజరాత్ నుంచి మోదీ ఇక్కడి వచ్చి ఈ రాష్ట్ర సీఎంని బెదిరిస్తున్నారంటే.. తెలంగాణ సమాజం ఎడ్డిదో గుడ్డిదో కాదని, కబడ్దార్ మోదీ అని హెచ్చరించారు. "మేం సవాల్ విసురుతున్నాం. లోక్‌సభ ఎన్నికల్లో గుజరాత్ టీమ్‌ను డకౌట్ చేస్తాం. కాంగ్రెస్‌ను గెలిపించుకుంటాం' అని సీఎం వ్యాఖ్యానించారు. రిజర్వేషన్ల రద్దుపై తాను మాట్లాడింది తప్పయితే రాష్ట్ర బీజేపీ ఎంపీలు అర్వింద్, సంజయ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఉన్నారు కదా.. వారితో తెలంగాణలో కేసు ఎందుకు పెట్టించలేదని ప్రశ్నించారు. కేంద్రం తన ఆధీనంలోని ఈడీ, ఐటీ, సీబీఐలనే కాదు ఢిల్లీ పోలీసులను సైతం ఉపయోగించుకుని తమను భయపెట్టాలని చూస్తోందన్నారు. తన వద్ద తెలంగాణ ప్రజలు ఉన్నారని, 50 లక్షల యువతీ యువకులు ఉన్నారని చెప్పారు.



మూసాపేట రోడ్‌షోలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్

తెలంగాణలో పోలింగ్ సమయం పెంపు

న్యూఢిల్లీ, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పోలింగ్ సమయం పెంచుతున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. రాష్ట్రంలో మే 13న లోక్‌సభ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. సాధారణంగా ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. 5 గంటల్లోపు క్యూలైన్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. అయితే తెలంగాణలో ఎండల తీవ్రత ఓటింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇదే అంశాన్ని పలు రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాయి. అది ఈ విషయాన్ని ఈసీకి నివేదించింది. అన్ని అంశాలు పరిశీలించిన ఈసీ.. తెలంగాణలో పోలింగ్ సమయాన్ని మరో గంటసేపు పొడిగించాలని నిర్ణయించింది. మే 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ నిర్వహిస్తామని ప్రకటించింది. దీని ప్రకారం సాయంత్రం 6 గంటల్లోపు క్యూలైన్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. అయితే, 5 లోక్‌సభ నియోజకవర్గాల (ఆదిలాబాద్, పెద్దపల్లి, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం) పరిధిలోని కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రం పోలింగ్ సమయం పొడిగించలేదు. అవి.. సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లెందు, భద్రచాలం, కొత్తగూడెం, అశ్వారావుపేట. ఈ సెగ్మెంట్లలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకే పోలింగ్ జరగనుంది.

బీజేపీ చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడుతోంది

- కాంగ్రెస్ కార్యకర్త గీతను భయపెట్టి ఫోన్ తీసుకున్నారు
- టీపీసీసీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ రాంచంద్రారెడ్డి

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని టీపీసీసీ లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ రామచంద్రారెడ్డి ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పోలీసులు ఇచ్చిన నోటీసుకు సమాధానం చెప్పడానికి 15 రోజుల సమయం అడిగినట్టు చెప్పారు. పోలీసులు ఇచ్చిన యూఆర్ఎల్ లింక్‌ను పూర్తిగా పరిశీలించేందుకు నాలుగు వారాల గడువు అవసరమన్నారు. కాంగ్రెస్ కార్యకర్త గీత ఇంటికి వెళ్లిన ఢిల్లీ పోలీసులు ఆమెను భయభ్రాంతులకు గురి చేసి ఫోన్‌ని సీజ్ చేశారని వివరించారు. మహిళ దగ్గరికి మహిళా పోలీసులు వెళ్లాలి కానీ మగ పోలీసులు ఎలా వెళ్తారని మండిపడ్డారు. సీఆర్‌పీసీ 41 నోటీసులు ఇచ్చి కాంగ్రెస్ కార్యకర్తలను భయపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ప్రధాని మోదీ పరుష పదజాలం వాడుతున్నారని కోదండరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్‌ను బలహీన పరచడానికే బీజేపీ వాళ్ల నోటీసులు పంపారని ఆరోపించారు. ఎన్నికల ముందు బీజేపీ తీరు అందరికీ అనుమానాస్పదంగా ఉందన్నారు. ఎలాగైనా మళ్లీ గెలవాలనే కుట్రలు చేస్తోందని నిరంజన్ ఆరోపించారు. అమిత్ షా మీద ఫేక్ వీడియో బీజేపీ సృష్టిగా పేర్కొన్నారు. నోటీసులలో గీత పేరు లేదని, అయితే ఆమె ఫోన్ ఎందుకు సీజ్ చేశారని ప్రశ్నించారు.

కేసీఆర్ ప్రచారంపై 48 గంటల నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

బస్సుయాత్రను పెద్దతండా వద్ద ఆపిన అధికారులు ఉత్తర్వులను అందజేసి కేసీఆర్ సంతకాలు తీసుకున్నారు. దీంతో, షెడ్యూల్ ప్రకారం గురువారం జమ్మికుంటలో నిర్వహించాల్సిన రోడ్‌షోను కేసీఆర్ రద్దు చేసుకున్నారు. మహబూబాబాద్‌లో ప్రచారం అనంతరం ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు.

సిరిసిల్లలో చేసిన వ్యాఖ్యలే కారణం

ఏప్రిల్ 5వ తేదీన సిరిసిల్లలో నిర్వహించిన మీడియా సమావేశంలో తమ పార్టీపై, సీఎం రేవంత్ రెడ్డిపై కేసీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేత నిరంజన్ ఈసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఏప్రిల్ 17న ఈసీ కేసీఆర్‌కు నోటీసులు పంపింది. నోటీసులకు కేసీఆర్ వివరణ ఇస్తూ.. సిరిసిల్లలో ఎన్నికల ఇంచార్జులుగా ఉన్న అధికారులు తెలుగువారు కాదని, వారికి తెలుగు మాండలికం తెలియదని పేర్కొన్నారు. సందర్భానుసారంగా చెప్పిన కొన్ని మాటలను తీసుకుని కాంగ్రెస్ ఫిర్యాదు చేసిందని, ఆంగ్ల అనువాదంలో వాటిని వక్రీకరించారని తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలపైన మాత్రమే విమర్శలు చేశానని, ఆ పార్టీ నాయకుల వ్యక్తిగత అంశాలపై విమర్శలు చేయలేదని పేర్కొన్నారు. పరిశీలించిన ఈసీ.. కేసీఆర్ ఎన్నికల నిబంధనల్ని ఉల్లంఘించారని పేర్కొంటూ తాజాగా ఆయన ప్రచారంపై 48 గంటల నిషేధాన్ని విధించింది. ఎన్నికలకు సంబంధించి కేసీఆర్ ఎటువంటి బహిరంగ సభలు, ఊరేగింపులు, ర్యాలీలు, ప్రదర్శనలు, ఇంటర్వ్యూలలో పాల్గొనరాదని, ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియాలో బహిరంగ ప్రకటనలు చేయరాదని ఈసీ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. సిరిసిల్లలో మీడియా సమావేశంలో కాంగ్రెస్‌పై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రస్థాయిలో ఖండిస్తున్నట్లు, మందలిస్తున్నట్లు ఈసీ పేర్కొంది. కాంగ్రెస్‌పై అవమానకరరీతిలో వ్యాఖ్యలు చేశారని మండిపడింది. ఎన్నికల నియమావళిని, కమిషన్ ఆదేశాలు, సూచనలను కేసీఆర్ ఉల్లంఘించారని తెలిపింది. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కూడా నిబంధనలను ఉల్లంఘించారని హెచ్చరించామని, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని సలహా ఇచ్చామని కేసీఆర్‌కు ఈసీ గుర్తు చేసింది.



కేసీఆర్‌కు ఈసీ ఉత్తర్వులు అందించి సంతకాలు తీసుకుంటున్న అధికారి

ఇదెక్కడి అరాచకం?: కేటీఆర్

కేసీఆర్‌పై ఈసీ నిషేధాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. 'తెలంగాణ ఆవాజ్ అయిన కేసీఆర్ గొంతుపై నిషేధమా? ఇదెక్కడి అరాచకం? మోదీ విద్వేష వ్యాఖ్యలు ఈసీకి వినిపించలేదా?' అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ చేస్తున్న వ్యాఖ్యలపై వేలాది మంది పౌరులు ఫిర్యాదులు చేసినా చర్యలు లేవని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌పైనా విమర్శలు గుప్పిస్తూ.. రేవంత్ బూతులు ఈసీకి ప్రవచనాల్లా అనిపించాయా? అని పేర్కొన్నారు. 'ఇది బడే భాయ్.. చోటే భాయ్ కలిసి చేసిన కుట్ర కాదా? కేసీఆర్ పోరుబాట చూసి బీజేపీ, కాంగ్రెస్ ఎందుకు వణుకుతున్నాయి? మీ అహంకారానికి అధికార దుర్వినియోగానికి తెలంగాణ ప్రజలు తగిన సమాధానం చెబుతారు' అని కేటీఆర్ హెచ్చరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందిస్తూ.. కేసీఆర్ బస్సు యాత్రకు బయల్దేరితే కాంగ్రెస్, బీజేపీ నాయకులు గజ గజ వణుకుతున్నారని విమర్శించారు. మోదీ మతవిద్వేషాలు రెచ్చగొడితే, రేవంత్‌రెడ్డి బూతులు మాట్లాడితే ఈసీకి వినిపించవా అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను రెండురోజులు ఆపినంత మాత్రాన ఏమవుతుందని, ఆయన ప్రజల గుండెల్లో ఉంటారని పేర్కొన్నారు.

కేసీఆర్ వ్యాఖ్యలు ఇవీ..

గత నెల 5వ తేదీన.. ఎండిన పంటల పరిశీలన కోసం కరీంనగర్, సిరిసిల్ల ప్రాంతాల్లో కేసీఆర్ బస్సు యాత్ర నిర్వహించారు. అనంతరం సిరిసిల్లలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించి.. ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు గుప్పించారు. ఆ వ్యాఖ్యలు ఇవీ..

'ప్రస్తుత ప్రభుత్వం తెలివితక్కువ, అసమర్థ, అవివేక, అర్భక, చవట విధానాల వల్లనే నాశనానికి వచ్చింది; నీటి నిల్వ సామర్థ్యం తెల్వని లత్కోర్‌లు, చవట దద్దమ్మలు రాజ్యమేలుతున్నరు కాబట్టి ఈ పరిస్థితి వచ్చింది; తప్పించుకోవాలని అనుకుంటే ప్రజలు వీపు విమానం మోత మోగిస్తారు. వదిలిపెట్టరు; కాళేశ్వరం పంప్‌లను ఆన్ చేసి వరదకాలువకు నీళ్లు వదిలారని సిగ్గులేకుండా ముఖ్యమంత్రి మాట్లాడుతాడు; సిరిసిల్లలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యేటట్లు ఉన్నాయి. ఓ కాంగ్రెసోడు నిరోధ్‌లు, పాపుడాలు అమ్ముకుని బతకమని అంటడు. నిరోధ్‌లు అమ్ముకొని బతకాల్నా కుక్కల కొడుకుల్లారా? చేనేత కార్మికుల మనోభావాలు దెబ్బతీస్తారా; చేనేత కార్మికులను మొన్నటిదాకా దొబ్బితిన్నరు.. దోచుకుతిన్నరని అంటారా దొంగ నా కొడుకుల్లారా; రూ.500 బోనస్ ఇవ్వకపోతే గొంతు కొరికి చంపుతాం.'

రేవంత్‌పై ఎందుకు నిషేధం పెట్టలే?

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రంలో వడ్లు కొనడం లేదనే ఆవేదనతో ఓ రైతు గుండె ఆగి మృతి చెందాడని చెప్పారు. ఉచిత బస్సు పథకం మంచిదే అయినప్పటికీ ఆ పథకం, ఆటోవాలాల పొట్ట కొట్టిందని.. వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఆటోవాలాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప మిగిలిన గ్యారెంటీల్లో ఏదీ అమలవడం లేదని పేర్కొన్నారు. బుధవారం మహబూబాబాద్‌లో కేసీఆర్ బస్సుయాత్ర, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. రాత్రి 7.10కు మానుకోట జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ సెంటర్‌కు ఆయన చేరుకున్నారు. కేసీఆర్ ప్రచారంపై ఈసీ నిషేధం విధించిన నేపథ్యంలో ఆయన రాత్రి 7:20 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించారు. 14 నిమిషాల పాటు ప్రసంగించారు. మారుమూల గిరిజన ప్రాంతం కావడంతో అభివృద్ధి చేసేందుకు మహబూబాబాద్‌ను జిల్లాగా తాను ఏర్పాటు చేస్తే, ఈ జిల్లాను రేవంత్ రెడ్డి రద్దు చేస్తానని అంటున్నారని ఆరోపించారు. జిల్లాగా మహబూబాబాద్ ఉండాలా? పోవాలా? అని ప్రజలను ప్రశ్నించారు. రేవంత్ మెడలు వంచాలంటే మహబూబాబాద్ నుంచి మాలోతు కవితను గెలిపించాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం గోదావరి నీళ్లను తీసుకుపోతుందని, అయినా రేవంత్‌రెడ్డి మౌనంగా ఉన్నారని విమర్శించారు. అధికారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని గుర్తుచేశారు. మరి.. ఆ డబ్బు ఖాతాలో పడిందా? వరి పంటపై రూ.500 బోనస్‌గా వచ్చిందా? అని ప్రశ్నించారు. కాగా మంగళవారం రాత్రి కొత్తగూడెం కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న అనంతరం కేసీఆర్, అక్కడి సింగరేణి అతిథి గృహంలో బస చేశారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు పార్టీ నేత వనమా వెంకటేశ్వరరావు నివాసానికి వెళ్లారు. బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం చురుగ్గా పనిచేయాలని వనమాను కేసీఆర్ కోరారు.

బీజేపీని ఓడించడమే ఏకైక లక్ష్యం కావాలి: కోదండరాం



మెదక్, మే 1: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే అనేక ఉపద్రవాలు వస్తాయని, ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే ప్రజల ఏకైక లక్ష్యం కావాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. బుధవారం మెదక్‌లో ప్రజాసంఘాలతో కలిసి ఎన్నికల్లో అనుసరించాల్సిన పద్ధతులపై కోదండరాం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసలు ఎన్నికల అభ్యర్థి ఎవరనేది కూడా పట్టించుకోలేని స్థితికి ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు చేరుకున్నాయని, బీజేపీని ఎదురిస్తున్న పార్టీకి అభ్యర్థితో సంబంధం లేకుండా ప్రజలు ఓటేయాలని కోరారు. తెలంగాణ ప్రజల ఆగ్రహానికి కేసీఆర్ తలొగ్గక తప్పలేదని, రాజ్యాంగ పరిరక్షణకు ఈ ఎన్నికల్లో బీజేపీని కూడా ఓడిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాసంఘాలతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. అమిత్‌షా డీప్‌ఫేక్ వీడియో కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పోలీసులు సమన్లు పంపించడంలో కేంద్రం అణిచివేత ధోరణి కనిపిస్తోందన్నారు.



అబ్ కీ బార్?

ముక్కోణపు పోరుగల్లు!

వరంగల్‌లో ప్రధాన పార్టీల త్రిముఖ పోరు.. ముగ్గురు అభ్యర్థులకూ ఎంపీ ఎన్నిక తొలిసారే

- 36 ఏళ్ల తరువాత మహిళకు చాన్సిచ్చిన కాంగ్రెస్
- 'హ్యాట్రిక్' పట్టు సడలవద్దని బీఆర్ఎస్ ఆరాటం
- 40 ఏళ్ల తరువాత గట్టి పోటీ ఇస్తున్న బీజేపీ
- అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు చోట్ల గెలిచిన కాంగ్రెస్





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఉద్యమాల గడ్డ.. పోరాటాల ఖిల్లా. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన నేల. పీవీ నర్సింహారావు వంటి రాజకీయ ఉద్దండుణ్ని పార్లమెంటుకు పంపించిన ప్రాంతం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం.. ఇప్పుడు ముక్కోణపు పోటీకి వేదికైంది. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులూ తొలిసారి పార్లమెంటు బరిలో నిలవడంతో ఓరుగల్లులో ఆసక్తికర పోరు సాగుతోంది. పైగా.. బీఆర్ఎస్ అభ్యర్థితోపాటు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు కూడా గులాబీ పార్టీ నుంచి ఆయా పార్టీలోకి వెళ్లినవారే కావడంతో ఇక్కడ ఎన్నిక ప్రాధాన్యం సంతరించుకుంది.

నాటకీయ పరిణామాల మధ్య కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికైన డాక్టర్ కడియం కావ్య తొలిసారిగా ఎన్నికల్లో పోటీకి దిగుతున్నారు. రాజకీయాలకు ఆమె కొత్త అయినా.. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వారసురాలిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఇక బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు గత రెండు పర్యాయాలు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం ఉంది. 2014, 2018లో బీఆర్ఎస్ తరఫున వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలిచారు. ఇటీవల బీజేపీలో చేరి ఎంపీగా పోటీ చేస్తున్నారు. కాగా, బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ హనుమకొండ జడ్పీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులూ స్థానిక సమస్యలే ప్రధాన ఎజెండాగా ప్రచారం చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకం..

వరంగల్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరింటిని కాంగ్రెస్సే గెలుచుకుంది. బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఒక్క ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో వరంగల్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ తప్పక గెలవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. దీంతో వ్యూహాత్మకంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకే కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. ఈ స్థానం నుంచి 36 ఏళ్ల తరువాత తొలిసారిగా మహిళా అభ్యర్థిని బరిలోకి దించింది. ఇక్కడి నుంచి 1984లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ టి.కల్పనాదేవి ఎంపీగా విజయం సాధించారు. ఆ తరువాత 1998లో ఆమె కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ తరఫున పోటీ చేశారు. కానీ, టీడీపీ అభ్యర్థి చందులాల్ చేతిలో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ మహిళకు వరంగల్ లోక్‌సభ టికెట్ కేటాయించలేదు. మళ్లీ ఇప్పుడు డాక్టర్ కావ్యకు టికెట్ ఇచ్చింది. కాగా, వరంగల్ సీటుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే వరంగల్ నగరంలో అండర్ డ్రెయినేజీతో పాటు వరంగల్‌లో ఎయిర్‌పోర్టును, మెగా టెక్స్‌టైల్ పార్కును అభివృద్ధి చేస్తామని, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీలోకి నేతల వలసలతో మరింత బలపడ్డామని కాంగ్రెస్ అంచనా వేస్తోంది.

40 ఏళ్ల తరువాత బీజేపీ ఆశలు

బీజేపీ తెలంగాణలో గెలుస్తామని అంచనా వేస్తున్న సీట్లలో వరంగల్ ఒకటిగా చెప్పుకొంటున్నారు. 1984లో ఇక్కడి (హనుమకొండ) నుంచి చందుపట్ల జంగారెడ్డి గెలిచాక.. మళ్లీ ఏ ఎన్నికల్లోనూ బీజేపీ గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. 40 ఏళ్ల తరువాత మళ్లీ ఇప్పుడు బీజేపీకి గెలుపు ఆశలు చిగురించాయి. కాగా, తనను గెలిపిస్తే.. వరంగల్ నగరానికి ఎయిర్‌పోర్టును నెలరోజుల్లో తీసుకువస్తానని, నగరంలో అండర్ డ్రెయినేజీకి, ఐటీ పార్కులు, స్మార్ట్ సిటీ, హెరిటేజ్ సిటీగా అభివృద్ధి చేయటంతో పాటు మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు తీసుకువస్తానని, భూపాలపల్లికి రైల్వేలైన్ ఏర్పాటు చేయిస్తాననే హామీలిస్తూ అరూరి రమేశ్ ప్రజల్లోకి వెళుతున్నారు.

పట్టు సడలకుండా బీఆర్ఎస్ వ్యూహం..

తెలంగాణ ఉద్యమ సమయం నుంచి వరంగల్ ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవగా, ఆ తరువాత 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపొందారు. అనంతరం 2015 ఉప ఎన్నికలు, 2019 ఎన్నికల్లో పసునూరి దయాకర్ బీఆర్ఎస్ తరఫున గెలిచారు. దీంతో బీఆర్ఎస్ ఇక్కడ హ్యాట్రిక్ కొట్టింది. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడాక.. కీలక నేతలు పార్టీని వీడటం, అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్య కూడా కాంగ్రెస్‌లో చేరడంతో గులాబీ శ్రేణులు అయోమయానికి గురయ్యాయి. ఈ నేపథ్యంలో పార్టీ పట్టు సడలకుండా మాజీ మంత్రి ఎర్రబెల్లికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి, హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌ను బీఆర్ఎస్ అభ్యర్థిగా నిలిపారు. నాలుగోసారి కూడా గులాబీ జెండా ఎగురవేస్తామనే ధీమాతో ఉన్నారు.

		ఇతరులు
పురుషులు	9,85,421	
మహిళలు	9,28,648	397

మొత్తం ఓటర్లు 18,24,466

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

పార్టీ	సెగ్మెంట్లు
కాంగ్రెస్	వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి, పాలకుర్తి, వర్ధన్నపేట
బీఆర్ఎస్	స్టేషన్‌ఘనపూర్

2019 లోక్‌సభ ఎన్నికల్లో..

పార్టీ	అభ్యర్థి	ఓట్లు
బీఆర్ఎస్	పసునూరి దయాకర్	6,12,498
కాంగ్రెస్	దొమ్మాటి సాంబయ్య	2,62,200
బీజేపీ	చింతా సాంబమూర్తి	83,777



2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?

పార్టీ	ఓట్లు
కాంగ్రెస్	6,61,545
బీఆర్ఎస్	5,02,578
బీజేపీ	1,56,353



తన మామ రామసహాయం రఘురాంరెడ్డికి ఓటు వేయాలని కోరుతున్న ఆశ్రిత

మామ కోసం కోడలు

- ఖమ్మంలో హీరో వెంకటేశ్ కుమార్తె ఆశ్రిత ఎన్నికల ప్రచారం
- బరిలో ఆమె మామ రామసహాయం రఘురాంరెడ్డి

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 1: ఖమ్మం లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న రామసహాయం రఘురాంరెడ్డి విజయం కోసం ఆయన పెద్ద కోడలు, హీరో వెంకటేశ్ కుమార్తె ఆశ్రిత బుధవారం ప్రచారం చేశారు. ఖమ్మంలోని పోలీసు హౌసింగ్ కాలనీలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆశ్రిత పాల్గొని తన మామగారైన రఘురాంరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాము ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బేబి స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుండగా... ఈ నెల 7న వియ్యంకుడి కోసం హీరో వెంకటేశ్ సైతం ఖమ్మంలో ప్రచారం చేయనున్నారు.



బజ్జీలు మీకు.. ఓట్లు నాకు!

కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ప్రచారంలో భాగంగా.. బజ్జీలు వేశారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కార్మిక క్షేత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలసి పాదయాత్ర చేస్తూ ఓ హోటల్‌లో బజ్జీలు వేసి ఓట్లు అభ్యర్థించారు.

- ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు

సర్వం సిద్ధం!

525 మంది అభ్యర్థులు, 3,32,32,318 మంది ఓటర్లు

3, 4వ తేదీల్లో హోం ఓటింగ్: సీఈఓ వికాస్‌రాజ్

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అంతా సిద్ధం చేసుకున్నామని ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యల్లో భాగంగా ఎన్నికల విధుల్లో 155 కంపెనీల కేంద్ర బలగాలు పాల్గొంటాయని చెప్పారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 35,809 పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశామని, వాటిలో 2,79,519 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1950కు ఇప్పటి వరకు 1,257 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా హోం ఓటింగ్ ప్రక్రియను ఈ నెల 3, 4వ తేదీల్లో నిర్వహిస్తామని చెప్పారు. అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికి తిరిగి ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్నారన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని, ప్రజలందరూ తమకు ఇచ్చే ఓటరు స్లిప్పులను ఇన్విటేషన్‌గా భావించి అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలని సీఈఓ వికాస్‌రాజ్ పిలుపునిచ్చారు.



ఓటర్ల వివరాలు

పురుషులు	ట్రాన్స్‌జెండర్‌లు
1,65,28,366	2,760
మహిళలు:	**మొత్తం ఓటర్లు**
1,67,01,192	3,32,32,318

ఈవీఎంలు

కంట్రోల్ యూనిట్లు 44,906

బ్యాలెట్ యూనిట్లు 1,09,941

వీవీప్యాట్‌లు 50,135



భద్రతా సిబ్బంది

155 కంపెనీల కేంద్ర బలగాలు

60,000 మంది పోలీసులు (తెలంగాణ, ఇతర రాష్ట్రాలు)

అభ్యర్థులు		పోలింగ్ కేంద్రాలు	
మొత్తం:	525	మొత్తం కేంద్రాలు:	35,809
పార్టీల నుంచి	240	క్రిటికల్ కేంద్రాలు:	9,900
ఇండిపెండెంట్‌లు	285	ఎన్నికల సిబ్బంది:	2,79,519

అత్యధిక, అత్యల్ప అభ్యర్థులున్న నియోజకవర్గాలు

సికింద్రాబాద్: 45, ఆదిలాబాద్: 12

ప్రచారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనాసక్తి?

జీహెచ్ఎంసీలో కొందరి నామమాత్రపు ప్రచారం.. క్షేత్రస్థాయి పర్యటనలూ అంతంతే

- అభ్యర్థులు వచ్చినప్పుడే వారి వెంట
- పార్టీ క్యాడర్‌కూ దిశానిర్దేశం కరువు
- ప్రత్యర్థులకు లోపాయికారీ మద్దతు?
- అధికార పార్టీతో టచ్‌లో పలువురు!
- సికింద్రాబాద్, మల్కాజిగిరి స్థానాల పరిధిలో బీఆర్ఎస్‌లో అయోమయం

హైదరాబాద్ సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఓవైపు పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గరపడుతోంది. ప్రచారానికి మరో పది రోజుల సమయం మాత్రమే ఉంది. మరోవైపు ప్రత్యర్థి పార్టీలు ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. అయినా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇల్లు దాటి బయటకు రావడంలేదు. ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రజల్లోకి వెళ్లడంలేదు. అభ్యర్థి తమ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోకి వచ్చినప్పుడు మాత్రమే వారి వెంట కనిపిస్తున్నారు తప్ప.. నియోజకవర్గంలో సొంతంగా ప్రచారం చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నాయి. ఎమ్మెల్యే లేకుండా తాము మాత్రమే ప్రచారం చేస్తే ఆయనకు ఎక్కడ కోపం వస్తుందోనని వారు కూడా ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఈ పరిణామాలు పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఒక్కో పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండడం, ప్రతి ప్రాంతంలో తాము పర్యటించే అవకాశం లేని దృష్ట్యా ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ ప్రచారం నిర్వహించాలని ఎంపీ అభ్యర్థులు కోరుతున్నారు. పార్టీ అగ్రనేతలు కూడా ప్రచారం విస్తృతం చేయాలని ఎమ్మెల్యేలను, కార్పొరేటర్లను ఆదేశించారు. ఒక్కో ఓటు ఎంతో కీలకమని, ప్రతి కార్యకర్త శ్రమించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల సూచించారు. అయినా కొందరు ప్రజాప్రతినిధులు, నేతల నుంచి ఆశించిన స్పందన రావడం లేదు. అయితే గ్రేటర్ పరిధిలోని కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. వారు లోపాయికారీగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులకు మద్దతిస్తున్నారని, బీఆర్ఎస్ అభ్యర్థులకు సహకరించకుండా క్యాడర్‌ను కూడా కట్టడి చేస్తున్నారనే చర్చ నడుస్తోంది.

తమకేమీ పట్టనట్లుగా..

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఓ ఎమ్మెల్యే స్థానికంగా ప్రచారం నిర్వహించడం లేదు. ఆయనకు స్థానిక కార్పొరేటర్లతో వైరం ఉండడంతో.. వారిని కూడా ప్రచారానికి ఆహ్వానించడం లేదు. క్యాడర్‌కూ ఎలాంటి సూచనలు చేయడం లేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బూత్‌ల వారీగా నమ్మకస్తులకు బాధ్యతలు అప్పగించిన ఈ ఎమ్మెల్యే.. ఇప్పుడు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇదే లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మరో సెగ్మెంట్‌లో మొన్నటి వరకు మౌనంగా ఉన్న ఓ ఎమ్మెల్యే మాత్రం.. ఒకటి, రెండు రోజులుగా ప్రచారం ప్రారంభించారు. సాయంత్రం వేళల్లో పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. కానీ, స్థానిక కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నేతలను ఆయన కలుపుకొని పోవడంలేదన్న విమర్శలున్నాయి. ఇక ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగడంతో ఆ సెగ్మెంట్‌లో గులాబీ పార్టీని ముందుండి నడిపించేవారు కరువయ్యారు. ఒకరిద్దరు నేతలు సమన్వయం చేసే ప్రయత్నం చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో కొంత గ్యాప్ కనిపిస్తోంది. ఇక్కడ ప్రచారంపైనా ఆ ప్రభావం ఉంటోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎంపీ అభ్యర్థి వస్తేనే..

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం పరిధిలోని ఓ ఎమ్మెల్యే.. ఎంపీ అభ్యర్థి వస్తే తప్ప తన సెగ్మెంట్‌లో ప్రచారం చేయడంలేదు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెండు, మూడు సమావేశాలు నిర్వహించడం మినహా ఇప్పటివరకు ఇంటింటి ప్రచారం ప్రారంభించలేదు. ఈ నియోజకవర్గంలో కార్పొరేటర్లు మాత్రమే ప్రచారం చేస్తున్నారు. మరో అసెంబ్లీ సెగ్మెంట్‌లో స్థానిక ఎమ్మెల్యే కినుక వహించారు. పార్టీ కార్యకర్తలు, కాలనీ సంఘాలు, బస్తీ సంఘాలతో సమావేశాలు తప్ప.. క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించడం లేదు. శాసనసభ ఎన్నికల్లో అందరినీ కలుపుకొని పోయిన ఈ ఎమ్మెల్యే.. ఇప్పుడు కొందరు పార్టీ నేతలను దూరం పెట్టారని అంటున్నారు.



ప్రత్యర్థికి లోపాయికారీగా!

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొందరు అధికార కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారం మొన్నటివరకు జరిగింది. అయితే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి హస్తం గూటికి చేరేందుకు సానుకూలత వ్యక్తం చేసినా.. చివరి నిమిషంలో యూ టర్న్ తీసుకున్నారు. ఆ తరువాత కూడా కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేల చేరికలు చోటుచేసుకోలేదు. అయితే పార్లమెంట్ ఎన్నికల అనంతరం పార్టీ మారాలన్న ఉద్దేశంతో కొందరు ఎమ్మెల్యేలు తాత్కాలికంగా చేరికను వాయిదా వేసుకున్నట్టు తెలిసింది. దీంతో వీరు ప్రస్తుత ఎన్నికల్లో ఏ పార్టీకి పని చేస్తున్నారన్నది చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్న ముగ్గురు, నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లోపాయికారీగా ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతునిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఒకరు ప్రత్యర్థి పార్టీ అభ్యర్థితో ఓ హోటల్‌లో సమావేశమైనట్టు చెబుతున్నారు. మరో ఎమ్మెల్యే కూడా సదరు అభ్యర్థితో టచ్‌లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. కాగా, ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఓ ఎమ్మెల్యే కూడా ప్రచారం విషయంలో అంటీముట్టనట్టు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందంటున్నారు.

బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే

- నామాను గెలిపిస్తే కేంద్ర మంత్రిని చేస్తానని కేసీఆర్ చెప్పడమే నిదర్శనం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్య
- టీడీపీ కార్యాలయానికి మంత్రి, నేతలు
- ఎన్నికల్లో సహకరించాలని వినతి

నేలకొండపల్లి/ఖమ్మం మామిళ్లగూడెం, మే 1: కేసీఆర్.. తెలంగాణకు శనిలా దాపురించాడని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఖమ్మంలో నామా నాగేశ్వరరావును గెలిపిస్తే కేంద్రమంత్రిని చేస్తానని కేసీఆర్ చెప్పడం చూస్తే.. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉందని చెప్పకనే చెప్పినట్టుందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని చెప్పడానికి ఈ వ్యాఖ్యలే నిదర్శనమని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో బుధవారం నిర్వహించిన రోడ్ షోలో ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాయమాటలతో రెండు సార్లు అధికారం చేపట్టిన కేసీఆర్.. ధనిక రాష్ట్రాన్ని రూ.7లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. రాముడి పేరు చెప్పి, నాలుగు అక్షింతలు పంచి మూడో సారీ ప్రధాని కావాలని మోదీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు తెలివిగల వారని, ఖమ్మం ప్రజలు ఇంకా చైతన్యవంతులని, ఎవరిని గెలిపించుకోవాలో ఇక్కడి ప్రజలకు బాగా తెలుసన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు రాష్ట్రంలో కనీసం 15స్థానాల్లోనైనా కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు టీడీపీ స్థానిక నాయకులు సహకరించాలని పొంగులేటి కోరారు. రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి ఖమ్మంలోని టీడీపీ కార్యాలయానికి వెళ్లిన ఆయన.. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని కోరుతూ టీడీపీ నేత కేతినేని హరీశ్ చేపట్టిన పోస్టు కార్డుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించేందుకు టీడీపీ కార్యకర్తలు విశేష కృషి చేశారని ప్రశంసించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. అయితే, టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు తాము పని చేస్తామని ఆ పార్టీ నేతలు వాసిరెడ్డి రామనాథం, కేతినేని హరీశ్ చెప్పారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మంత్రి పొంగులేటి, రామసహాయం రఘురాంరెడ్డి

2.10 లక్షల కోట్లు

జీఎస్‌టీ వసూళ్లలో సరికొత్త రికార్డు

- తొలిసారిగా రూ.2 లక్షల కోట్ల మైలురాయికి..
- ఆంధ్రప్రదేశ్‌లో రూ.4,850 కోట్లు

తెలంగాణలో రూ.6,236 కోట్ల వసూళ్లు



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) ఆదాయంలో సరికొత్త రికార్డు నమోదైంది. ఏప్రిల్ నెలలో జీఎస్‌టీ స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదిక 12.4 శాతం వృద్ధితో జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.2.10 లక్షల కోట్లకు పెరిగాయి. 2017 జూలైలో జీఎస్‌టీ చట్టాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి నెలవారీ వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయిని దాటడం ఇదే తొలిసారి. ఆర్థిక వ్యవస్థ మరింత బలం పుంజుకోవడంతో దేశీయంగా ఆర్థిక లావాదేవీలు, దిగుమతులు పెరగడం ఇందుకు దోహదపడిందని ఆర్థిక శాఖ పేర్కొంది. ఈ ఏడాది మార్చిలో జీఎస్‌టీ ఆదాయం రూ.1.78 లక్షల కోట్లుగా, 2023 ఏప్రిల్‌లో రూ.1.87 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కాగా, గత నెలలో తెలంగాణ జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 11 శాతం వృద్ధితో రూ.6,236 కోట్లకు, ఆంధ్రప్రదేశ్‌లో 12 శాతం వృద్ధితో రూ.4,850 కోట్లకు పెరిగాయి.

ఆర్థికం జోరు, సమర్థవంతమైన పన్ను వసూళ్లతో ఈ రికార్డు సాధ్యమైందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ రికార్డు సాధనలో పన్ను అధికారుల కృషిని ఆమె కొనియాడారు. కాగా, ఆర్థిక వ్యవస్థలో చురుకుగా సాగుతున్న వ్యాపార కార్యకలాపాలు, పన్ను వసూళ్లు పెంచేందుకు అధికారులు చేపడుతున్న చర్యలతోపాటు పన్ను చెల్లింపుల విషయంలో వ్యాపారుల నిబద్ధతకు ఇది సంకేతమని పన్ను నిపుణులు పేర్కొన్నారు. పెరిగిన పన్ను వసూళ్లు భవిష్యత్ జీఎస్‌టీ సంస్కరణలపై అంచనాలను పెంచనున్నాయని వారన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చే కొత్త ప్రభుత్వం పన్ను రేట్లను హేతుబద్ధీకరించడంతోపాటు విమాన ఇంధనం (ఏటీఎఫ్), సహజ వాయువు వంటి వాటిని జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చే అవకాశాలున్నాయని వారు అభిప్రాయపడ్డారు.

ఆర్థిక శాఖ బుధవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గతనెల మొత్తం జీఎస్‌టీ ఆదాయంలో సెంట్రల్ జీఎస్‌టీ వసూళ్లు రూ.43,846 కోట్లు, స్టేట్ జీఎస్‌టీ వసూళ్లు రూ.53,538 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) రాబడి రూ.99,623 కోట్లుగా ఉంది. సెస్సు రూపంలో మరో రూ.13,260 కోట్లు వసూలైంది. సాధారణ సెటిల్‌మెంట్ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ఐజీఎస్‌టీ రాబడిలో రూ.50,307 కోట్లను సెంట్రల్ జీఎస్‌టీలో, మరో రూ.41,600 కోట్లను స్టేట్ జీఎస్‌టీలో జమ చేసింది. తదనంతరం, సెంట్రల్ జీఎస్‌టీ రూ.94,153 కోట్లకు, స్టేట్ జీఎస్‌టీ రూ.95,138 కోట్లకు చేరుకుంది. రాష్ట్రాలకు ఐజీఎస్‌టీ బకాయిలేమీ పెండింగ్‌లో లేవని సీతారామన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రిఫండ్లను మినహాయించగా, గత నెలకు జీఎస్‌టీ నికర వసూళ్లు రూ.1.92 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఇది 15.5 శాతం అధికం. ప్రస్తుతం జీఎస్‌టీ నెట్‌వర్క్‌లో 1.45 కోట్ల మంది రిజిస్టర్డ్ పన్ను చెల్లింపుదారులున్నారు.

ఫెడ్ రేట్లు యథాతథం

న్యూయార్క్: అమెరికన్ సెంట్రల్ బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా కొనసాగించింది. ద్రవ్యోల్బణాన్ని 2 శాతానికి తగ్గించే లక్ష్యంలో పురోగతి లేకపోవడంతో 5.25-5.50 శాతంగా ఉన్న వడ్డీరేట్ల శ్రేణిని అలాగే కొనసాగించాలని నిర్ణయించినట్లు బుధవారం విడుదల చేసిన ద్రవ్యపరపతి విధాన సమీక్ష ప్రకటనలో ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఎంఓసీ) పేర్కొంది. ద్రవ్యోల్బణం క్రమంగా 2 శాతానికి తగ్గుతూ వస్తోందన్న విశ్వాసం బలపడే వరకు వడ్డీరేట్లను తగ్గించడం సరికాదని కమిటీ అభిప్రాయపడింది. గత ఏడాది జూలై నుంచి వడ్డీరేట్లు ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. కమిటీ ప్రస్తుత వ్యాఖ్యలను బట్టి చూస్తే, వడ్డీరేట్ల తగ్గింపు ప్రక్రియ అంచనాల కంటే జాప్యం కావచ్చని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆధార్ హౌసింగ్ నుంచి రూ.3,000 కోట్ల ఐపీఓ

న్యూఢిల్లీ: ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ బ్లాక్‌స్టోన్ పెట్టుబడి పెట్టిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ రూ.3,000 కోట్ల సమీకరణ కోసం ఈ నెల 8న ఐపీఓకు వస్తోంది. ఇందులో రూ.1,000 కోట్లు కొత్తగా జారీ చేసే షేర్ల ద్వారా, మరో రూ.2,000 కోట్లు బ్లాక్‌స్టోన్ అనుబంధ సంస్థ బీసీపీ టాప్కో షేర్ల విక్రయం ద్వారా సమీకరిస్తారు. ఈ నెల 10న ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. కొత్తగా జారీ చేసే షేర్ల ద్వారా సమీకరించే రూ.1,000 కోట్లలో రూ.750 కోట్లను కంపెనీ రుణ వితరణ కోసం వినియోగించనుంది. ఈ ఇష్యూ ప్రైస్ బ్యాండ్‌ను ఇంకా ఖరారు చేయాల్సి ఉంది.

అంబుజా సిమెంట్స్ లాభం రూ.1,055.16 కోట్లు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌లోని అంబుజా సిమెంట్స్ మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికానికి అద్భుతమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి అనుబంధ కంపెనీలతో కలిసి కంపెనీ రూ.1,525.78 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.763.30 కోట్లతో పోలిస్తే ఇది రూ.762.48 కోట్లు ఎక్కువ. ఇదే కాలంలో కంపెనీ నిర్వహణ ఆదాయం రూ.7,965.98 కోట్ల నుంచి రూ.8,893.99 కోట్లకు, స్థూల ఆదాయం రూ.9,127.45 కోట్లకు చేరాయి. గత ఏడాది ఆఖరి త్రైమాసికంలో కొనుగోలు చేసిన సంఘీ ఇండస్ట్రీస్ ఆర్థిక ఫలితాలతో కలిసి మార్చి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు విడుదల చేసినట్టు అంబుజా సిమెంట్ తెలిపింది. ఏసీసీ, సంఘీ ఇండస్ట్రీస్‌ను తీసివేస్తే అంబుజా సిమెంట్ నికర లాభం మార్చి త్రైమాసికంలో రూ.502.40 కోట్ల నుంచి రూ.532.29 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ స్టాండ్ అలోన్ నిర్వహణ ఆదాయం రూ.4,780.32 కోట్లకు చేరింది. ఆర్థిక ఫలితాలు బాగుండడంతో రూ.2 ముఖ విలువ గత ఒక్కో షేరుపై వాటాదారులకు రూ.2 చొప్పున డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

నాలుగేళ్లలో వేదాంతా రూ.1.66 లక్షల కోట్ల పెట్టుబడి

ముంబై: మైనింగ్ దిగ్గజం అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంతా గ్రూప్ భారీ పెట్టుబడి ప్రణాళికను ప్రకటించింది. వచ్చే నాలుగేళ్లలో భారత్‌లోని గ్రూప్‌నకు చెందిన అన్ని వ్యాపారాల్లో 2,000 కోట్ల డాలర్ల (రూ.1.66 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు అగర్వాల్ తెలిపారు. ప్రధానంగా టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ గ్లాస్ వ్యాపారంతోపాటు గ్రూప్‌నకు చెందిన ఇతర కార్యకలాపాల్లో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే, స్టీల్ వ్యాపారాన్ని సరైన ధర లభిస్తేనే విక్రయిస్తామని, లేని పక్షంలోనూ ఆ వ్యాపారాన్ని కొనసాగిస్తామని అన్నారు.

రెండేళ్లలో రూ.5400 కోట్ల పెట్టుబడి : జేఎస్ఎల్

న్యూఢిల్లీ: సామర్థ్యాల విస్తరణతో పాటు వృద్ధికి దోహదపడే కంపెనీల కొనుగోళ్లపై రెండేళ్లలో రూ.5400 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ లిమిటెడ్ ప్రకటించింది. ఈ పెట్టుబడుల్లో సుమారు 90 శాతం అంతర్గత వనరుల ద్వారానే సమీకరించుకుంటామని కంపెనీ ఎండీ అభ్యుదయ్ జిందాల్ ప్రకటించారు. బుధవారం కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ స్టెయిన్‌లెస్ స్టీల్ పరిశ్రమలో ప్రపంచ ఆధిపత్యం సాధించడం లక్ష్యంగా ఈ పెట్టుబడులు పెడుతున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఒడిశాలోని జాజ్‌పూర్, హర్యానాలోని హిసార్‌లలో ఏడాదికి 30 లక్షల టన్నుల ఉమ్మడి సామర్థ్యం గల రెండు ప్లాంట్లు తమ చేతిలో ఉన్నాయని ఆయన తెలిపారు. వీటి మెల్టింగ్ సామర్థ్యాన్ని 42 లక్షల టన్నులకు పెంచాలన్నది తమ లక్ష్యమని, దానిపై రూ.700 కోట్లు ఖర్చు చేయనున్నామని అన్నారు. ఇది కాకుండా గుజరాత్‌లోని ముంద్రాలో పని చేస్తున్న 6 లక్షల టన్నుల వార్షిక సామర్థ్యం గల చెరోమెని స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 54 శాతం వాటాలను తాము కొనుగోలు చేయనున్నట్టు ఆయన తెలిపారు. దీనిపై రూ.1340 కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు.

అదానీ విల్మర్ లాభం రూ.156.75 కోట్లు

న్యూఢిల్లీ : అదానీ విల్మర్ కంపెనీ 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.156.75 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 67 శాతం ఎక్కువ. అయితే ఇదే సమయంలో కంపెనీ ఆదాయం మాత్రం రూ.14,185.68 కోట్ల నుంచి రూ.13,342.26 కోట్లకు పడిపోయింది. ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ ఆదాయం, నికర లాభం పడిపోయాయి. నికర లాభం రూ.582.12 కోట్ల నుంచి రూ.147.99 కోట్లకు, ఆదాయం రూ.59,148.32 కోట్ల నుంచి రూ.51,555.24 కోట్లకు పడిపోయాయి.

తగ్గిన అదానీ ఎనర్జీ లాభం

నాలుగో త్రైమాసికంలో అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.381.29 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోస్తే ఇది 13.26 శాతం తక్కువ. అయితే ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.3,494.84 కోట్ల నుంచి రూ.4,855.18 కోట్లకు పెరిగింది. అయినా ఖర్చులు పెరగడంతో కంపెనీ లాభాలకు గండి పడింది. ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ నికర లాభం రూ.1,280.60 కోట్ల నుంచి రూ.1,195.61 కోట్లకు పడిపోయింది. ఇదే సమంలో ఆదాయం మాత్రం రూ.13,840.46 కోట్ల నుంచి రూ.17,218.31 కోట్లకు చేరింది.

మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ లాభం రూ.6.42 కోట్లు

హైదరాబాద్: మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ మార్చి త్రైమాసికంలో రూ.42.24 కోట్ల ఆదాయంపై రూ.6.42 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే సమయంలో కంపెనీ రూ.43.27 కోట్ల ఆదాయంపై రూ.10.11 కోట్ల నికర లాభం ఆర్జించింది. వార్షిక ప్రాతిపదికన చూసినా కంపెనీలాభాలు తగ్గాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.29.26 కోట్లుగా ఉన్న నికరలాభం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.27.84 కోట్లకు తగ్గింది.

వాహన రంగం నీరసం

విక్రయాల్లో వృద్ధి అంతంతే

న్యూఢిల్లీ: దేశంలో వాహన విక్రయాలు ఏప్రిల్ నెలలో స్తబ్ధంగా ఉన్నాయి. ఆటోమొబైల్ రంగంలోకి కంపెనీలన్నీ కలిసి 3,38,341 లక్షల వాహనాలను విక్రయించాయి. గత ఏడాది ఇదే నెలలో అధిక సంఖ్యలో వాహనాలు అమ్ముడైన ప్రభావం (బేస్ ఎఫెక్ట్), ప్రస్తుత ఎన్నికల సీజన్ కారణంగా ఏప్రిల్‌లో ఆటో అమ్మకాలు నిస్తేజంగా సాగాయని అంటున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో 3,32,468 వాహనాలు అమ్ముడుపోయాయి. దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ 1.77 శాతం వృద్ధితో 1,37,952 కార్లు మాత్రమే విక్రయించగలిగింది. ప్రయాణికుల కార్లలో ద్వితీయ స్థానంలో ఉన్న హ్యుండై మోటార్స్ ఒక శాతం వృద్ధితో 50,201 కార్లు మాత్రమే విక్రయించింది. గత ఏడాది ఏప్రిల్‌లో మారుతి 1,37,320 వాహనాలు విక్రయించగా హ్యుండై 49,701 కార్లు విక్రయించింది. సాధారణంగా ఎన్నికల సీజన్‌లో మార్కెట్లు నిస్తేజంగానే ఉంటాయని, ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే మళ్లీ జోరందుకుంటాయని మారుతి సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ అన్నారు. జూన్ వరకు మార్కెట్ పరిస్థితి ఇలాగే ఉండవచ్చునని ఆయన తెలిపారు. సరఫరాల వ్యవస్థ మెరుగుపడిన కారణంగా పరిశ్రమలో ఆర్డర్ల సంఖ్య కూడా తగ్గిందని హ్యుండై మోటార్ ఇండియా సీఓఓ తరుణ్ గార్గ్ అన్నారు. రుతుపవనాలు ప్రోత్సాహకరంగా ఉంటే గ్రామీణ అమ్మకాలు పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

1 టాటా మోటార్స్ 47,883 వాహనాలు విక్రయించింది. గత ఏడాది ఏప్రిల్‌లో విక్రయించిన 47,007 యూనిట్లతో పోల్చితే అమ్మకాలు 2 శాతం పెరిగాయి.

1 టయోటా కిర్లోస్కర్ మోటార్ అమ్మకాలు 32 శాతం పెరిగి 15,510 యూనిట్ల నుంచి 20,494 యూనిట్లకు చేరాయి.

1 ఎంజీ మోటార్ ఇండియా రిటైల్ అమ్మకాలు 1.45 శాతం తగ్గి 4,485కి పడిపోయాయి. గత ఏడాది ఏప్రిల్ అమ్మకాలు 4,551 యూనిట్లు.

టూవీలర్ అమ్మకాలు: టీవీఎస్ మోటార్ 29 శాతం వృద్ధితో 3,01,449 వాహనాలు విక్రయించింది. రాయల్ ఎన్ ఫీల్డ్ అమ్మకాల్లో 9 శాతం వృద్ధిని నమోదు చేసింది. మొత్తం 75,038 వాహనాలు విక్రయించింది.



2026 నాటికి చిన్న కార్ల పునరుజ్జీవం

దేశీయ మార్కెట్లో 2026 చివరికి లేదా 2027 ప్రారంభ సమయానికి చిన్న కార్లకు తిరిగి డిమాండు ఏర్పడవచ్చునని మారుతి సుజుకీ భావిస్తోంది. ఒకప్పుడు భారత ఆటోమొబైల్ మార్కెట్‌ను ఏలిన చిన్న కార్ల విభాగం వాటా ఇప్పుడు 30 శాతం కన్నా దిగువకు పడిపోయింది. 2018-19 నుంచి తిరోగమనంలో ఉన్న ద్విచక్ర వాహనాల మార్కెట్ ఇప్పుడు పుంజుకున్నదని, అది చిన్న కార్ల మార్కెట్‌పై కూడా సానుకూల ప్రభావం చూపుతుందని పార్థో బెనర్జీ అభిప్రాయపడ్డారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	400	విజయవాడ	385
వరంగల్	402	గోదావరి	385
చిత్తూరు	478	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ.48	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129	గోదావరి	135
వరంగల్	129	విజయవాడ	135
కరీంనగర్	129	గుంటూరు	137
మహబూబ్‌నగర్	129	ఒంగోలు	137
కర్నూలు	129	చిత్తూరు	127
విశాఖపట్నం	127		

స్పోర్ట్స్

పాండ్యా సహా ముంబై జట్టుకు జరిమానా



లఖ్‌నవూ: పరాజయ పరంపరలో కొట్టుమిట్టాడుతున్న ముంబై ఇండియన్స్‌కు మరో షాక్. మంగళవారం లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్‌కు పాల్పడినందుకుగాను ఆ జట్టు సారథి హార్దిక్ పాండ్యాకు రూ. 24 లక్షలు, అలాగే జట్టులోని ప్రతి ఆటగాడికి రూ. 6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు. నిర్ణీత సమయానికి ఓవర్ల కోటా పూర్తి చేయకపోవడం ముంబైకిది రెండోసారి. అందుకే కెప్టెన్ హార్దిక్‌కు భారీ జరిమానా విధించినట్టు ఐపీఎల్ నిర్వాహకులు వెల్లడించారు.

స్మిత్, ఫ్రేజర్‌కు మొండిచేయి

మార్ష్‌కు కెప్టెన్సీ ● ఆస్ట్రేలియా టీ20 వరల్డ్ కప్ టీమ్

మెల్‌బోర్న్: టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్‌గా ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ వ్యవహరించనున్నాడు. 15 మంది సభ్యుల జట్టును క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) బుధవారం ప్రకటించింది. అయితే, స్టీవ్ స్మిత్‌తోపాటు ఐపీఎల్‌లో అదరగొడుతున్న జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌కు టీమ్‌లో చోటు దక్కలేదు.

ఆస్ట్రేలియా జట్టు: మార్ష్ (కెప్టెన్), అగర్, కమిన్స్, టిమ్ డేవిడ్, ఎలీస్, గ్రీన్, హాజెల్‌వుడ్, హెడ్, ఇంగ్లిస్, మ్యాక్స్‌వెల్, స్టార్క్, స్టొయినిస్, వేడ్, వార్నర్, జంపా.

అఫ్ఘాన్ వరల్డ్ కప్ జట్టులో 8 మంది ఐపీఎల్ ఆటగాళ్లు

కాబూల్: టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనే 15 మంది సభ్యుల అఫ్ఘానిస్థాన్ జట్టును ప్రకటించారు. రషీద్‌ఖాన్ సారథ్యంలోని ఈ జట్టులో ఏకంగా ఆరుగురు ఆల్‌రౌండర్లున్నారు. ఇక ఈ సీజన్ ఐపీఎల్‌లో ఆడుతున్న 8 మంది అఫ్ఘాన్ ఆటగాళ్లను మెగా టోర్నీ జట్టుకు ఎంపిక చేశారు.

అఫ్ఘానిస్థాన్ జట్టు: రషీద్ ఖాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్, అజ్మతుల్లా ఒమర్జాయ్, నజీబుల్లా జద్రాన్, ఇషాక్, మహ్మద్ నబీ, గుల్బదిన్ నైబ్, కరీమ్ జనత్, ఖరోతి, ముజీబుర్, నూర్ అహ్మద్, నవీనుల్ హక్, ఫరూఖి, ఫరీద్ అహ్మద్ మాలిక్.

చెన్నైపై పంజా

- అదరగొట్టిన రొసో, బెయిర్‌స్టో
- తిప్పేసిన బ్రార్, చాహర్
- 7 వికెట్లతో పంజాబ్ గెలుపు



రిలీ రొసో (43)

హర్‌ప్రీత్ బ్రార్ (4-0-17-2)

చెన్నై: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్.. చెపాక్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు చెక్ పెట్టింది. రిలీ రొసో (23 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 43), బెయిర్‌స్టో (30 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 46) బ్యాట్‌తో రాణించగా.. స్పిన్నర్లు హర్‌ప్రీత్ బ్రార్ (2/17), రాహుల్ చాహర్ (2/16) ఒక్క బౌండ్రీ కూడా ఇవ్వకుండా కట్టడి చేయడంతో.. బుధవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 7 వికెట్ల తేడాతో చెన్నైను ఓడించింది. తొలుత చెన్నై 20 ఓవర్లలో 162/7 స్కోరు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (62), రహానె (29) పోరాటం వృథా అయింది. మిచెల్ (1 నాటౌట్) స్థానంలో వన్‌డౌన్‌లో శివమ్ దూబేను బరిలోకి దించిన వ్యూహం బెడిసికొట్టగా.. ధోనీ (14) ఈ సీజన్‌లో తొలిసారి అవుటయ్యాడు. ఛేదనలో పంజాబ్ 17.5 ఓవర్లలో 163/3 స్కోరు చేసి నెగ్గింది. కర్రాన్ (26 నాటౌట్), శశాంక్ సింగ్ (25 నాటౌట్) రాణించారు. కేవలం 2 బంతులే బౌల్ చేసిన దీపక్ చాహర్ నొప్పితో మైదానం వీడడం కూడా చెన్నైను బలహీన పరిచింది. బ్రార్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' లభించింది.

ఒత్తిడి లేకుండా..: బెయిర్‌స్టో, రొసో దూకుడైన బ్యాటింగ్‌తో పంజాబ్ సునాయాసంగా గెలిచింది. ఛేదనలో తొలి ఓవర్‌లోనే 6,4 బాదిన ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (13) ఎక్కువసేపు క్రీజులో నిలవలేక పోయాడు. కానీ, మరో ఓపెనర్ బెయిర్‌స్టో, రొసో అటాకింగ్ గేమ్‌తో.. పవర్‌ప్లేలో పంజాబ్ 52/1తో నిలిచింది. 7వ ఓవర్‌లో జడేజా బౌలింగ్‌లో రెండు బౌండ్రీలు బాదిన బెయిర్‌స్టో.. అలీ వేసిన ఆ తర్వాతి ఓవర్‌లో 6,4తో బ్యాట్ ఝుళిపించాడు. స్పిన్నర్లు ప్రభావం చూపలేక పోవడంతో.. పేసర్ దూబేకు బంతిని అప్పగించడం ఫలితాన్నిచ్చింది. దూకుడుగా ఆడుతున్న బెయిర్‌స్టోను దూబే క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ, రొసో.. శశాంక్ సహకారంతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. 12వ ఓవర్‌లో శార్దూల్ బౌలింగ్‌లో రొసో 6,4తో 14 పరుగులు రాబట్టినా.. అదే ఓవర్‌లో బౌల్డ్ అయ్యాడు. ఈ దశలో జాగ్రత్తగా ఆడిన శశాంక్, కెప్టెన్ కర్రాన్.. నాలుగో వికెట్‌కు అజేయంగా 50 పరుగులు జోడించడంతో పంజాబ్ మరో 13 బంతులు విగిలుండగానే గెలుపు గీత దాటింది.

ఆదుకొన్న రుతురాజ్: పంజాబ్ స్పిన్నర్లు హర్‌ప్రీత్, చాహర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినా.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అర్ధ శతకంతో చెన్నై పోరాడగలిగే స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నైకు ఓపెనర్లు రహానె, రుతురాజ్ తొలి వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యంతో నిలకడైన ఆరంభాన్నిచ్చారు. అర్ష్‌దీప్ తొలి రెండు ఓవర్లలో గైక్వాడ్ నాలుగు బౌండ్రీలు బాదగా.. కర్రాన్ బౌలింగ్‌లో రహానె హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగాడు. దీంతో పవర్‌ప్లేను చెన్నై 55/0తో మెరుగ్గా ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో స్పిన్ మాయాజాలానికి చెన్నై విలవిల్లాడింది. 8వ ఓవర్‌లో రహానెతోపాటు శివమ్ దూబే (0)ను అవుట్ చేసిన బ్రార్ ప్రత్యర్థికి షాకిచ్చాడు. జడేజా (2)ను చాహర్ ఎల్బీగా వెనక్కి పంపాడు. కేవలం 6 పరుగుల తేడాతో 3 కీలక వికెట్లు కోల్పోయిన సీఎస్‌కే 70/3తో కష్టాల్లో పడింది. ఈ దశలో రిజ్వీ (21), గైక్వాడ్ నాలుగో వికెట్‌కు 37 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌తో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. క్రీజులో ఉన్నంతసేపు తడబడిన రిజ్వీని రబాడ వెనక్కి పంపాడు. దాదాపు 11 ఓవర్లపాటు ఒక్క బౌండ్రీ కూడా కొట్టని రుతురాజ్.. 17వ ఓవర్‌లో కర్రాన్ బౌలింగ్‌లో 4,6తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. మొయిన్ అలీ (15)తో కలసి 5వ వికెట్‌కు 38 పరుగులు జోడించిన గైక్వాడ్‌ను అర్ష్‌దీప్ బౌల్డ్ చేశాడు. అలీని చాహర్ వెనక్కిపంపినా.. ఆఖరి ఓవర్‌లో ధోనీ 4,6తో టీమ్ స్కోరును 160 మార్క్ దాటించాడు. అయితే, చివరి బంతికి రన్ తీసే క్రమంలో మహీ అవుటయ్యాడు.

స్కోరుబోర్డు

చెన్నై: రహానె (సి) రొసో (బి) హర్‌ప్రీత్ 29, రుతురాజ్ (బి) అర్ష్‌దీప్ 62, శివమ్ దూబే (ఎల్బీ) హర్‌ప్రీత్ 0, జడేజా (ఎల్బీ) రాహుల్ చాహర్ 2, సమీర్ రిజ్వీ (సి) హర్షల్ (బి) రబాడ 21, మొయిన్ (బి) రాహుల్ చాహర్ 15, ధోనీ (రనౌట్) 14, మిచెల్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 20 ఓవర్లలో 162/7; వికెట్లపతనం:** 1-64, 2-65, 3-70, 4-107, 5-145, 6-147, 7-162; **బౌలింగ్:** రబాడ 4-0-23-1, అర్ష్‌దీప్ 4-0-52-1, కర్రాన్ 3-0-37-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-17-2, రాహుల్ చాహర్ 4-0-16-2, హర్షల్ పటేల్ 1-0-12-0.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్ (సి) రుతురాజ్ (బి) గ్లీసన్ 13, బెయిర్ స్టో (సి) ధోనీ (బి) దూబే 46, రొసో (బి) శార్దూల్ 43, శశాంక్ (నాటౌట్) 25, కర్రాన్ (నాటౌట్) 26, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 17.5 ఓవర్లలో 163/3; వికెట్లపతనం:** 1-19, 2-83, 3-113; **బౌలింగ్:** దీపక్ చాహర్ 0.2-0-4-0, శార్దూల్ 3.4-0-48-1, గ్లీసన్ 3.5-0-30-1, ముస్తాఫిజుర్ 4-1-22-0, జడేజా 3-0-22-0, మొయిన్ 2-0-22-0, శివమ్ దూబే 1-0-14-1.

5
చెన్నైతో గత ఐదు మ్యాచ్‌ల ముఖాముఖిలో 5-0తో పంజాబ్‌దే పైచేయి.

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: హైదరాబాద్

హైదరాబాద్ X రాజస్థాన్



క్లాసెన్‌తో బట్లర్

హోరాహోరీకి ఉప్పల్ సిద్ధం

సన్‌రైజర్స్‌తో రాజస్థాన్ పోరు నేడు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈ సీజన్ ఐపీఎల్ టేబుల్ టాపర్ రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్)ను సొంతగడ్డపై ఢీకొట్టేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) సన్నద్ధమైంది. గురువారం ఈ రెండు జట్ల మధ్య ఉప్పల్ స్టేడియం వేదికగా హోరాహోరీ పోరు ఖాయంగా కనిపిస్తోంది. గత రెండు మ్యాచ్‌ల్లో ఓటమి చవి చూసిన ఎస్ఆర్‌హెచ్, వరుస విజయాలతో జోష్‌లో ఉన్న రాయల్స్ జోరుకు బ్రేకులు వేసి, తిరిగి గెలుపుబాట పట్టాలని వ్యూహాలు పన్నుతోంది. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉండి కూడా గత రెండు మ్యాచ్‌ల్లో ఛేదనలో విఫలమైన ఎస్ఆర్‌హెచ్, ఆ లోపాన్ని అధిగమించేందుకు కసరత్తు చేస్తోంది. మరోవైపు బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ బలంగా ఉన్న రాజస్థాన్ ఈ మ్యాచ్‌లో రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించే ఆలోచనలో ఉన్నట్టు కోచ్ కుమార సంగక్కర తెలిపాడు. ఇక, పిచ్ ఛేదన జట్టుకు అనుకూలించే అవకాశాలున్నాయి.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	9	8	1	0	16	0.694
కోల్‌కతా	9	6	3	0	12	1.096
లఖ్‌నవూ	10	6	4	0	12	0.094
చెన్నై	10	5	5	0	10	0.627
హైదరాబాద్	9	5	4	0	10	0.075
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
పంజాబ్	10	4	6	0	8	-0.062
గుజరాత్	10	4	6	0	8	-1.113
ముంబై	10	3	7	0	6	-0.272
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఇండో-పాక్ మ్యాచ్ కోసం మొబైల్ పిచ్‌లు వచ్చేశాయ్!


నసౌ స్టేడియం దాదాపు రెడీ



దుబాయ్: టీ20 వరల్డ్‌కప్‌లో భారత్, పాకిస్థాన్ తలపడనున్న న్యూయార్క్‌లోని నసౌ కౌంటీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం దాదాపు సిద్ధమైంది. నిర్మాణంలో ఉన్న ఈ మైదానంలో జరిగే 8 మ్యాచ్‌ల కోసం అత్యంత కీలకమైన డ్రాప్ డౌన్ (మొబైల్) పిచ్‌ల అమరిక ఆరంభమైందని ఐసీసీ బుధవారం తెలిపింది. అడిలైడ్ ఓవల్ హెడ్ క్యూరేటర్ డామియన్ హూగ్ పర్యవేక్షణలో ఫ్లోరిడాలో తయారు చేసిన పది పిచ్‌లను భారీ ట్రక్కుల ద్వారా స్టేడియానికి తరలించారు. వీటిల్లో నాలిగింటిని మ్యాచ్‌ల కోసం, మిగతా ఆరు పిచ్‌లను ప్రాక్టీస్ కోసం ఉపయోగించనున్నారు.

మావాడి హృదయం ముక్కలైంది

క్రికెటర్ రింకూ తండ్రి నిరాశ



న్యూఢిల్లీ: డ్యాషింగ్ బ్యాటర్ రింకూసింగ్ టీ20 ప్రపంచ కప్ జట్టు ఎంపికపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. కానీ మంగళవారం ప్రకటించిన తుది 15 మంది జట్టులో అతడికి చోటు దక్కలేదు. వరల్డ్‌కప్ జట్టులో స్థానం దక్కలేదని తెలిసి తన కుమారుడి గుండె పగిలిందని రింకూ తండ్రి ఖన్‌చంద్ర సింగ్ వెల్లడించాడు. తాము కూడా ఎంతో ఆశతో ఉన్నామని, కుమారుడి ఎంపికను సెలబ్రేట్ చేసుకొనేందుకు మిఠాయిలతోపాటు బాణసంచాను కూడా తెచ్చి ఉంచామని ఖన్‌చంద్ర తెలిపాడు. కాగా చెన్నై ఆల్‌రౌండర్ శివమ్ దూబే తాజా ఐపీఎల్‌లో అద్భుతంగా ఆడుతుండడం కూడా రింకూ అవకాశాలను దెబ్బ తీసింది. మరోవైపు రింకూను బలిపశువుని చేశారని టీమిండియా మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ధ్వజమెత్తాడు. 'జైస్వాల్‌నో, లేక ఇంకెవరినైనా తప్పించి రింకూను తీసుకోవాల్సింది' అని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు.

భారత్‌కు రెండో స్థానం

థామస్ కప్ క్వార్టర్స్‌లో చైనాతో ఢీ నేడు

చెంగ్డూ (చైనా): థామస్ కప్‌లో భాగంగా బుధవారం జరిగిన తమ గ్రూప్-సి ఆఖరి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ భారత్ 1-4తో ఇండోనేసియా చేతిలో ఓటమి పాలైంది. కాగా, ఈ రెండు జట్లు ఇప్పటికే క్వార్టర్స్‌కు అర్హత సాధించినా, తాజా పోరుతో గ్రూప్-సి నుంచి ఇండోనేసియా టాపర్‌గా నిలవగా, భారత్ రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఇక, ఇండోనేసియాతో పోరులో ప్రణయ్ మినహా, భారత షట్లర్లంతా ఓడారు. కాగా భారత పురుషుల జట్టు చైనాతో, మహిళల జట్టు జపాన్‌తో గురువారం క్వార్టర్స్‌లో తలపడనున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

1940ల నాటి ప్రచ్ఛన్నయుద్ధకాలంలో కొన్ని దేశాలు కలిసి ఒక బలగంగా ఏర్పడ్డాయి. తమలో ఏ ఒక్క దేశ భద్రతకు ప్రమాదం వచ్చినా, మిగతా దేశాలన్నీ కలిసి పోరాడటమే తమ కూటమి ప్రధాన లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి. అయితే కాలక్రమంలో పరిస్థితులు, లక్ష్యాల ప్రాధాన్యాలు మారాయి. బలగం మరింత పెరిగి లక్ష్యం పలుచనైన సందర్భాలు ఎదురయ్యాయి. అయినప్పటికీ 75 వసంతాలు పూర్తిచేసుకొని, నేటికీ బలవత్తర శక్తిగా విరాజిల్లుతున్న ఆ కూటమి 'నాటో' (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్).

75 వసంతాల నాటో కూటమి

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో రష్యా సామ్రాజ్యవాదాన్ని, విస్తరణ కాంక్షను ఎదుర్కోవడానికి కొన్ని పాశ్చాత్య దేశాలు కలిసి 'సమష్టి భద్రత' లక్ష్యంతో ఏర్పాటు చేసుకున్న బహుళపక్ష కూటమే 'నాటో'. 1949 ఏప్రిల్ 4న ఈ కూటమి ఏర్పడింది. ఐక్యరాజ్య సమితి చార్టర్‌లోని 'ఆర్టికల్ 51' నిర్దేశిస్తున్న 'ప్రతి దేశానికి వైయక్తికంగా లేదా ఇతర దేశాలతో ఉమ్మడిగా భద్రతా చర్యలు తీసుకునే హక్కు ఉంది' అనే అంశం ప్రాతిపదికగా, నాటో ఏర్పాటుకు సంబంధించి ప్రారంభ సభ్య దేశాలన్నీ కలిసి 'వాషింగ్టన్ ఒప్పందం'పై సంతకాలు చేశాయి.

- ఈ వాషింగ్టన్ ఒప్పందంలోని ఆర్టికల్ 5లో నాటో ఏర్పాటుకు ప్రధాన ఉద్దేశమైన 'రష్యా సామ్రాజ్యవాదం, ఐరోపాలోని తూర్పు ప్రాంతాల నుంచి ఖండంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా అడ్డుకోవడం' అనే అంశాన్ని చేర్చింది. దీనినే 'సమష్టి భద్రత'గా వర్ణించారు. అంటే ఈ ఒప్పందం/ కూటమిలోని ఏ సభ్యదేశానికి రష్యా మూలంగా ముప్పు ఏర్పడినా, మిగతా అన్ని దేశాలు కలిసి రష్యాకు వ్యతిరేకంగా పోరాడుతాయన్నది దీని సారాంశం.
- ప్రారంభంలో నాటోలో 12 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. అవి- అమెరికా, బ్రిటన్(యునైటెడ్ కింగ్‌డమ్), పోర్చుగల్, నార్వే, నెదర్లాండ్స్, లక్సెంబర్గ్, ఇటలీ, ఐస్‌లాండ్, ఫ్రాన్స్, డెన్మార్క్, కెనడా బెల్జియం. తదనంతర కాలంలో సభ్యదేశాల సంఖ్య 32కి చేరింది. నాటో బెల్జియంలోని బ్రస్సెల్స్ కేంద్రంగా పనిచేస్తుంది.
- అయితే 90ల్లో సోవియట్ రష్యా విచ్ఛిన్నమై, ప్రచ్ఛన్నయుద్ధ పరిస్థితులు ముగిసిన తరవాత కూడా ఈ కూటమి విస్తరించడం, కొత్తదేశాలు ఎప్పుడైనా చేరేందుకు వీలుగా ఓపెన్‌డోర్ పాలసీని నాటో అనుసరిస్తుండటం వంటి చర్యలు ఈ కూటమి ఏర్పడటానికి ఉద్దేశించిన మౌలిక లక్ష్యాన్ని ప్రశ్నిస్తున్నాయి. అయితే 'సమష్టి భద్రత' అంశాన్ని ఆధునిక రాజకీయ పరిస్థితులకు, ముఖ్యంగా చైనా దూకుడును అరికట్టేందుకు వీలుగా మలచుకొంది. అలాగే ఇతర లక్ష్యాలైన ప్రజాస్వామ్య పరిస్థితుల సాధన, శాంతిస్థాపన, సంఘర్షణ నిరోధం, సంక్షోభ సమయాల్లో సహాయం వంటి అంశాలపరంగా ఈ కూటమి దిశానిర్దేశం చేసుకుంది.
- అయితే పాతలక్ష్యంపరంగా, కొత్త లక్షణాలపరంగా - ఎలా చూసినా ఈ కూటమి ఎప్పుడూ శాంతిస్థాపనకు, పరిస్థితుల సర్దుబాటుకు కృషి చేయలేదనే అపవాదు ప్రముఖంగా వినిపిస్తూ ఉంటుంది. కూటమి ఏర్పాటు కాలం నుంచి ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా నాటో పాల్గొన్న రమారమి 200 ప్రత్యక్ష చర్యల్లో 20 వరకూ చాలా ప్రముఖమైన మిలిటరీ చర్యలున్నాయి. ఉదాహరణకు యుగోస్లేవియాపై బాంబు దాడులు, ఇరాక్ ఆక్రమణ, లిబియా దేశాన్ని ఒక రాజ్యంగా తన మనుగడ కోల్పోయే స్థితికి తీసుకురావడం, దాదాపు 20 ఏళ్లపాటు ఆఫ్గనిస్థాన్‌ను అతలాకుతలం చేసిన ఉగ్రవాదులపై దాడులు వంటి అనేక అంశాలు నాటో కూటమి చర్యలపై తీవ్ర విమర్శలకు కారణమయ్యాయి. ఇరాక్‌లో ఇప్పటికీ పరిస్థితులు సద్దుమణగకపోవడం, లిబియాలో ఐఎస్ఐఎస్ బలవత్తర శక్తిగా ఎదగడం, యుగోస్లేవియా ఒక దేశంగా విచ్ఛిన్నమై అనేక చిన్న చిన్న పేద దేశాలుగా యూరప్‌లోనే బీద దేశాలుగా మారిపోయిన పరిస్థితులు, ఆఫ్గనిస్థాన్‌లో ప్రజాస్వామ్య స్థాపన, శాంతియుత పరిస్థితులు, ఉగ్రమూకల ఏరివేత లక్ష్యంతో చర్యలు ప్రారంభించిన నాటో ఆ లక్ష్యాలను అర్ధాంతరంగా వదిలి వెనుదిరిగిపోవడం వంటివి నాటో వైఫల్యంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

> *నాటోలో ఉన్న అయిదు విధాన నిర్ణాయక కమిటీలైన మిలిటరీ కమిటీ, పొలిటికల్ కమిటీ, పాలసీ కోఆర్డినేషన్ కమిటీ ఎగ్జిక్యూటివ్ వర్కింగ్ గ్రూప్, సీనియర్ రిసోర్స్‌బోర్డ్ వంటి వాటి విస్తరణ, కార్యక్రమ పరిధి పెంచాల్సిన అవసరం ఉంది.*

- అంతేకాక ఉక్రెయిన్ నాటోలో చేరడం వల్లే రష్యా ఆ దేశంపై దాడికి దిగింది. అదే రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి దారితీసిందన్నది జగమెరిగిన సత్యం. అదేవిధంగా ప్రస్తుతం ఇజ్రాయెల్ ఇరాన్ ఉద్రిక్తతల్లోనూ నాటో పాత్ర ఉంది. ఇజ్రాయెల్‌కు మద్దతిస్తున్న నాటో మరో యుద్ధానికి ఆజ్యం పోస్తుందనే సందేహాలూ ఉన్నాయి. ఈ విధంగా 'సమష్టి భద్రత' లక్ష్యంగా ఏర్పడిన నాటో, ఎప్పుడూ విధ్వంసాన్నే మిగిల్చిందన్న అపవాదు మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో మిలిటరీ మద్దతుపరంగా దేశాలు జతకట్టడం ఏ మేరకు భద్రత, శాంతియుత పరిస్థితులను ఏర్పరుస్తుందనే ప్రశ్నలూ తలెత్తుతున్నాయి. అయితే మధ్యధరా సముద్ర ప్రాంతం, సొమాలియా తీరప్రాంతాల్లోనూ ఉగ్రవాదులను, సముద్ర దొంగలను కట్టడి చేయడంలో, అదేవిధంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో 'ఆపరేషన్ ఓషన్ షీల్డ్' వంటి సుదీర్ఘ రక్షణ చర్యలు చేపట్టి సరుకు రవాణా నౌకలకు భద్రతనిచ్చిన కార్యక్రమాలపరంగా, 2005లో కశ్మీర్ భూకంపం వంటి విపత్తుల సమయంలో నాటో దళాల సేవలు, ఫ్రాన్స్-జర్మనీ వంటి ఆగర్భ శత్రుదేశాల మధ్య సంయమన వేదికగా నాటో పనిచేయడం వంటి అనేక సకారాత్మక అంశాలూ కూటమి అవసరాన్ని తెలుపుతున్నాయి.
- ఈ కూటమిని ప్రపంచ శ్రేయస్సుకు, శాంతి సుస్థిరతల స్థాపన దిశగా పయనింపచేయాల్సిన అవసరం ప్రస్తుత కాలంలో ఎంతైనా ఉంది. అందుకు మేధావులు కొన్ని సూచనలు చేస్తూ ఉన్నారు అవి:

1. నాటో తన లక్ష్యాన్ని ప్రపంచ శాంతి, సుస్థిరతల కోణంలో పునర్ నిర్వచించుకోవాల్సిన అవసరం ఉంది.
2. 'సమష్టి భద్రత' లక్ష్యం ఏదో ఒక దేశానికో, కూటమికో వ్యతిరేకంగా కాక ప్రపంచవ్యాప్తంగా నేడు అభద్రతను రేకెత్తిస్తున్న సైబర్ నేరాలు, అణ్వాయుధాలు, జీవాయుధాల విస్తరణ, ఉగ్రవాద కార్యకలాపాలు, మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాలు, వాతావరణ మార్పుల ప్రమాదాలపరంగా పునర్ నిర్వచించుకోవాల్సి ఉంది.
3. సభ్యదేశాల మధ్య తరచూ తలెత్తుతున్న వివాదాలను, అభిప్రాయ భేదాలను పరిష్కరించడానికి ఒక అంతరంగిక వ్యవస్థ అవసరం. ప్రతీ నిర్ణయం, కొత్త దేశాల ప్రవేశానికి అనుమతి ఇవ్వడం వంటి అంశాలు సమష్టి సమ్మతితోనే నాటోలో సాధ్యం. అయితే మూడు పదులకు పైనే ఉన్న సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం సాధించడం కష్టతర వ్యవహారం. కాలయాపనతో కూడుకున్నది, సభ్యదేశాల వ్యక్తిగత లాభనష్టాలు ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకని నిబంధనలపరమైన మార్పు అవసరమే.
4. నాటోలో ఉన్న అయిదు విధాన నిర్ణాయక కమిటీలైన మిలిటరీ కమిటీ, పొలిటికల్ కమిటీ, పాలసీ కోఆర్డినేషన్ కమిటీ ఎగ్జిక్యూటివ్ వర్కింగ్ గ్రూప్, సీనియర్ రిసోర్స్‌బోర్డ్ వంటి వాటి విస్తరణ, కార్యక్రమ పరిధి పెంచాల్సిన అవసరం ఉంది.
5. నాటోలో కేవలం 11 దేశాలే అత్యధికంగా నిధులు చేకూరుస్తున్నాయి. మిగతా దేశాలు నిర్దేశితస్థాయిలో నిధులు అందించడం లేదు. పైగా ఏదైనా నాటో చర్యల్లో భాగం కావడం అనేది పలు సభ్యదేశాల అభీష్టం మేరకే ఉంటుంది. కాబట్టి నాటో నిధులు అధికంగా చేకూరుస్తున్న దేశాలు, వ్యక్తిగత కారణాలున్న దేశాల అభీష్టపరంగా నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రతి సభ్యదేశానికి ఒక కటాఫ్ షేర్ కనీసంగా ఉండేలా, సైనిక చర్యలపరంగా అన్ని దేశాల భాగస్వామ్యం సమానంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.
6. రష్యాకు లేదా ఏదైనా ఇతర దేశాలకు వ్యతిరేకంగా రక్షణ పొందడానికి సైనిక సమీకరణ కూటమిగా కాక, వివిధ సంఘర్షణలను పరిష్కరించుకోవడానికి చర్చా వేదికగా, సంప్రదింపుల వారధిగా నాటో ప్రాథమిక లక్ష్యంలో ప్రపంచశాంతి నిమిత్తం సంస్కరణలు రావాల్సి ఉంది.

ఈ విధంగా ప్రపంచశాంతి దృక్పథంలో నాటో తనను తాను పునర్ నిర్వచించుకున్నప్పుడు ప్రపంచ పురోభివృద్ధి సాధ్యమవుతుంది. నాటో 75 వసంతాల వేడుక సందర్భంగా 2024 ఏప్రిల్ 4న నాటో సెక్రటరీ జనరల్ సగర్వంగా చేసిన ప్రకటనలోని 'నాటో ఇప్పుడు మరింత పెద్దగా, మరింత శక్తిమంతంగా, మరింత సమైక్యంగా పరిణామం చెందింది' అన్న మాటలకు ప్రపంచం హర్షిస్తుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

జాబ్ కార్నర్



ఎయిర్‌పోర్ట్ సర్వీస్ లిమిటెడ్‌లో వివిధ ఖాళీలు

ఖాళీలు **145**

ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్, న్యూఢిల్లీ.. తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టుల వివరాలు

1. జూనియర్ ఆఫీసర్- టెక్నికల్: **2 పోస్టులు**
2. కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: **21 పోస్టులు**
3. జూనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: **21 పోస్టులు**
4. ర్యాంప్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: **18 పోస్టులు**
5. యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్: **17 పోస్టులు**
6. హ్యాండీమన్: **66 పోస్టులు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ ఇంజనీరింగ్‌లో మెకానిక్, గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఇంటర్, ఐటీఐ, ఎస్ఎస్‌సీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 28 సంవత్సరాలు మించరాదు.
ఇంటర్వ్యూ తేదీలు: 2025 మే 8, 9, 10, 11
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ తదితరాలు
ప్రదేశం: మధ్యవార్డ్ ఏవియేషన్ అకాడమీ, 102 వినాయక్ ప్లాజా, డాక్టర్స్ కాలనీ బుద్‌సింగ్ పుర, సంగనీర్, జైపూర్.
వెబ్‌సైట్: https://www.aiasl.in/Recruitment

ఎన్ఐఆర్‌టీలో ప్రాజెక్ట్ డ్రైవర్లు

ఖాళీలు **15**

ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ ట్యూబర్‌కులోసిస్...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
పోస్టు: ప్రాజెక్ట్ డ్రైవర్ కమ్ మెకానిక్
అర్హత: పదోతరగతి ఉత్తీర్ణత. లైట్ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 25 ఏళ్లు మించరాదు.
జీతం: నెలకు రూ.16,000
ఉద్యోగ స్థానం: తమిళనాడు, కేరళ, బిహార్, రాజస్థాన్, ఆగ్రా (ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్), గోరఖ్‌పూర్ (యూపీ), నోయిడా(ఢిల్లీ అండ్ యూపీ, పంజాబ్ అండ్ హరియాణా), ఒడిశా, తెలంగాణ, అసోం, గుజరాత్, మహారాష్ట్ర, కోల్‌కతా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో **ఇంటర్వ్యూ తేదీ:** మే 9
దరఖాస్తుకు చివరి తేదీ: మే 6
వేదిక: ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ ట్యూబర్‌కులోసిస్ నెం.1, మేయర్ సత్యమూర్తి రోడ్, చెట్‌పేట్, చెన్నై.
వెబ్‌సైట్: https://nirt.res.in/

టీహెచ్ఎస్‌టీఐలో జూనియర్ రీసెర్చ్ పోస్టులు

ఫరీదాబాద్(హరియాణా)లోని ప్రభుత్వరంగ సంస్థకు చెందిన ట్రాన్స్‌లేషనల్ హెల్త్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్‌టీఐ)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. జూనియర్ రీసెర్చ్ సైంటిస్ట్: **1 పోస్టు**
2. మేనేజ్‌మెంట్ అసిస్టెంట్: **1 పోస్టు**

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఎంటెక్, లైఫ్/మెడికల్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి.
వయోపరిమితి: జూనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు 35 ఏళ్లు, మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ పోస్టుకు 30 ఏళ్లు మించరాదు.
జీతం: జూనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు రూ.85,000. మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ పోస్టుకు రూ.60,000.
దరఖాస్తు ఫీజు: రూ.590. ఎస్సీ, ఎస్టీ, మహిళలు, దివ్యాంగ అభ్యర్థులకు రూ.118.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
వెబ్‌సైట్: https://thsti.res.in/

టీఎంసీలో ఎల్‌డీసీ, స్టెనోలు

ఖాళీలు **28**

ముంబయిలోని టీఎంసీ-టాటా మెమోరియల్ హాస్పిటల్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. మెడికల్ ఫిజియోసిస్ట్: **1 పోస్టు**
2. లోయర్ డివిజన్ క్లర్క్: **3 పోస్టులు**
3. స్టెనోగ్రాఫర్: **1 పోస్టు**
4. ఫీమేల్ నర్స్: **22 పోస్టులు**
5. టెక్నీషియన్ 'సి': **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో 12వ తరగతి, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక విధానం: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 7
వెబ్‌సైట్: tmc.gov.in

రిమైండర్

నిఫ్టెమ్‌లో ఎంటెక్, ఎంబీఏ

హరియాణాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్)- ఎంటెక్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్/నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. సంస్థ నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్ అందిస్తారు.

ఎంటెక్

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఫుడ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్లాంట్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం సంబంధిత సబ్జెక్టులతో బీఈ/బీటెక్/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. ఎంపిక ప్రక్రియలో ముందుగా గేట్ అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారు.
ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్ అంశాలనుంచి మొత్తం 30 ప్రశ్నలు; అభ్యర్థి ఎంచుకొన్న సెక్షన్ నుంచి 70 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం గంటన్నర.
సెక్షన్లు: ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్; ఫుడ్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ప్రాసెస్ ఇంజనీరింగ్, బయో కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్; ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్; ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ; అగ్రికల్చర్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ.

ఎంబీఏ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీని స్పెషలైజేషన్ ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 60 సీట్లు ఉన్నాయి. సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. క్యాట్/మ్యాట్/సీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.
ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఇందులో మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. లాజికల్ రీజనింగ్/డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 15, క్వాంటిటేటివ్ అనాలిసిస్ నుంచి 15, వెర్బల్ ఎబిలిటీ/రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **వెబ్‌సైట్:** www.niftem.ac.in

లిటిల్స్



వంకాయ కూర!

శ్రీకృష్ణదేవరాయల రాజ్యంలో ఒక రోజు బ్రహ్మాండమైన విందు భోజనం తిన్నారంతా. అందులో తెనాలి రామకృష్ణ ఉన్నారు. కూరలన్నింటిలో వంకాయ కూర బావుందని చాలామంది మెచ్చుకున్నారు. రాజు పొంగిపోయారు. తెనాలి రామకృష్ణ ఇంటికి వెళ్లి తన భార్యతో ఈ విషయం చెప్పారు. ఆమెకు వంకాయ కూర తినాలనిపించింది. వెంటనే ఆ కూరగాయలు కావాలని అడిగింది. 'తెలివి తక్కువ దానా.. రాజుగారికి తెలియకుండా దొంగిలించామనుకో. దొరికామనుకో శిక్షనే' అన్నాడు. తన భార్య మొండికి వేసే సరికి చివరకు సరేనన్నాడు. తెనాలి రామకృష్ణ రాజ్యంలోకి వెళ్లి ఎవరూ లేని సమయంలో వాటిని దొంగిలించి తీసుకొచ్చాడు. ఇంట్లో తన భార్య సంతోషపడింది. కూర చేసింది. ఆ సమయంలో కొడుకు ఆరుబయట నిద్రపోతున్నాడు. 'అబ్బాయిని పిలుచుకురండి' అన్నది. బక్కెట్ నీళ్లను తన కొడుకు మీద పోశాడు. నిద్రలో ఉండే తన కొడుకు ఉలిక్కిపడి లేచాడు. 'వాన వస్తోంది లోపలికి వెళ్లు' అన్నాడు తెనాలి రామకృష్ణ. కుటుంబమంతా వంకాయ కూర తిన్నారు.



ఉదయాన్నే రాజుగారి పెరడులో వంకాయలు లేనిది చూసి భటులు ఆయనకు చెప్పారు. ఎవరో దొంగతనం చేశారని సెలవిచ్చారు. తీవ్రంగా ఆలోచించారు. 'తెనాలి రామకృష్ణగారు వేళకాని వేళలో వచ్చారు. ఇంటికి వెళ్తుంటే చూశాను' అన్నాడో భటుడు. 'దొరికాడు దొంగ' అన్నాడు రాజుగారు. తెనాలి రామకృష్ణ, తన భార్యను పిలిపించారు. తెనాలి రామకృష్ణ కొడుకును కూడా పిలిపించాడు. 'బాలుడు కాబట్టి నిజమే చెబుతాడు. నిన్న రాత్రి ఏమి తిన్నావు' అన్నాడు. 'వంకాయ కూర రాజుగారు. రుచి భలే ఉంది' అంటూనే సభలో అందరూ నవ్వారు. రామకృష్ణ ఇంత పని చేశాడా? అన్నారు. ఇంతలో రామకృష్ణ కలగజేసుకుని.. 'మహాప్రభూ.. మా వాడికి కలలు ఎక్కువ. కలలో తిన్నానని చెబుతున్నాడేమో. ఒక్కసారి అడగండి. నిన్న వానపడుతోంది కదా?' అని. ఆ కుర్రోడు 'అవును. నిన్న వాన పడింది. నిద్రలేచి వంకాయ కూర తిన్నా' అన్నాడు. అంతలో తెనాలి రామకృష్ణ ఇలా అన్నారు.. 'అయ్యా.. నిన్న వానలేదు. వాతావరణం పొడిగా ఉంది. మా వాడికి కలలు వస్తుంటాయి ఇలా' అన్నాడు. 'నిన్న వానపడింది కదా బాగా' అన్నాడు బాలుడు. 'నేను అనుకున్నది తప్పు. పొరబడ్డాను రామకృష్ణ' అన్నారు రాజుగారు.

మాన్‌స్టర్స్ ఎన్ని?



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



6 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 296

4		8					6	
			5	2			8	
					6	3		7
			7	9				1
7	8						5	4
2				4	5			
6		4	2					
	2			7	8			
	3					1		2

సుడోకు - 295 సమాధానం

3	7	8	4	2	6	1	9	5
5	2	9	7	8	1	6	3	4
6	1	4	3	5	9	7	8	2
9	8	6	2	1	3	4	5	7
7	3	2	9	4	5	8	1	6
4	5	1	8	6	7	9	2	3
1	4	5	6	9	2	3	7	8
8	9	7	5	3	4	2	6	1
2	6	3	1	7	8	5	4	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.